సోమవారం
3-3-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 161
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
# విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

## జెలెన్స్కీ... ట్రంప్‌తో రాజీ కుదుర్చుకోవాలి: రుట్టే

**వాషింగ్టన్:** అమెరికా, ఉక్రెయిన్ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, వొలొదిమిర్ జెలెన్స్కీ మధ్య మాటల యుద్ధం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ట్రంప్‌తో సంబంధాలను జెలెన్స్కీ పునరుద్ధరించుకోవాలని, ఆయనతో రాజీకి రావాలని నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రుట్టే అన్నారు. జెలెన్స్కీకి ఇదే సలహా ఇచ్చినట్లు బీబీసీకి ఆయన చెప్పారు. ఉక్రెయిన్ కోసం ఇంతకాలం చేసినదానికిగాను ట్రంప్‌ను జెలెన్స్కీ అమితంగా గౌరవించాలని రుట్టే అన్నారు. 'ట్రంప్, జెలెన్స్కీ మధ్య ఓవల్ ఆఫీసులో జరిగినది దురదృష్టకరం. ఉక్రెయిన్‌లో సుస్థిర శాంతికి అమెరికా కట్టుబడి ఉందన్నది వాస్తవం' అని రుట్టే తెలిపారు. లండన్‌లో ఆదివా రం యూరోప్ నాయకులు భేటీ క్రమంలో ఉక్రెయిన్ కోసం భద్రతా హామీలతో శాంతి ఒప్పందం కుదరగలదని భావిస్తున్నట్లు వెల్లడించారు.

## మాధవి బచ్‌పై ఎఫ్ఐఆర్

**ముంబై:** స్టాక్ మార్కెట్ మోసాలు, రెగ్యులేటరి ఉల్లంఘనలు, అవినీతి వంటి ఆరోపణలతో సెబీ మాజీ చైర్‌పర్సన్ మాధవి పురి బచ్ న్యాయ చిక్కుల్లో పడ్డారు. ఆమెతో పాటు మరో ఐదుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అవినీతి నిరోధక బ్యూరో (ఏసీబీ)ను ప్రత్యేక కోర్టు ఆదేశించింది. నిష్పాక్షిక విచారణ జరిపించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. కోర్టు పర్యవేక్షణలో విచారణ జరుగుతుందని తెలిపింది. 30 రోజుల్లో స్టేటస్ రిపోర్టు ఇవ్వాలని ఆదేశించింది. థానేకు చెందిన రిపోర్టర్ సపన్ శ్రీవాత్సవ ముంబైలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టిన

- మిగతా 2 లో

## తీరు మార్చుకోని తమిళనాడు గవర్నర్

**చెన్నై:** తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి తన పద్ధతి మార్చుకోవడం లేదు. నోటి దురుసు పోనిచ్చుకోవడంలేదు. తరచూ రాష్ట్ర ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కుతూ వివాదాలకు తెరతీస్తున్నారు. 1974లో జరిగిన తప్పిదంలో డీఎంకేకూ బాధ్యత ఉందని, అప్పట్లో రాష్ట్రంలో ఈ పార్టీ అధికారంలోకి ఉందని గవర్నర్ రవి వ్యాఖ్యానించారు. మత్స్యకారుల సమస్యను రాజకీయం చేయడం, కేంద్రాన్ని నిందించడం మానుకొని నిర్మాణాత్మకంగా ముందుకెళ్లి బాధితుల కన్నీళ్లు తుడవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి అన్నారు. శ్రీలంక

- మిగతా 2 లో

## ఇరాన్ కరెన్సీ పతనం

**టెహ్రాన్:** ఇరాన్ కరెన్సీ పతనమవుతోంది. దీంతో ఆర్థిక నిర్వహణలో లోపాలు ఉన్నాయంటూ ఆరోపణలు వచ్చాయి. ఈ పరిణామాల క్రమంలో ఆర్థిక మంత్రి అబ్దోల్‌నాజెర్ హెమ్మతి అభిశంసనకు గురయ్యారు. పార్లమెంటులో ఆదివారం ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి 273 మంది సభ్యుల్లో 182 మంది అనుకూలంగా ఓటేసినట్లు స్పీకర్ ఖాలిబఫ్ వెల్లడించారు. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం మంత్రి తొలగింపు వెంటనే అమల్లోకి వస్తుంది. ఇరాన్‌లో మసూద్ పెజెష్కియాన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలో ఈ పరిణామం చోటుచేసుకుంది. దేశ ఆర్థిక వ్యవస్థ కఠిన పరిస్థితులను ఎదుర్కొంటోందని ఆర్థికశాఖ మంత్రి

- మిగతా 2 లో

# ఎస్ఎల్‌బీసీ పనుల్లో రోబోల సాయం

- దుర్ఘటనలో రాజకీయాలు తగవు
- బాధిత కుటుంబాలకు అండగా ఉండాలి
- 'పాలమూరు' అభివృద్ధికి అడ్డొస్తే సహించను
- కేసీఆర్ చేసింది శూన్యం
- కిషన్‌రెడ్డి ఓ సైంధవుడు

**విశాలాంధ్ర -దోమలపెంట/ హైదరాబాద్:** ప్రాణ నష్టం ఉండకూడదనే ఉద్దేశంతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో మనుషులు, మిషన్లతో పాటు అవసరమైతే రోబోల సాయం తీసుకునే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పాలమూరు జిల్లా అభివృద్ధికి ఎవరు అడ్డొచ్చినా సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన సభల్లో సీఎం మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరుగుతున్న సహాయకచర్యలను సీఎం, మంత్రులు సొరంగంలోకి వెళ్లి స్వయంగా పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను 2005-06లో ప్రారంభించారన్నారు. 2014లో తెలంగాణ ఏర్పడే నాటికి 32 కిలోమీటర్ల టన్నెల్ పూర్తయిందనీ, ఆతర్వాత అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా పట్టించుకోలేదన్నారు. నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ ప్రాంతానికి కృష్ణా జలాలు అందించాలని నిర్ణయించి తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రాజెక్టును పూర్తి చేయాలని.. ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభించామన్నారు. కానీ, అనుకోకుండా ఈ దుర్ఘటన జరిగిందన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు రాజకీయాలు చేయడం కాదు.. బాధిత కుటుంబాలను ఆదుకోవాలన్నారు. జాతీయ స్థాయిలో నిపుణులైన 11 కేంద్ర సంస్థలు, ప్రైవేటు ఏజెన్సీలు తొమ్మిది రోజులుగా సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నాయన్నారు. గల్లంతైన ఎనిమిది మంది ఆచూకీ తెలియలేదన్నారు. కన్వేయర్ బెల్ట్ పాడవటం వల్ల సిల్టు తొలగించేందుకు ఆటంకం ఏర్పడిందన్నారు. సొరంగంలో గల్లంతైన కుటుంబాలకు అన్ని పార్టీలు అండగా ఉండాలని, ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దురదృష్టకర ఘటనపై విపక్షాలు బురద రాజకీయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

వనపర్తి బహిరంగ సభలో మాట్లాడుతూ పాలమూరు రుణం తీర్చుకోవడానికి తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యానన్నారు. కేసీఆర్ పాలమూరుపై పగబట్టి నట్టేట ముంచాడని ధ్వజమెత్తారు. పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి అయితే ఓర్వ లేకపోతున్నారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే మమ్మల్ని దిగిపొమ్మని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని, పదేళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకున్నారని విమర్శించారు. వనపర్తి ... చదువుతో పాటు తనకు సంస్కారాన్ని ఇచ్చిందని, ఈ ప్రాంతంలో ఎన్నటికి తెగిపోని బంధం నాదని చెప్పారు. వనపర్తి ఆత్మగౌరవాన్ని నిలబెట్టే విధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. 25.50 లక్షల మంది రైతులకు రూ.22 వేల కోట్ల రుణమాఫీ జరిగిందా లేదా గుండెలపై చేయి వేసుకొని చెప్పాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటై ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయని, తమ ప్రభుత్వం రూ.7,625 కోట్లు రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 16 వేల మెగావాట్లకు పెరిగినా విద్యుత్ కోతలు లేకుండా చూస్తున్నామని, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. 50 లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్లు లోపు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని వివరించారు. రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నట్లు వెల్లడించారు. 150 కోట్ల మంది ఆడబిడ్డలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించామని, దాని కోసం రూ. 4,500 కోట్ల చెల్లించామన్నారు. స్వయం సహాయక సంఘాలను కేసీఆర్ నిర్వీర్యం చేశారన్నారు. వనపర్తి సాక్షిగా రూ.వెయ్యి కోట్ల రుణాలను ఆడబిడ్డలకు ఇచ్చామన్నారు. 65 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయాలని ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని ధ్వజమెత్తారు. హైటెక్ సిటీ శిల్పారామం పక్కనే వారి కోసం 150 స్టాల్స్ ఏర్పాటు చేశామని, ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థల పక్కనే మహిళా సంఘాలకు మూడున్నర ఎకరాల స్థలం ఇచ్చామన్నారు. వీరిని సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. వెయ్యి బస్సులను స్వయం సహాయక మహిళలతో కొనుగోలు చేయించి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా చేశామని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులకు బట్టలు కుట్టే పనిని కల్పించామని పేర్కొన్నారు. వాటి నిర్వహణ బాధ్యతను ఇవ్వడంతో పాటు రాష్ట్రంలో 4.50 లక్షల

- మిగతా 2 లో

## సీఐడీ మాజీ డీజీ సునీల్ కుమార్‌పై సస్పెన్షన్ వేటు

### ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ సీఎస్

**విశాలాంధ్ర బ్యూరో - అమరావతి :** ఏపీ సీఐడీ మాజీ డీజీ పీవీ సునీల్ కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. పీవీ సునీల్ కుమార్ 2019 నుంచి 2024 వరకు ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లడం... విదేశాలకు వెళ్లే సమయంలో కొన్ని పర్యటనలకు అనుమతి తీసుకున్నప్పటికీ ట్రావెల్ ప్లానింగ్‌కు విరుద్ధంగా విదేశాల్లో ఉండడంతో ఆయనపై ఆరోపణలు వచ్చాయి. దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించింది. ప్రాథమిక సాక్ష్యాధారాలు నిర్ధారణకావడంతో సునీల్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సునీల్ కుమార్‌పై గతంలో అనేక ఆరోపణలు ఉన్నాయి. ఆయన సీఐడీ డీజీగా ఉన్న సమయంలోనే అప్పటి నరసాపురం ఎంపీ, ప్రసుత్త ఉపసభాపతి రఘురామ కృష్ణరాజుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారనే ఆరోపణలు వచ్చాయి. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను అరెస్టు చేసి వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కస్టోడియల్ టార్చర్‌పై రఘురామ కృష్ణరాజు చేసిన ఫిర్యాదుపై సీఐడీ కేసు నమోదు చేసి విచారణ జరుపుతోంది. సునీల్ కుమార్‌పైనా రఘురామకృష్ణరాజు ఆరోపణలు చేశారు. పీవీ సునీల్ కుమార్ పై సస్పెండ్ వేటు వేయడానికి కారణం మాత్రం ఆయన విదేశాలకు వెళ్లిన సమయంలో ప్రభుత్వ అనుమతి తీసుకోలేదని, మరికొన్ని పర్యటనలకు అనుమతి

- మిగతా 2 లో

# అసమర్థుడు కేసీఆర్

- ప్రజాసమస్యల పరిష్కారంలో వైఫల్యం
- పదేళ్లపాటు దోచుకుని విమర్శలా
- గ్రామాల్లో బీఆర్ఎస్ నేతలను నిలదీయండి
- 31 లోగా రైతుభరోసా జమ
- ఏప్రిల్ 14న స్వయం ఉపాధి పథకాలకు రూ.6 వేల కోట్లు
- వనపర్తి సభలో భట్టి విక్రమార్క

**విశాలాంధ్ర-హైదరాబాద్:** పదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్... ప్రజా సమస్యలను పరిష్కరించని అసమర్థుడని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. వనపర్తిలో శనివారం అభివృద్ధి కార్యక్రమాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ... గడపదాటి బయటకు రాలేని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు... ముఖ్యమంత్రిని, మంత్రులను టార్గెట్ చేస్తూ పాలన చేతకాని సన్నాసులు అంటూ వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోచుకున్న వాళ్లు ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించటం మానుకోవాలని హెచ్చరించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న బీఆర్ఎస్ నేతలను గ్రామాలకు వస్తే నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. దోచుకోవడానికి అలవాటు పడిన బీఆర్ఎస్ నేతలు... తాము రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. దళితులకు మూడు ఎకరాలు ఎందుకు ఇవ్వలేకపోయారు, రూ.లక్ష రుణమాఫీ ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. ఈ నెల 31లోగా రైతుఖాతాలో రైతుభరోసా జమచేస్తామని

- మిగతా 2 లో

## కళలకు ప్రోత్సాహం

- సినీ కళాకారులకు ఉగాదిన 'గద్దర్ ఫిలిం' అవార్డులు
- నాటకరంగంలో రాణిస్తున్నవారికీ ఇచ్చేందుకు నిర్ణయం
- భక్త రామదాసు జయంతి ఉత్సవాల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి

2 లో

## చంద్రుడిపైకి ప్రైవేటు ల్యాండర్



**టెక్సాస్:** అమెరికాలోని ఫైర్‌ఫ్లై ఏరోస్పేస్ సంస్థ ప్రయోగించిన 'బ్లూ ఘోస్ట్' వ్యోమనౌక చంద్రుడి ఉపరితలంపై విజయవంతంగా దిగింది. ఫైర్‌ఫ్లైకు చెందిన మిషన్ కంట్రోల్ దీనిని ధ్రువీకరించింది. 'చంద్రుడిపై ఉన్నాం. ల్యాండర్ స్థిరమైన స్థితిలో ఉంది' అని ప్రకటించింది. దీంతో ఇలా విజయవంతంగా ల్యాండింగ్ చేసిన తొలి ప్రైవేటు సంస్థగా ఫైర్‌ఫ్లై ఏరోస్పేస్ చరిత్ర సృష్టించింది. ఫ్లోరిడాలోని కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి జనవరి 15న స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన ఫాల్కన్-9 రాకెట్.. బ్లూ ఘోస్ట్‌తో పాటు జపాన్‌కు చెందిన మరో ల్యాండర్ 'హకుటో-ఆర్2'ను నింగిలోకి తీసుకెళ్లింది. బ్లూ ఘోస్ట్ ల్యాండర్ జాబిల్లి కక్ష్య నుంచి ఆటోపైలట్ మోడ్‌లో కిందికి ప్రయాణిస్తూ.. ఈశాన్య అంచున మోన్స్ లాట్రెయిల్ సమీపంలో దిగింది. తొలి ఫొటోను పంపించింది. నాసాకు సంబంధించిన 10 ప్రయోగాలను

- మిగతా 2 లో

## ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు నేడు

**విశాలాంధ్ర-హైదరాబాద్:** నల్లగొండ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం ప్రారంభమౌతుంది. గత నెల 27న ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ జరిగింది. ఉదయం ఏడు గంటలకు అభ్యర్థులు... వారి ఏజెంట్ల సమక్షంలో పోలైన ఓట్ల కౌటింగ్ నిర్వహిస్తారు. మొదటి రౌండులో ప్రాధాన్యత ఓట్లు మాత్రం అభ్యర్థుల వారీగా లెక్కిస్తారు. మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వహించేలా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఓట్ల లెక్కింపులో పాల్గొనబోయే సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించేందుకు మాక్ కౌంటింగ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. సందేహాలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మాక్ కౌంటింగ్‌లో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సిబ్బంకి ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు విధానాన్ని, నిబంధనలు, మార్గదర్శకాలను వివరించారు. లెక్కింపు కేంద్రం ఆవరణలో మీడియా సెల్ ఏర్పాటు చేశారు. త్రిముఖ పోటీలో ఉత్కంఠ నికరీంనగర్, ఆలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో ఉత్కంఠ నెలకొంది. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధంచి త్రిముఖ పోటీ ఉండడంతో ఫలితాలపై ఆసక్తి

- మిగతా 2 లో

## ఇదీ లోకం!

# సెమీస్‌లో భారత్

- ఛాంపియన్స్ ట్రోఫీ ఆఖరి లీగ్‌లో కివీస్‌పై అద్భుత విజయం
- రాణించిన వరుణ్ చక్రవర్తి
- విలియమ్సన్, హెన్రీ శ్రమ వృథా

**దుబాయ్:** టీమిండియా అద్భుతమైన ఆటతీరుతో ఛాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్స్‌కు చేరింది. ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో భారత్ 44 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై తిరుగులేని విజయం

- మిగతా 2 లో

# కష్టపడేవారికే పదవులు

- పీసీసీ కార్యవర్గం ఎంపికపై మళ్లీ కసరత్తు
- మీనాక్షి నటరాజన్ సూచనలతోనే మార్పు

**విశాలాంధ్ర-హైదరాబాద్:** తెలంగాణలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(పీసీసీ) రాష్ట్ర కార్యవర్గం ఎంపిక కోసం పేర్లు దాదాపు ఖరారు అనుకోగా... అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్ సూచనలతో ఎంపిక తీరు మారింది. జిల్లాల వారీగా పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించాలని ఆమె స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినందున గతంలో, ఇప్పుడు పనిమంతులకే పదవులివ్వాలని మీనాక్షి సూచించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యేలు, ఎంపీలు... ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన నేతలు, పలుకుబడి ఉన్నవారు పీసీసీలో పదవులు దక్కించుకునేందుకు కసరత్తు సాగుతోంది. అయితే ఎవరిని ఎంపిక చేయాలనే తర్జనభర్జనలో నాయకులు ఉన్నారు. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదేశాలతో రంగంలోకి దిగిన మీనాక్షి.. అధిష్ఠానం సూచనలను పాటిస్తూ పదవుల పందేరం చేపట్టినట్లు సమాచారం. నామినేటెడ్ పదవుల భర్తీకి కూడా జిల్లాల వారీగా అర్హులను గుర్తించాలని జిల్లా ఇంచార్జి మంత్రులకు పీసీసీ సూచించింది. వారు పార్టీ

- మిగతా 2 లో

# ఉక్రెయిన్ శాంతికి బ్రిటన్, ఫ్రాన్స్ ఐక్య కృషి: స్టార్మర్

**లండన్:** ఉక్రెయిన్‌కు భద్రతతో కూడిన శాంతి ఒప్పందం దిశగా తమ వంతు కృషి చేస్తామని బ్రిటన్ ప్రధాని కైర్ స్టార్మర్ అన్నారు. ఉక్రెయిన్‌కు బ్రిటన్ ఎల్లప్పుడు అండగా నిలుస్తుందని ప్రకటించారు. ఫ్రాన్స్‌తో కలిసి ఉక్రెయిన్‌లో శాంతి దిశగా ముందుకెళతామన్నారు. అమెరికా అధ్యక్ష కార్యాలయంలో జరిగిన పరిణామం దృష్ట్యా మేము సరైన దిశలోనే సాగుతున్నామని అర్థమైందని స్టార్మర్ వ్యాఖ్యానించారు. ఆయన ఆదివారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. తొలుత లండన్‌లోని 10-డౌనింగ్ స్ట్రీట్ వద్ద ఆయనకు స్వాగతం పలికారు. తాజా పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించారు. అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందం కోసం బ్రిటన్, ఫ్రాన్స్ కలిసి పనిచేస్తాయని చెప్పారు. ఉక్రెయిన్‌తో కలిసి

బ్రిటన్-ఫ్రాన్స్ రూపొందించే శాంతి ఒప్పందాన్ని ట్రంప్ ముందుర ఉంచుతామని స్టార్మర్ చెప్పారు. యూరప్ కూడా ఉక్రెయిన్‌కు మద్దతిస్తుందని ఆకాంక్షించారు. రష్యా మరోమారు ఉక్రెయిన్‌పై దాడి చేయకుండా అమెరికా ప్రమేయంతోనే కాల్పుల విరమణ జరగాలని బ్రిటన్ ప్రధాని నొక్కిచెప్పారు. అమెరికా ప్రమేయం ఉంటేనే భద్రతా పరమైన హామీ ఉక్రెయిన్‌కు లభించగలదని, అప్పుడు శాంతి ఒప్పందం సాకారం కాగలదని ఆయన అన్నారు. ఇదిలావుంటే, ఉక్రెయిన్‌తో 3.1 బిలియన్ డాలర్ల విలువైన రుణ ఒప్పందాన్ని బ్రిటన్ కుదుర్చుకుంది.

ఒప్పంద ప్రతాలపై ఇద్దరు అధినేతలు స్టార్మర్, జెలెన్‌స్కీ సంతకాలు చేశారు. ఉక్రెయిన్ రక్షణ సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ రుణ మొత్తాన్ని వాడతామని జెలెన్‌స్కీ చెప్పారు. ఉక్రెయిన్, యూరప్ ఎదుర్కొంటున్న సవాళ్లు, యుద్ధం ఆపేందుకు తీసుకోవాల్సిన చర్యలపై స్టార్మర్‌తో చర్చించానన్నారు. బ్రిటన్ వంటి వ్యూహాత్మక భాగస్వామి ఉండటం ఉక్రెయిన్ అదృష్టమని జెలెన్‌స్కీ అన్నారు.

# గాజాకు మానవతా సాయం ఆపేస్తాం: ఇజ్రాయిల్

**టెల్‌అవీవ్:** గాజా స్ట్రిప్‌లోకి అన్ని రకాల వస్తువుల సరఫరా, ప్రవేశాన్ని నిలిపి వేస్తున్నట్లు ఇజ్రాయిల్ ఆదివారం ప్రకటించింది. తాము చెప్పినట్లు హమాస్ చేస్తే తప్ప మానవతా సాయం అక్కడి ప్రజలకు అందబోదని తెలిపింది. కాల్పుల విరమణను పొడిగించేలా అమెరికా ప్రతిపాదనను సమర్థించింది. హమాస్ ఇందుకు అంగీకరించకపోతే అదనపు చర్యలను ఎదుర్కొవాల్సి వస్తుందని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహ/ కార్యాలయం హెచ్చరించింది. ఇజ్రాయిల్-హమాస్ మధ్య తొలి దశ

కాల్పుల విరమణ గుడువు శనివారంతో ముగిసింది. రెండో దశ కోసం చర్చలు మొదలయ్యాయి. ఇదే క్రమంలోనే ఇజ్రాయిల్ బందీలు కొంత మందిని హమాస్ ఇప్పటికే విడుదల చేసింది. రంజాన్ వేళ తొలి దశ కాల్పుల విరమణ పొడిగింపునకు ఇజ్రాయిల్ తొలుత అంగీకరించింది. అయితే పూర్తిస్థాయి కాల్పుల విరమణకు హమాస్ పట్టుబట్టింది. దీంతో తమ ప్రతిపాదనతో ఏకీభవించని పక్షంలో తీవ్ర పరిణామాలు తప్పబోవని నెతన్యాహు కార్యాలయం ఒక ప్రకటనలో హెచ్చరించింది. రంజాన్ సందర్భంగా తొలి దశ ఒప్పందాన్ని ఏప్రిల్ 20 వరకు పొడిగించాలని అమెరికాకు పశ్చిమాసియా రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ ప్రతిపాదించారు. ఇజ్రాయిల్ హెచ్చరికలపై హమాస్‌గానీ అమెరికా, ఈజిప్టు, ఖతార్‌గానీ ఇంకా స్పందించలేదు.

## అవినీతి నాయకుడిపై సీపీసీ బహిష్కరణ వేటు

**బీజింగ్:** క్రమశిక్షణా రాహిత్యం, చట్టాల అతిక్రమణ వంటి ఆరోపణలతో చైనా షిచ్వాన్ ప్రావిన్స్ మాజీ సీనియర్ రాజకీయ సలహాదారుడు క్యూ బోహువాను చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) బహిష్కరించింది. ఈ మేరకు ఆదివారం అధికారిక ప్రకటన విడుదలైంది. సీపీసీ కేంద్ర కమిషన్ దర్యాప్తు అనంతరం ఈమేరకు నిర్ణయించినట్లు తెలిపింది. చైనా పీపుల్స్ రాజకీయ సలహాదారుల సదస్సు షిచ్వాన్ ప్రాదేశిక కమిటీకి వైస్ చైర్ పర్సన్‌గా క్యూ వ్యవహరించారు. అయితే క్యూబోహువా దర్యాప్తునకు సహకరించలేదని ఆరోపించింది. అనుమానస్పద కార్యకలాపాలకు పాల్పడ్డారని, పార్టీ నిబంధనలకు విరుద్ధమైన కార్యక్రమాలకు వెళ్లారని, న్యాయపరమైన కార్యకలాపాల్లో జోక్యం చేసుకున్నారని, లంచనాలు-కానుకలు తీసుకున్నారని, అధికారాన్ని దుర్వినియోగించారని పార్టీ ప్రకటన వెల్లడించింది. పార్టీ సిద్ధాంతాలను అతిక్రమించడమే కాకుండా క్యూ...అవినీతికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలినట్లు వెల్లడించింది. దీంతో సీపీసీ ఆయనను బహిష్కరించినట్లు ప్రకటన పేర్కొంది. అలాగే, అక్రమంగా ఆర్జించినదంతా స్వాధీనం చేసుకోవాలని కూడా నిర్ణయించినట్లు పేర్కొంది. ఈ కేసును క్రిమినల్ దర్యాప్తు, ప్రాసిక్యూషన్ కోసం ప్రోక్యురేటరేట్‌కు సిఫార్సు చేస్తారని వెల్లడించింది.

## తీరు మార్చుకోని తమిళనాడు గవర్నర్

(మొదటిపేజీ తరువాయి)

అదుపులోని జలర్లు, వేట పడవల సత్వర విడుదల కోసం డిమాండ్ చేస్తూ రామేశ్వరంలో ఆందోళనకు దిగిన మత్స్యకారులను గవర్నర్ కలిశారు. '1974లో భారత్, శ్రీలంక మధ్య 'దుర్మార్గపు' ఒప్పందం జరిగింది. మత్స్యకారులే దీనికి బాధితులు అయ్యారు. రాష్ట్రంలోని పేద జాలర్ల జీవనోపాధి విషయంలో చాలా మొరటుగా వ్యవహరించారు' అని రవి వ్యాఖ్యానించారు. ఇందులో డీఎంకేకూ పాత్ర ఉందని ఆరోపించారు. గవర్నర్ వ్యాఖ్యలను మంత్రి రఘుపతి తిప్పికొట్టారు. ఈ అంశాన్ని లేవనెత్తడం ద్వారా పునర్విభజన నుంచి ప్రజల దృష్టి మళ్లించాలనే కేంద్ర ప్రభుత్వ అజెండా మేరకు గవర్నర్ పనిచేస్తున్నారని దుయ్యబట్టారు.'కాషాయ పార్టీ తరపున రాష్ట్రంలో రాజకీయం కోసం బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు కె.అన్నమలై ఉన్నారు. మీరు ఆయనతో పోటీ పడాల్సిన అవసరం లేదు' అని గవర్నర్‌నుద్దేశించి అన్నారు. కచ్చతీవు గురించి కట్టు కథలు వద్దని ఆయనకు సూచించారు. శ్రీలంక నుంచి తమిళ జాలర్లను విడిచిపించే అంశాన్ని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లాలని గవర్నర్‌ను మంత్రి కోరారు. '1974లో జరిగిన తప్పు' అన్నది తుప్పు పట్టిన అస్త్రమని ఎద్దేవాచేశారు. కచ్చతీవు భారత్ భూభాగమని నాటి సీఎం కరుణానిధి ఆధారాలు చూపారని, భారత్-శ్రీలంక మధ్య ఒప్పందం రద్దు చేయాలని అన్నారని గుర్తుచేశారు. 2024 లోకసభ ఎన్నికలప్పుడు కచ్చతీవు అంశాన్ని బీజేపీ పెద్దది చేసింది కానీ రాష్ట్రంలోని 39 నియోజకవర్గాలతో పాటు పుదుచ్చేరిలో ఓటమి పాలైందని రఘుపతి విమర్శించారు.

## సీఐడీ మాజీ డీజీ సునీల్ కుమార్‌పై సస్పెన్షన్ వేటు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నప్పటికీ... ట్రావెల్ ప్లాన్‌కు విరుద్ధంగా విదేశాల్లో ఉండడం... అక్కడ ప్రయాణించడం జరిగిందనే అభియోగాలపైనే. ఈ అభియోగాల నేపథ్యంలో ప్రభుత్వం రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా నేతృత్వంలో విచారణ కమిటీని నియమించింది. విచారణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం సునీల్ కుమార్‌ను సస్పెండ్ చేసింది.

## మాధవి బచ్‌పై ఎఫ్ఐఆర్

(మొదటిపేజీ తరువాయి)

జస్టిస్ శశికాంత్ ఎకనాథ్ రావ్ బంగర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. ఐపీసీతో పాటు అవినీతి నిరోధక చట్టం, సెబీ చట్టం తదితర చట్టాల్లో సంబంధిత సెక్షన్ల ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ముంబై, వర్లీలోని అవినీతి నిరోధక బ్యూరోకు కోర్టు ఆదేశాలు ఇచ్చింది.

**చట్టపరంగా చర్యలు తీసుకుంటాం: సెబీ**

మాధవి బచ్ సహా ఐదుగురిపై ఎఫ్ఐఆర్ నమోదునకు కోర్టు ఆదేశాలివ్వడంతో... ఈ ఉత్తర్వులను సవాల్ చేసామని సెబీ తెలిపింది. చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

## చంద్రుడిపైకి ప్రైవేటు ల్యాండర్

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించనుంది. చందమామ ధూళిని సేకరించేందుకు వాక్యూమ్ వినియోగం, చంద్రుడి ఉపరితలం కింద ఉష్ణోగ్రతలను కొలవడానికి డ్రిల్లింగ్ చేయడం, వ్యోమగాముల స్పేస్‌సూట్‌లు, పరికరాలకు అంటుకునే హానికరమైన ధూళిని తొలగించే మరో పరికరాన్ని పరీక్షించడం తదితరాలు ఇందులో ఉన్నాయి.

# కళలకు ప్రోత్సాహం

**విశాలాంధ్ర- హైదరాబాద్:** రాష్ట్రంలో పెద్ద ఎత్తున కళలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, కళాకారులకు మెండుగా ఆశీస్సులు ఉంటాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కళాకారులకు అన్ని రకాల వసతులు, సౌకర్యాలను ప్రజా ప్రభుత్వం కల్పిస్తున్నదని తెలిపారు. ఎల్బీ ఇండోర్ స్టేడియంలో తెలంగాణ సంగీత నాటక అకాడమి అధ్వర్యంలో భక్తరామదాసు 392వ జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన భట్టి... మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, సీతక్కలతో కలిసి జ్యోతి వెలిగించారు. సంగీత విధ్వాంసులకు జ్ఞాపికలను అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రతి ఏటా తమిళనాడు తిరువయ్యూర్‌లో జరిగే త్యాగరాజ ఆరాధనోత్సవాల మాదిరిగా ఇకపై తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా భక్త రామదాసు జయంతి ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ప్రముఖ సంగీత విద్వాంసులు పద్మశ్రీ డాక్టర్ యెల్లా వెంకటేశ్వరరావు, పద్మశ్రీ డాక్టర్ శోభారాజు, కళారత్న పురస్కార గ్రహీతలు హైదరాబాద్ బ్రదర్స్ రాఘవాచారి, హైదరాబాద్ సిస్టర్స్ హరిప్రియ, ప్రేమా రామమూర్తి, కోవెల శాంత, డి.వి. మోహన్ కృష్ణ వంటి ఉద్దండులు హాజరుకావడం చాలా సంతోషంగా ఉందన్నారు. భక్త రామదాసు జన్మించిన జిల్లా నుంచి తాను రాష్ట్రానికి డిప్యూటీ సీఎం గా ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు చాలా గర్వంగా ఉందన్నారు. తానిషా పాలనలో

తహసిల్దారుగా ఉన్న రామదాసు ప్రజల నుంచి వసూలు చేసిన సొమ్మును రామమందిర నిర్మాణం కోసం దుర్వినియోగం చేశాడన్న అభియోగంతో గోల్కొండ కోటలో జైలులో చిత్రహింసలు పెట్టినప్పటికీ తన భక్తిని కోల్పోకుండా కీర్తనలు చేసిన గొప్ప భక్తిపరుడు అని గుర్తు చేశారు. భక్త రామదాసును స్ఫూర్తిగా తీసుకొని సంగీత విధ్వాంసులుగా, వాగ్గేయకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. దశాబ్ద కాలంగా సినిమా కళాకారులకు ప్రోత్సాహం అందలేదని, ప్రతిఏటా వారికి ఇవ్వాల్సిన నంది అవార్డులు ఇవ్వకుండా గత పాలకులు నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే కళాకారులను ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకొని సినిమా కళాకారులకు గద్దర్ పేరిట 'గద్దర్ ఫిలిం అవార్డు'లను ఉగాది నుంచి ఇవ్వడానికి నిర్ణయించినట్టు చెప్పారు. నాటక రంగంలో రాణిస్తున్న కళాకారులను కూడా ప్రోత్సహిస్తామని ప్రకటించారు. తెలంగాణ నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ... నాటక రంగ కళాకారులకు అవార్డులు ఇవ్వడానికి నిర్ణయించినట్టు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా నాటక పోటీలను నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులకు అవార్డులు ఇస్తామన్నారు.

## సెమీస్‌లో భారత్

(మొదటిపేజీ తరువాయి)

సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 249 పరుగులు మాత్రమే చేసినప్పటికీ, కివీస్‌ను తన బౌలింగ్, ఫీల్డింగ్‌తో నియంత్రించి 205 పరుగులకే కుప్పకూల్చింది. న్యూజిలాండ్ ఇంకా 4.3 ఓవర్లు మిగిలి వుండగానే ఇన్నింగ్స్‌కు తెరదించింది. ఛాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంటులో సెమీఫైనల్స్ స్థానం కోసం గట్టిపోటీనే జరిగింది. ఆదివారంనాడు ఇక్కడ జరిగిన గ్రూప్-ఏ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్, న్యూజిలాండ్ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. వరుణ్ చక్రవర్తి అద్భుతమైన బౌలింగ్, శ్రేయాస్ అయ్యర్ బ్యాటింగ్, హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండ్ ప్రతిభ...వెరసి టీమిండియాకు విజయాన్ని చేకూర్చిపెట్టాయి. వరుణ్ చక్రవర్తి మొదటిసారి వన్డేల్లో 5 వికెట్లు తీసుకొని జట్టు విజయంలో కీలక పాత్ర వహించాడు. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అతనికే దక్కింది.

250 పరుగుల స్వల్ప విజయలక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఉత్సాహంతో బ్యాటింగ్‌ను మొదలుపెట్టింది. కానీ హార్దిక్ పాండ్యా బ్రేక్‌త్రూ సాధించి భారత శిబిరంలో ఆనందాన్ని నింపాడు. పాండ్యా బౌలింగ్‌లో అక్షర్ పటేల్ పట్టిన క్యాచ్‌కు ఓపెనర్ రచిన్ రవీంద్ర (6) పెవిలియన్‌దారి పట్టాడు. ఆ తర్వాత విల్ యంగ్, కేన్ విలియమ్సన్‌లు స్కోరుబోర్డును కుదటపరిచే ప్రయత్నం చేశారు. కాకపోతే వరుణ్ చక్రవర్తి సంధించిన లైన్ అండ్ లెన్త్ బంతికి విల్ యంగ్ (22) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. అప్పటికి కివీస్ స్కోరు అర్ధసెంచరీ దాటలేదు. ఆ తర్వాత విలియమ్సన్‌కు డారిల్ మిచెల్ తోడయ్యాడు. కుల్‌దీప్ యాదవ్‌ను రంగంలోకి దించిన రోహిత్ సఫలీకృతుడయ్యాడు. మిచెల్ (17) అనూహ్యంగా కుల్‌దీప్ ఎల్బీకి చిక్కాడు. విలియమ్సన్, టామ్ లాథమ్‌లు నెమ్మదిగా ఆడుతూ స్కోరును పెంచుతూ వచ్చారు. కాకపోతే రవీంద్ర జడేజా స్పిన్ బంతికి లాథమ్ (14) ఎల్‌బీడబ్ల్యుగా వెనుదిరిగాడు. ఈ దశలో కేన్ విలియమ్సన్ వికెట్టు అత్యంత కీలకమని టీమిండియాకు తెలుసు. అందుకే అతనిపై దృష్టిపెట్టిన రోహిత్ శర్మ బౌలర్లను మారుస్తూ ప్రయోగాలు చేసి మరోసారి సఫలీకృతుడయ్యాడు. విలియమ్సన్ వికెట్టును సాధించలేకపోయినప్పటికీ, ఫిలిప్స్ (12), బ్రేస్‌వెల్ (2) వికెట్లను వరుణ్ చక్రవర్తి పడగొట్టాడు. రెండూ ఎల్బీలే కావడం విశేషం. విలియమ్సన్, శాంట్నర్‌లు భారత బౌలర్లపై ఒత్తిడి పెంచారు. కానీ రోహిత్ వ్యూహం మార్చి అక్షర్‌కు మళ్లీ బంతి ఇచ్చాడు. దీంతో 42వ ఓవర్‌లో అక్షర్ వేసిన తొలి బంతికే భారీ షాట్ కోసం ఫ్రంట్‌ఫుట్ వేసిన విలియమ్సన్ కీపర్ రాహుల్ స్టంపింగ్‌తో అవుటయ్యాడు. విలియమ్సన్ 120 బంతుల్లో 7 బౌండరీలతో 81 పరుగులు చేశాడు. కెప్టెన్ శాంట్నర్ అక్షర్, వరుణ్ ఓవర్లలో చెరొక సిక్స్ కొట్టి తమ శిబిరంలో ఆత్మవిశ్వాసం నింపే ప్రయత్నం చేశారు. కుల్‌దీప్ బౌలింగ్‌లో ఒక బంతిని బౌండరీకి కూడా తరలించాడు. కాకపోతే వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో ఊహించని విధంగా క్లీన్‌బౌల్డ్ కావడం కివీస్‌ను దెబ్బతీసింది. భారత బౌలర్లను భయపెట్టిన శాంట్నర్ 31 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 28 పరుగులు చేశాడు. అదే ఓవర్‌లో వరుణ్ మరో బ్యాట్స్‌మన్ హెన్రీని (కోహ్లీ క్యాచ్) కూడా పెవిలియన్‌కు పంపించాడు. వరుణ్ తొలిసారి వన్డేల్లో 5 వికెట్లు సాధించాడు. హెన్రీ (2), జేమీసన్ (9), రూర్కీ (1) పెద్ద ప్రభావం చూపలేదు. కుల్‌దీప్ బౌలింగ్‌లో రూర్కీ ఆఖరి వికెట్టుగా అవుటయ్యాడు. భారత బౌలర్లలో వరుణ్ 5 వికెట్లు తీసుకోగా, కుల్‌దీప్ 2, అక్షర్, జడేజా చెరో వికెట్టు తీసుకున్నారు.

అంతకుముందు, టాస్ గెలిచిన న్యూజిలాండ్ ముందుగా టీమిండియాను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. కివీస్ ఆటగాళ్లు కట్టుదిట్టమైన ఫీల్డింగ్, బౌలింగ్‌తో భారత దూకుడుకు అడ్డుకట్ట వేశారు. వారి బ్యాటింగ్‌ను తెలివిగా నియంత్రించారు. ముఖ్యంగా మట్ హెన్రీ అద్భుతమైన బౌలింగ్‌తో భారత టాప్‌ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. ఒక దశలో భారత్ 30 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి తీవ్రమైన కష్టాల ఊబిలో కూరుకుపోయింది. ఓపెనర్లు ఇద్దరూ తొలి ఆరు ఓవర్లలోనే పెవిలియన్ దారిపట్టారు. శుభ్‌మన్ గిల్ (2) హెన్రీ ఎల్బీకి దొరికిపోగా, రోహిత్ శర్మ (15) కైల్ జేమీసన్ బౌలింగ్‌లో విల్ యంగ్ పట్టిన క్యాచ్‌కు అవుటయ్యాడు. రోహిత్ శర్మ ఒక ఫోర్, సిక్సర్‌తో ఊపులో ఉన్నప్పటికీ, భారీషాట్‌కు ప్రయత్నించి అవుటయ్యాడు. విరాట్ కోహ్లీ (11) కూడా హెన్రీ బౌలింగ్‌లో ఫిలిప్‌కు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు. ఈ దశలో అక్షర్ పటేల్, శ్రేయాస్ అయ్యర్‌ల భుజస్కందాలపై బ్యాటింగ్ భారం పడింది. వీరిద్దరూ మంచి సమన్వయంతో ఆడుతూ స్కోరు బోర్డును నెమ్మదిగా ముందుకు నడిపించారు. వారు నాల్గవ వికెట్టుకు 136 బంతుల్లో 98 పరుగుల అమూల్యమైన భాగస్వామ్యం అందించారు. జట్టు స్కోరు 128 వద్ద ఉన్నప్పుడు అక్షర్ పటేల్ అనూహ్యంగా రచిన్ రవీంద్ర బౌలింగ్ విలియమ్సన్‌కు క్యాచ్ అవుటయ్యాడు. అక్షర్ 61 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 42 పరుగులు చేశాడు. ఒంటరిగా పోరాడుతున్న శ్రేయాస్ అయ్యర్ 37వ ఓవర్‌లో విల్ రూర్కీ బౌలింగ్‌లో యంగ్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. అతను 98 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 79 పరుగులు చేశాడు. భారత బ్యాట్స్‌మన్లలో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు కావడం గమనార్హం. ఆ తర్వాత వచ్చిన కేఎల్ రాహుల్ (29), రవీంద్ర జడేజా (16), షమీ (5), కుల్‌దీప్ యాదవ్ (1)లు పెద్దగా రాణించకపోయినప్పటికీ, హార్దిక్ పాండ్యా మాత్రం మెరుపులు మెరిపించి, ఆఖర్లో భారత స్కోరును పెంచేశాడు. పాండ్యా 45 బంతుల్లో 4 ఫోర్లు, 2 భారీ సిక్సర్లతో 45 పరుగులు చేశాడు. అతను కూడా హెన్రీ బౌలింగ్‌లో రవీంద్రకు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. కివీస్ బౌలర్లలో మట్ హెన్రీ 8 ఓవర్లలో 42 పరుగులిచ్చి 5 వికెట్లు తీసుకోగా, జామీసన్, రూర్కీ, శాంట్నర్‌లు తలో వికెట్టు తీసుకున్నారు. విలియమ్సన్ టెరిఫిక్ మ్యాచ్ మిస్ అయివుంటే జడేజా (16) మరికాస్త నిలబడేవాడు.

## ఎస్ఎల్‌బీసీ పనుల్లో రోబోల సాయం

(మొదటిపేజీ తరువాయి)

ఇందిరమ్మ ఇళ్ల ను మహిళల పేరుతో ఇస్తున్నామన్నారు. పదేళ్లలో కేసీఆర్ నిరుద్యోగ యువతకు ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు కాని ఆయన కుటుంబంలో అందరికీ ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో మొదటి ఏడాదిలోనే 55,163 ఉద్యోగాలు ఇచ్చామన్నారు. 22 వేల టీచర్లకు ప్రమోషన్లు, 35 వేల టీచర్లకు బదిలీలు చేసి వారి సమస్యలు పరిష్కరించామన్నారు. కేసీఆర్ ఫామ్ హౌస్ లో పడుకుని ప్రజల గురించి ఆలోచించలేదని దుయ్యబట్టారు. కేసీఆర్ ... పాలమూరు , బీమా, కల్వకుర్తి, నెట్టంపాడు ఎందుకు పూర్తి చేయలేదు... ఆర్డీఎస్ ఎందుకు ఎండిపోయిందన్నారు. ఎస్ఎల్‌బీసీ పదేళ్ల పాటు పట్టించుకోకపోవడంతో కుప్పకూలిందని, మరి ఈపాపం కేసీఆర్‌ది కాదా అంటూ నిలదీశారు. ఆంధ్ర, రాయలసీమకు నీళ్లు తరలించుకుపోతుంటే గుడ్లప్పగించి కేసీఆర్ చూడలేదా, ప్రగతి భవన్ కు జగన్ ను పిలిచి పంచభక్ష పరమాన్నం పెట్టి రాయలసీమ ఎత్తిపోతలకు పునాది రాయి వేసింది కేసీఆర్ కాదా అంటూ ధ్వజమెత్తారు. మహబూబ్ నగర్ ప్రజలు నిన్ను ఎంపీగా గెలిపించుకుంటే ఏం చేశావు అని నిలదీశారు. పాలమూరు ద్రోహి కేసీఆర్, కృష్ణా జలాలు ఆంధ్రా తరలించుకు పోతున్నారంటే దానికి కారణం కేసీఆర్ దుర్మార్గం వల్లనే అంటూ మండిపడ్డారు. కృష్ణా జలాల కేటాయింపులో తెలంగాణకు అన్యాయం జరిగేలా సంతకం పెట్టిన దుర్మార్గుడు కేసీఆర్ అని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన పాలమూరు బిడ్డ జిల్లెల చిన్నారెడ్డి అని గుర్తు చేశారు. నానా కష్టాలు పడి వరంగల్ కు ఎయిర్ పోర్టు తీసుకువస్తే కిషన్ రెడ్డి నేనే తీసుకువచ్చానని చెపుతున్నాడని



దుయ్యబట్టారు. మెట్రో విస్తరణ అనుమతులు, మూసీ నది ప్రక్షాళనకు నిధులు, రీజనల్ రింగ్ రోడ్డుకు అనుమతులు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు నీటి కేటాయింపులు, కాళేశ్వరానికి నీటి కేటాయింపులు రాకుండా కిషన్ రెడ్డి అడ్డుకున్నాడని ఆరోపించారు. మోదీ తెలంగాణలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చాడో కిషన్ రెడ్డి చెప్పాలన్నారు. సికింద్రాబాద్ లో వరదలు వచ్చి కొట్టుకుపోతే కేంద్రం చిల్లి గవ్వ కూడా ఇవ్వలేదన్నారు. హైదరాబాద్‌కు కేంద్ర మంత్రి వచ్చి సమీక్ష చేస్తే కిషన్ రెడ్డి ఎందుకు హాజరుకాలేదో చెప్పాలన్నారు. నిర్మలా సీతారామన్ తమిళనాడుకు మెట్రో తీసుకువెళ్లింది, కేంద్ర మంత్రి శోభా బెంగళూరుకి మెట్రో తీసుకెళ్లింది, సొంత రాష్ట్రం తెలంగాణ కు కిషన్ రెడ్డి ఎందుకు మెట్రో తీసుకురాడం లేదని ప్రశ్నించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నదుల ప్రక్షాళన చేస్తే కేంద్రం వేల కోట్ల నిధులు ఇస్తోందని, మూసీ ప్రక్షాళన కు ఎందుకు కిషన్ రెడ్డి నిధులు తీసుకురావడం లేదన్నారు. తెలంగాణకు ఏదో ఒకటి చేయాలని మోదీ సానుభూతితో ఉన్నాడని, కిషన్ రెడ్డి పగతో ఉన్నాడు... సైంధవుడిలా అడ్డుపడుతున్నాడని దుయ్యబట్టారు. తొలుత వనపర్తి జిల్లాలో పర్యటించిన సీఎం... రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

# అసమర్థుడు కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

భట్టి చెప్పారు. గత పాలకులు రైతుబంధు ఎగవేసిన తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.7,660 కోట్ల రైతుబంధు కింద జమ చేసిందన్నారు. అప్పటి ప్రభుత్వం ఎకరాకు రూ.ఐదువేలు ఇస్తే తమ ప్రభుత్వం రూ.ఆరువేల చొప్పున సంవత్సరానికి రెండు పంటలకు అదనంగా రూ.రెండువేలు కలిపి రూ. 12 వేలు చెల్లిస్తుందన్నారు. రూ.9,660 కోట్ల రైతు భరోసా నిధులను ఈ నెల 31 లోగా జమ చేస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీని రూ.ఐదు లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్టు చెప్పారు. గృహజ్యోతి కింద గ్యాస్ సిలిండర్ రూ.500లకే ఇస్తున్నామని, పౌరసరఫరాల శాఖకు రూ.4,440 కోట్లు చెల్లించామన్నారు. గత 15 సంవత్సరాలలో ఎప్పుడూ లేనివిధంగా 16 వేల మెగావాట్ల డిమాండ్ ఉన్నప్పటికీ నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నామన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ కోసం రూ.14,870 కోట్లు డిస్కంకు రైతుల పక్షాన ప్రభుత్వం చెల్లించిందన్నారు. పేద మధ్యతరగతి ప్రజల కోసం 200 యూనిట్లను ఉచితంగా ఇస్తున్నామని, ప్రభుత్వం డిస్కంకు రూ.1,689 కోట్లు చెల్లించిందన్నారు. పంటలు పకృతి వైపరీత్యాలతో దెబ్బతింటే రైతులు ఇబ్బంది పడకుండా ఇన్సూరెన్స్ రూ.1,514 కోట్లు కట్టామన్నారు. సన్న రకాలకు రూ.500 బోనస్ చెల్లిస్తున్నామని, ఇందుకు రూ.1,804 కోట్లు రైతులకు చెల్లించామన్నారు. బీఆర్ఎస్ పాలనలో రెసిడెన్షియల్ స్కూల్ లకు కాస్మోటిక్స్ డైట్ చార్జీలను ఒక్క రూపాయి ఇవ్వలేదని, తమ ప్రభుత్వం 40 శాతం పెంచిందన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 60 ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసి ఒక్కొక్క స్కూలుకు రూ. 200 కోట్లు మంజూరు చేసి నిర్మించడం జరుగుతుందన్నారు. వనపర్తి నియోజకవర్గం రాజకీయ చైతన్యవంతమైన ప్రాంతమని, ఈ ప్రాంతం నుంచి రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రారంభిస్తుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ఇందిరమ్మ ప్రభుత్వాలు అన్ని వర్గాల సంక్షేమం కోసం పని చేసిందని, కార్పొరేషన్లకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించేది అని గుర్తు చేశారు. దురదృష్టవశాత్తు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో మాత్రం నాటి ప్రభుత్వం కార్పొరేషన్ లకు ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు రూ.ఆరువేల కోట్లు కేటాయించినట్టు చెప్పారు. స్వయం ఉపాధి గ్రూపులకు ఏప్రిల్ 14న రూ. ఆరువేల కోట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. విద్యార్థి దశ నుంచి ఇక్కడి ప్రజల కష్ట సుఖాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేల కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టారన్నారు. గత ప్రభుత్వం ఎనిమిది లక్షల కోట్ల భారం వేసినప్పటికి అధైర్య పడకుండా సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నట్టు పేర్కొన్నారు. రైతులకు రెండు లక్షల లోపు రుణమాఫీ చేసినట్టు చెప్పారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ల పేరిట ప్రజలను మోసం చేసిందని , తమ ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి ఏడు వేలఇళ్లను మంజూరు చేసి, మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గంలో 3,500 ఇళ్లను నిర్మించడం కోసం ఒక్కో ఇంటికి రూ.ఐదు లక్షలు మంజూరు చేశామన్నారు. తెలంగాణ అభివృద్ధికి దావోస్‌లో సీఎం రేవంత్ రెడ్డి రూ.1.80 లక్షల కోట్ల అగ్రిమెంట్లు చేసుకొచ్చారని గుర్తు చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఎన్ని కుట్రలు చేసినా అభివృద్ధిని అడ్డుకోలేరని స్పష్టం చేశారు.

## ఇరాన్ కరెన్సీ పతనం

(మొదటిపేజీ తరువాయి)

హెమ్మతి తెలిపారు. ద్రవ్యోల్బణం 35 శాతంగా ఉందని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సమయం పడుతుందని చెప్పారు. మరోవైపు అణ్వస్త్ర కార్యక్రమాల కారణంగా అంతర్జాతీయ ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కొన్నేళ్లుగా పతనావస్థలో ఉంది. 2015లో అమెరికాతో అణు ఒప్పందం చేసుకునే నాటికి ఒక డాలర్‌తో పోల్చితే వీరి కరెన్సీ మారక విలువ 32వేల రియాల్స్‌గా ఉండేది. ఆపై విలువ తగ్గిపోయింది. గతేడాది జులైలో పెజెష్కియాన్ అధికారం చేపట్టే సమయానికి 5.84 లక్షల రియాల్స్‌కు పడింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల నాటికి 7.03 లక్షలకు చేరుకుంది. ఇటీవల మరింత పతనమైంది. 9.30లక్షల రియాల్స్‌కు పడిపోయింది.

## ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు నేడు

(మొదటిపేజీ తరువాయి)

రేకెత్తుతోంది. మొదటి, రెండో ప్రాధాన్యత ఓట్ల మధ్య విజయాన్ని నిర్ణయించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డితో పాటు ఇతరుల మధ్య పోటీ ఉంటుంది. టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థుల విషయంలోనూ పోటీ ఉంటుందని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి.

# కష్టపడేవారికే పదవులు

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు, మంత్రులతో చర్చిస్తున్నారు. అనంతరం పేర్లతో ప్రతిపాదనలు తీసుకుంటున్నారు. ఇవన్నీ అందాక మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చర్చించి పీసీసీ రాష్ట్ర కార్యవర్గానికి తుది ప్రతిపాదనలను అధిష్టానానికి పంపుతారు. ఇదిలావుంటే, ఈ నెల మొదటి వారంలో లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పార్టీ సమావేశాలు నిర్వహించి స్థానిక ముఖ్య నేతల అభిప్రాయాలు తెలుసుకోవాలని మీనాక్షి సూచించినట్లు సమాచారం. ఈ క్రమంలో నేతల మధ్య సఖ్యత, వర్గ వివాదాలపైనా ఆరా తీస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఫిరాయింపు నేతలకు, పార్టీలోని పాతవారికి మధ్య గొడవలను మహేశ్ కుమార్ గౌడ్ పరిష్కరిస్తుచారు. పార్టీ బలోపేతానికి కలిసి పనిచేయాలని ఉద్బోధిస్తున్నారు. నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని మీనాక్షి హెచ్చరించినట్లు సమాచారం. ఇంతకుముందు జిల్లాలు, వర్గాల వారీగా నేతలు వెళ్లి పార్టీ రాష్ట్ర ఇంచార్జిని కలసి తమకు అవకాశాలు కల్పించాలని కోరేవారు. కానీ ఇప్పుడు అన్ని విషయాలు నేరుగా తెలుసుకుంటానని మీనాక్షి చెప్పారు. పైరవీలు, పలుకుబడి ఆధారంగా పదవులిచ్చే ఉండదని స్పష్టం చేశారట... దీంతో పీసీసీ పనితీరులోనూ మార్పులు రానున్నాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

# స్ఫూర్తి ప్రదాత స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు

## కలెక్టర్ జితేష్ వి పాటిల్

**విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభకు వన్నె తెచ్చి, రాజకీయాల్లో హుందాతనాన్ని ప్రదర్శించిన మాజీ స్పీకర్, స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాదరావు ఆదర్శ వంతులని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఆయన జయంతి సందర్భంగా ఆదివారం ఐడిఓసి సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. అయనతో పాటు అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ కలిసి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ శ్రీపాదరావు న్యాయవాదిగా ప్రజలకు అనేక సేవలు అందించారన్నారు. ఆయన రాజకీయ ప్రస్థానంలో మొదట సర్పంచ్‌గా రెండు సార్లు ఎన్నికై తదుపరి మహాదేవపూర్ సమితి అధ్యక్షుడిగా రాజకీయ జీవితం ప్రారంభించినట్లు చెప్పారు. 1984 ఎన్నికల్లో మొదటి సారి మంథని నుంచి శాసన సభ్యులుగా పోటీ చేసి విజయం సాధించారని తరువాత 3 సార్లు శాసనసభ్యునిగా ఎన్నికైనట్లు తెలిపారు. 1994లో ఓటమి పాలు అయినప్పటికీ ప్రజల మధ్యనే ఉంటూ ఎన్నో సేవలు అందించడం జరిగిందన్నారు. 1999 ఏప్రిల్ 13న మహదేవపూర్ మండలం అన్నారంకు తన అనుచర వర్గంతో ఒక పనిమీద వెళ్లి వస్తున్న క్రమంలో అడవుల్లో నక్సల్స్ అడ్డుకొని కొంత దూరం తీసుకెళ్లి తుపాకీతో కాల్చి చంపారని తెలిపారు. ఇలాంటి మహనీయుల గురించి అందరికి తెలపాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి, డిఎం సివిల్ సప్లైస్ త్రినాథ్ బాబు, మైనింగ్ శాఖ అధికారి దినేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షేమ చట్టాన్ని నీరుగార్చే చర్యలు...

### రూ.1500 కోట్లు కార్మికుల కోసం కేటాయించాలి : సాబీర్ పాషా

**విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ :** నిర్మాణ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్‌కె.సాబీర్ పాషా, యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి గాదె లక్ష్మీనారాయణ విమర్శించారు. చుంచుపల్లి మండల పరిధిలోని శ్రీ రామ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం నాలుగో మహాసభకు వారు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. రాష్ట్రంలో 40 లక్షల మంది, దేశంలో 8 కోట్ల మంది నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమాన్ని పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. మూడు దశాబ్దాల పాటు కార్మికులు, కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న నిర్మాణరంగ సంక్షేమ చట్టంను ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు రెక్కలు ముక్కలు చేసుకొని ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తున్న కోట్లాది రూపాయల రిజిస్ట్రేషన్ ఫీజును కార్మికుల సంక్షేమం కోసం కాకుండా ఉన్నత వర్గాల సేవలకు దారిమళ్లించడం క్షమించరాని నేరమన్నారు. కార్మికులు చట్టప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకుంటే గుర్తింపు కార్డులు జారీ చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేసారు. సంక్షేమ బోర్డు కొనసాగింపు, ధరలకు అనుగుణంగా వేతనాలు, కూలి కోసం, అడ్డాల వద్ద సౌకర్యాల కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్లో రూ.1500 కోట్లు సంక్షేమ బోర్డుకు కేటాయించాలన్నారు. సురేందర్ రెడ్డి, కోరే కృష్ణ, గుంటి మల్లేష్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్, నాయకులు వాసిరెడ్డి మురళి, వేల్పుల మల్లికార్జున్, పోగుల కోటేశ్వర్‌రావు, సర్ప కృష్ణ, సిల్వేరు నర్సింహారావు, గడ్డం భాస్కర్, వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నేటి నాయకులకు దుద్దిళ్ల ఆదర్శనీయులు

**విశాలాంధ్ర - కొత్తగూడెం :** గ్రామ సర్పంచ్ స్థాయి నుంచి అంచలంచెలుగా ఎదిగి మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా ప్రజలకు విశిష్ట సేవలందించిన దుద్దిళ్ల శ్రీపాదరావు నేటి నాయకులకు ఆదర్శ ప్రాయుడని సింగరేణి కార్పొరేట్ డిజియం (పర్సనల్) వెల్ఫేర్ జి. రాజేంద్ర ప్రసాద్ అన్నారు. డిజియం సారథ్యంలో సింగరేణి ప్రధాన కార్యాలయం ఆవరణలో శ్రీపాదరావు జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు తొడిగి నివాళులర్పించారు. అనంతరం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కేవలం రెండు దశాబ్దాలు రాజకీయ జీవితంలోనే ఆయన రాజకీయాలకు, ప్రజాసేవకు వన్నె తెచ్చారని కొనియాడారు. 1999 ఏప్రిల్ 13న మహాదేవపూర్ మండలం అన్నారం గ్రామం వెళ్లి వస్తున్న క్రమంలో నక్సలైట్లు దారి కాచి పట్టుకొని శ్రీపాదరావును హత్య చేసారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఐటిసి బ్రాంచ్ సెక్రటరీ ఎస్వీ రమణమూర్తి వైస్ ప్రెసిడెంట్‌రావు పర్సనల్ మేనేజర్ ముకుంద సత్యనారాయణ, డివైపియం కిరణ్ కుమార్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేల కోటాలో ఎర్రబెల్లికే ఎమ్మెల్సీ ఇవ్వాలి

**విశాలాంధ్ర - తొర్రూర్ :** రాష్ట్రంలో పదవీ కాలం పూర్తి అవుతున్న నాలుగు ఎమ్మెల్సీలలో బిఆర్‌ఎస్‌కు దక్కే రెండు సీట్లలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ స్థానం కేటాయించాలని ప్రముఖ సామాజికవేత్త, సాహితీవేత్త దోనికెన కుమార స్వామి కోరారు. ఈ సందర్భంగా ఆదివారం అయిన మాట్లాడుతూ రాజకీయాల్లో సొసైటీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, విప్‌గా, ఎంపీగా, మంత్రిగా అపారమైన అనుభవం ఉండడమే కాకుండా కింగ్ మేకర్‌గా రాజకీయ చతురతతో చక్రం తిప్పి, సమయస్ఫూర్తితో చాకచక్యంగా ఎంతో మంది సాధారణ కార్యకర్తలను పెద్ద పెద్ద నాయకులుగా తయారు చేసి, వారికి పార్టీ పరమైన, రాజ్యాంగ పరమైన ఎన్నో ఉన్నత పదవులను ఇప్పించిన మహా నాయకుడైన ఎర్రబెల్లి దయన్నకు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశాన్ని కల్పిస్తే, సునాయాసంగా గెలిచి చూపించగలడని ఆయన అన్నారు. శాసనసభలో బీఆర్‌ఎస్‌కు ఉన్న ఎమ్మెల్యేల సంఖ్యాబలం పరంగా తప్పకుండా ఒక్క ఎమ్మెల్సీ దక్కుతుండగా, దయన్నకు అవకాశం ఇస్తే బీఆర్‌ఎస్ మరొక ఎమ్మెల్సీ సీటును కూడా పొందవచ్చునని ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## జాతీయ స్థాయి పోటీలకు పెద్దపల్లి ఉపాధ్యాయుడు కిషోర్ ఎంపిక

**విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి:** ఫిబ్రవరి 23 న హైదరాబాద్‌లోని జింకనా మైదానంలో రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ 200 మీటర్‌ల పరుగు పందెంలో పెద్దపల్లి జిల్లాకు చెందిన హిందీ ఉపాధ్యాయులు ఎం.కిషోర్ కాంస్య పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 28న ధర్మశాలలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు కోచ్ మహేందర్ రెడ్డి పేర్కొంటూ అభినందించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ వృత్తి రీత్యా కరీంనగర్‌లో ఉంటున్నా స్వంత జిల్లా పెద్దపల్లి అని, పోటీల్లో సైతం పెద్దపల్లి జిల్లా తరపున పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధిస్తానని ధీమా వ్యక్తం చేసారు. దింతో పాటు పాఠశాల విద్యార్థులకు డ్యాన్స్, పెన్సిల్ ఆర్ట్స్, స్పోర్ట్స్‌లలో సమయం ఉన్నపుడు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

## క్షేత్ర పరిశీలన, పర్యటన

**విశాలాంధ్ర - కొమరం భీం :** బెజ్జూర్ క్షేత్ర పరిశీలన పర్యటనలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాబాసాగర్ బెజ్జుర్ రేంజ్ పరిధిలో ఇందిర్గాం బీట్ నేచరల్ టెక్ ఫారెస్ట్‌ను సందర్శించారు. అటవీ సంరక్షణలో తీసుకుంటున్న చర్యలు, నీటి సంరక్షణ ఆడవుల వల్ల ఔషధ మొక్కల ఉపయోగాల గురించి పిల్లలకు వివరించారు. ఈ పర్యటన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, కుమార్ దాస్, మాణిక్‌రావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వేంకటేశం, అనిల్ కుమార్, బేస్ కాంప్ వాచర్స్ పాల్గొన్నారు.

## గంజాయి పట్టుకోవడంలో జిల్లా టాప్..

### నేడే అధికారులకు ఎక్సైజ్ భవన్‌లో రివార్డుల ప్రదానం

ఫైల్ ఫోటో

**విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గంజాయి పట్టుకోవడంలో ఎక్సైజ్ అధికారుల పని తీరుకు రివార్డులు, అవార్డులు లభించనున్నాయి. తెలంగాణ మొత్తంలో ఎక్సైజ్ అధికారులు 2024 ఏడాది మొత్తం 6000 కేజీలు గంజాయి పట్టుకోగా ఇందులో ఉమ్మడి జిల్లా అధికారులు 2225 కేజీల గంజాయిని పట్టుకొని తమ సత్తా చాటారు. గత ఏడాదిలో రూ. 11 కోట్ల మేర గంజాయిని పట్టుకున్న ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. శ్రమించే అధికారులకు ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ఆయన తెలుపారు. ఈ మేరకు సోమవారం ఆయన చేతుల మీదుగా జిల్లా అధికారులు క్యాష్ రివార్డులు ప్రశంసాపత్రాలు అందుకోనున్నారని వెల్లడించారు. ఈ రివార్డులు హైదరాబాద్ ఆబ్కారి భవన్‌లో ప్రధానం చేయనున్నట్లు చెప్పారు. ఖమ్మం కొత్తగూడెం ఎక్సైజ్ యంత్రాంగం పనితీరును ఆయన ఈ సందర్భంగా అభినందించారు. కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం, పాల్వంచ, అశ్వరావుపేట, కొత్తగూడెంలో ఎక్సైజ్ పోలీసుల మొత్తం 35 కేసుల్లో భారీగా గంజాయిని బెల్లాన్ని పట్టుకోవడం జరిగింది. గంజాయితోపాటు 35 వాహనాల్లో 11 కార్లను స్వాధీనం చేసుకున్న ఘనత భద్రాచలం ఎక్సైజ్ పోలీసులకే దక్కిందన్నారు.

## హాల్ టికెట్స్ నిలిపివేస్తే కళాశాలల గుర్తింపులను రద్దు చేయాలి : ఏఐఎస్ఎఫ్

**విశాలాంధ్ర - ఖమ్మం :** హాల్ టికెట్స్ పంపిణీలో కార్పొరేట్ ప్రవేట్ కళాశాలలు, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని ఏఐఎస్ఎఫ్ హెచ్చరించింది. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందిగా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఖమ్మం. గిరీ ప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ ప్రైవేట్ కళాశాలలో ఫీజులు చెల్లించడం లేదనే నెపంతో విద్యార్థులకు హాల్ టికెట్స్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. కార్పొరేట్ ప్రైవేట్ కళాశాలల ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయన్నారు. అనుమతి లేకుండా వేరువేరు రికగ్నేషన్ల పేర్లతో విద్యార్థులను కార్పొరేట్ ప్రైవేట్ కళాశాలలో బురిడీ కొట్టిస్తు పీఆర్వోలతో మాయమాటలతోనే చేర్పించుకొని తీరా ఫీజులు చెల్లించడం లేదని సాకుతో విద్యార్థులకు హాల్ టికెట్స్ ఇవ్వకపోవడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు తక్షణమే ఆయా కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈనెల 5వ తేదీ నుండి 25వ తేదీ వరకు జరుగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్‌టిసి బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గూగుల్ వంశి ప్రతాప్ రాజు రాకేష్ గోపి హరికృష్ణ సాయి నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవతామూర్తుల ప్రతిష్టలు

**విశాలాంధ్ర - కారేపల్లి :** మండల కేంద్రమైన కారేపల్లిలో ప్రజల సహకారంతో నూతనంగా నిర్మించిన శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా మండల విశ్వబ్రాహ్మణ ఆధ్వర్యంలో శ్రీ పోతులూరి గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ప్రతిష్టలు జరిగాయి. ఆదివారం అశేష భక్తజన సంద్రోహం మధ్య ఈ ప్రతిష్ట వేడుక లను నిర్వహణ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ప్రముఖ పురోహితులు దోనోజు పరిపూర్ణాచార్యులు ఆధ్వర్యంలో సంస్కృతి సంప్రదాయాల బద్ధంగా నిర్వహించడం విశేషం. ప్రతిష్టల అనంతరం స్వామి వారికి వేరువేరుగా దేవాలయానికి వచ్చిన మాజీ శాసనసభ తొలి స్పీకర్, శాసన మండలి సభ్యులు సిరికొండ మధుసూదనాచారి, వైరా శాసనసభ్యులు మాలోతు రామదాసు నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయానికి వచ్చిన వారికి ఆలయ కమిటీ సభ్యులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు అద్దంకి నాగేశ్వరరావు, దేవాలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు తుమ్మోజు రామమూర్తి, వేములూరి కోటాచారి, కమిటీ సభ్యులు అద్దంకి వీరభద్రాచారి, పోలోజు రామాచారి, అనంతారపు వెంకటాచారి, గుండోజు కృష్ణయ్యచారి, కల్లూరి నాగచారి, శ్రీనివాసచారి, అనంతోజు లక్ష్మణాచారి, మోదేపల్లి వాసుదేవాచారి, అబ్బనపురి వెంకటేశ్వర్లు, తాటికొండ వెంకటాచారి, అన్ని రాజకీయ పక్షాల నాయకులు, దాతలు భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ స్పీకర్ జయంతి వేడుకలు

### కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

**విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్ :** మాజీ స్పీకర్ శ్రీపాద రావు జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్లో మాజీ స్పీకర్ శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.వీరబ్రహ్మచారి, జిల్లా అధికారులు డిడి గ్రౌండ్ వాటర్ వేముల సురేష్, ఫిషరీస్ వీరన్న, మైనారిటీ అధికారి శ్రీనివాస్, జిఎం ఇండస్ట్రీస్ సత్యనారాయణ రెడ్డి, డీఎం సివిల్ సప్లై కృష్ణవేణి, శ్రీనివాస్, డీపీఆర్ఓ రాజేంద్రప్రసాద్, కలెక్టరేట్ పరిపాలన అధికారి మదన్ గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐటీయుసిని విమర్శించడం మానుకోవాలి

**విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి :** అవగాహన లేని కొన్ని కార్మిక సంఘాలు గుర్తింపు కార్మిక సంఘంగా ఏఐటీయుసి సింగరేణి కార్మికులకు ఏమీ చేయడం లేదని అవగాహన లేకుండా విమర్శించడం మానుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, వి.సీతారామయ్య, కె.రాజకుమార్‌లు అన్నారు. ఆదివారం గోదావరిఖని భాస్కరరావు భవనంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాలుగా జరుగని స్ట్రక్చర్ మీటింగ్ జరిగే విధంగా యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి జరిగేట్లు చూస్తున్నామని, డైరెక్టర్స్ స్థాయిలో జరిగిన సమావేశంలో గత కొన్నెళ్లుగా పెండింగులో ఉన్న మైనింగ్, ఇంజనీరింగ్ సూపర్‌వైజర్లు అన్ఫిట్ ఐతే జనరల్ మజ్దూర్ కాకుండా అదే పాత ఉద్యోగం ఇప్పించేందుకు యాజమాన్యాన్ని ఒప్పించామని, ఎన్నికల కోడ్ వల్ల సర్క్యులర్ ఆలస్యమైందని అన్నారు. పెండింగ్ సమస్యలపై ఈనెల 5న జరిగే సి అండ్ ఎండి స్థాయి సమావేశంలో చర్చించి పరిష్కారం చేస్తామని అన్నారు. ప్రధానంగా పెర్క్స్‌పై ఆదాయపు పన్ను యాజమాన్యమే చెల్లించాలని, మారుపేర్ల సమస్య, స్వంత ఇంటి పథకం అమలు కోసం కృషి చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు మద్ది ఎల్లయ్య, ముస్కె సమ్మయ్య, కవ్వంపల్లి స్వామి, రంగు శ్రీను, ఎం.ఎ.గౌస్, తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ అమరవీరులకు ఘన నివాళులు

**విశాలాంధ్ర - గూడూరు:** భావితరాల కోసం మాదిగలు వర్గీకరణ పోరాటం కొరకై ప్రాణాలను తృణప్రియంగా వదిలిపెట్టిన అమరవీరుల త్యాగాలు మరువలేవని గూడూరు మండల ఎమ్మార్పీఎస్ కన్వీనర్ మందుల ప్రవీణ్ అన్నారు. ఆదివారం మాదిగ అమరవీరుల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలంతా ఏకతాటిపై పోరాటం చేయాలని, మన పిల్లల భవిష్యత్తు కొరకు హక్కులకై ప్రతి విషయంలో న్యాయపోరాటం చేయడానికి వెనుకకు తగ్గకూడదని ఆయన అన్నారు. ఎస్సీ కాలనీలో ఉన్న మాదిగలంతా ఎమ్మార్పీఎస్ జెండా కింద పనిచేసే మీ కుటుంబాల పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆయన కోరారు. ఆనాటి అమరవీరులు చేసిన ప్రాణ త్యాగాలే నేడు మన కుటుంబాలు జీవనం కొనసాగించే విధంగా వాళ్ళ బలిదానాలు మరవద్దని ఆయన గుర్తు చేశారు. వాళ్ల ప్రాణ త్యాగాలే నేడు వర్గీకరణకు పునాదులు అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్దమనిషి ఎల్లంకి మల్లయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ మందుల ప్రవీణ్ మాదిగ, బోడ వెంకన్న మాదిగ, హెచ్ శివ మాదిగ, పోలపాక యాకయ్య మాదిగ, ఎల్లంకి సంపత్, ఎల్లంకి వినయ్ మాదిగ, పోలిపాక రమ పాల్గొన్నారు.

## ఉన్నతాధికారులు రాకపోవడం శోచనీయం...

**విశాలాంధ్ర - ఖమ్మం :** నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎం అకాల మరణం తెలిసి కూడా ఉన్నత అధికారులు ఎవరూ వారి కుటుంబాన్ని పరామర్శించకపోవడం శోచనీయమని తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎంల సంఘం (ఏఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు తోట రామాంజనేయులు అన్నారు. చింతకాని పీహెచ్సీ పరిధిలోని కొదుమూరు సబ్ సెంటర్లో గత 17 సంవత్సరాలుగా రెండవ ఏఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తున్న ఆర్ ఝాన్సీ మృతి చెందగా ఆదివారం ఆమె కుటుంబ సభ్యులను ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఖమ్మం నగర కార్పొరేటర్ బి.జి.క్లెమెంట్‌తో కలసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ హెల్త్‌మిషన్‌లో పనిచేస్తున్న కార్మికులపై వివక్షత చూపుతున్నారని పేర్కొన్నారు. తాము గతంలోనే చెప్పినట్లు 18 సంవత్సరాలు రెండవ ఏఎన్ఎంగా మిషన్‌లో భాగమై తక్కువ వేతనానికి పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చిన ఝాన్సీ లాంటి ఎంతోమంది ఉద్యోగులు చనిపోతున్న ప్రభుత్వం ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వారు మరణించినప్పుడు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకపోగా, మానవతా దృక్పథంతో సహాయం కూడా చేయకపోగా కనీసం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించలేని స్థితిలో అధికారులు ప్రభుత్వ పెద్దలు ఉన్నారని ఆయన విమర్శించారు. కాంట్రాక్ట్ పద్ధతిలో వివిధ డిపార్ట్మెంటులో పనిచేస్తున్న వారికి చనిపోయినప్పుడు దహన సంస్కారాలకు ఎంతో కొంత ఆర్థిక సాయం చేసే వెసులుబాటు ఉందని, కానీ వాటిని అమలు చేసే నాథుడు లేడన్నారు. మరణించినప్పుడు వారి వైపు చూసే దిక్కే లేదన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.10 లక్షలు, 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై ఏఐటియుసి పోరాటం చేస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. ఝాన్సీ కుటుంబానికి లక్ష రూపాయల దహన సంస్కారాలకు ఇవ్వాలని, మిగిలిపోయిన సర్వీస్ను లెక్కించి గ్రాట్యుటీ క్రింద పది లక్షలకు తగ్గకుండా వారి కుటుంబానికి అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మృదువైన జుట్టు కోసం పారాచూట్ అడ్వాన్స్‌డ్ ఆయిల్

**వరంగల్:** రానున్న వేసవికాలం నేపథ్యంలో మండే వేడి జుట్టు నుండి తేమను తీసివేస్తుందని, దానితో జుట్టు పొడిగా, నిస్తేజంగా నిర్వహణ కష్టతరంగా మారుస్తుందని దీనిని అధిగమించేందుకు పారాచూట్ అడ్వాన్సుడ్ హెయిర్ ఆయిల్ ప్రభావంతమైన పరిష్కారం చూపుతోందని ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. ఈ సీజన్లో జుట్టును ఆరోగ్యంగా హైడ్రేట్‌గా ఉంచడానికి, సరైన పదార్థాలతో దానిని పోషించడం చాలా అవసరం అన్నారు. తేమను లాక్ చేయడానికి, జుట్టును దృఢమైనదిగా చేయడానికి వేసవి నష్టం నుండి జుట్టును రక్షించడానికి కలబంద మరియు కొబ్బరి ఒక ఖచ్చితమైన చక్కని కలయిక అన్నారు. పారాచూట్ అడ్వాన్స్ అలోవెరా ఎన్‌రిచ్డ్ కొబ్బరి నూనె వన్ స్టాప్ పరిష్కారంగా ఉంటుందన్నారు. అలోవెరా కొబ్బరి మంచితనంతో సమృద్ధిగా ఉన్న ఈ తేలికపాటి, జిగట లేని ఫార్ములా గొప్ప పోషణను అందిస్తుందన్నారు. ఎటువంటి అదనపు తయారీ అవసరం లేకుండా, వేసవిలో జుట్టును రెండు రెట్లు సున్నితంగా మృదువుగా చేస్తుందన్నారు. డీఐవై నరిషింగ్ హెయిర్ మాస్క్‌ను ఇష్టపడేవారికి, మృదువైన పేస్ట్‌లా తయారుచేయడానికి కొబ్బరి ఆధారిత హెయిర్ ఆయిల్‌తో తాజా అలోవెరా జెల్‌ను కలపాలని చెప్పారు.

## అవినాష్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో ఏసీఏటీ అఛీవర్స్ మీట్

**హైదరాబాద్:** అవినాష్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ అవినాష్ బ్రహ్మదేవర నాయకత్వంలో, ఏసీఏటీ 2024 సన్మాన కార్యక్రమం మార్చి 2, 2025న ఎల్‌బీ నగర్ బ్రాంచ్‌లో విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమం ఏసీఏటీ 2024లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పదో తరగతి విద్యార్థులను వారి తల్లిదండ్రులు, పాఠశాల ప్రతినిధుల సమక్షంలో జరుపుకుంది. దక్షిణ భారతదేశంలో నంబర్ 1 కామర్స్ కాలేజ్ అయిన అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్, 12 సంవత్సరాల అత్యుత్తమ అనుభవం, 750కిపైగా అధ్యాపకులు, 12 బ్రాంచ్‌లు, 20,000పైగా విద్యార్థులను కలిగి ఉంది. ఇది 25ం కామర్స్ కెరీర్ ఎంపికలను అందిస్తుంది. ఆరు సంవత్సరాలుగా ఎంఈసీ, సీఈసీలో స్థిరంగా నంబర్ 1 ర్యాంక్‌ను కలిగి ఉంది, అలాగే దక్షిణ భారతదేశంలో బీబీఏకి నంబర్ 1, భారతదేశం అంతటా నంబర్ 25 స్థానంలో ఉంది. ఏసీఏటీ 2024 గుర్తింపు పొందిన విద్యా నైపుణ్యాన్ని నగదు బహుమతులతో సత్కరించారు. రాష్ట్ర 1వ బహుమతికి రూ.1,00,000, రాష్ట్ర 2వ బహుమతికి రూ.50,000, ప్రతి జోనల్ టాపర్‌కు రూ.25,000. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ అవినాష్ బ్రహ్మదేవర హాజరయ్యారు.

## పీయం ఇంటర్న్‌షిప్‌ను మైనార్టీలు ఉపయోగించుకోవాలి : యాకూబ్ పాషా

**విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని మైనారిటీలు ఉపయోగింకచు కోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా కోరారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇంటర్న్‌షిప్‌కు ఎన్నికైన యువకులకు స్టైపెండ్ కింద ముందుగా రూ.6 వేలు అనంతరం ప్రతి నెల రూ.5 వెల చొప్పున స్టైఫండ్ కేంద్రం ప్రభుత్వం అందిస్తుందన్నారు. 21 నుండి 24 ఏండ్ల మధ్య వయస్సు కలిగి, సంవత్సర ఆదాయం రూ.8 లక్షలు లోపు ఉన్న వారు మాత్రమే ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. దేశంలోని 500 ప్రసిద్ధ కంపెనీలు ఈ ఇంటర్న్‌షిప్ అందించడంలో భాగస్వాములుగా ఉన్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రెండవ దశలో 5,357 మందికి ఇంటర్న్‌షిప్‌కు అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి గల యువకులు తమ ఆధార్ కార్డ్ లింక్ అయి ఉన్న ఫోన్ నంబరుతో ఈనెల 12లోపు తమ వివరాలు pminternship.mca.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని మైనారిటీ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర సమాచారం కొరకు 8520860785 కు సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మైనారిటీ నాయకులు హుస్సేన్ ఖాన్, సలీమ్, ఆసిఫ్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ

**విశాలాంధ్ర - ఇల్లందు :** పట్టణంలోని మార్గదర్శిని గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో ఆదివారం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తమ సీనియర్లకు 9వ తరగతి విద్యార్థులు ఈ వీడ్కోలు సభను ఏర్పాటు చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్గదర్శిని గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్లు మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యాదగిరి రాంబాబు, ఆర్వపల్లి రాధాకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి జీవితంలో పాఠశాల విద్య భవిష్యత్తు ఎదుగుదలకు పునాది లాంటిదన్నారు. విద్యార్థి జీవితంలో తొలిమెట్టు అయిన పాఠశాల చదువుతోపాటుగా, సంస్కారం, సభ్యత సమాజంలోని మంచి చెడులను బోధిస్తుందన్నారు. పది సంవత్సరాలు కష్టపడి చదివిన విద్యార్థులకు పదో తరగతి పరీక్షల నేపథ్యంలో ఉపాధ్యాయులు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. విద్యార్థులు అందరూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. విద్యార్థులు సైతం మాట్లాడుతూ మార్గదర్శినిలో చదవడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు చూపరులను అలరించాయి. పాఠశాలలో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, ఆవుల భాస్కర్‌రావు, శ్రీనివాసరావు, కంది గోపి, సతీష్, భగవాన్ దాస్, రాము, అజిత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కవితాధారలయ్యే మౌన తొలకరి

# సా హి తి

మౌనం... చెట్టులా స్మృతుల పుష్పాలతో గుబాళిస్తూ వుంటుంది. దీపంలా అనుభూతుల కిరణాలతో గుండెగదిని ఆక్రమిస్తూ వుంటుంది. మేఘంలా ఆశల చినుకుల్ని కురిపిస్తూ వుంటుంది. ఆమనిలా బతుకు చెట్టుపై భవితవ్యపు చిగుళ్లను చిగురింపజేస్తూ వుంటుంది. అవును... మౌనం ఇన్ని పార్శ్వాలుగా మానవ జీవనయానంలో చోటుచేసుకొని మనిషికి దిశానిర్దేశం చేస్తూ వుంటుంది. మౌనంలోంచి రేపటి సుందర స్వప్నాల సౌరభాలు గుబాళించవచ్చు. మౌనంలోంచి విద్రోహపు విస్ఫోటనాలూ పెల్లుబుకవచ్చు. మౌనం ఎన్నో నిగూఢార్థాలను అందిస్తుంది. ఎన్నెన్నో అపార్థాలకూ పాదులు వేస్తుంది. మనిషి తన స్వార్థంకోసం మౌనాన్ని ఒక ఆయుధంగానూ వాడుకుంటూ వుంటాడు. మౌనాన్ని సద్వినియోగం చేసుకోవడం మనిషి విచక్షణ మీదే ఆధారపడి వుంటుంది. అందుకే మౌనంతో సంలీనమయ్యే కవిత్వం మౌనాన్ని తాత్విక సొబగులతో అక్షరీకరిస్తూ వుంటుంది. హృదయాకాశంలోని ఎన్నెన్నో భావోద్వేగపు మేఘాల్ని కరిగిస్తూ కవితాధారల్ని కురిపిస్తూనే వుంటుంది మౌనతొలకరి. తానే ఎదలపాయల్లో కవితా ప్రవాహమై పోతూ వుంటుంది. 'నిశ్శబ్దంగా వుండి నువ్వే జీవించే కవిత్వమైపోవాలి' అంటూ జలాలుద్దీన్‌రూమీ నిశ్శబ్దం కవిత్వంగామారే వైనాన్ని వర్ణిస్తాడు. 'కవిత్వానికి శబ్దమెంత ముఖ్యమో నిశ్శబ్దం కూడా అంతే ముఖ్యం' అంటూ చెట్టుకవి ఇస్మాయిల్ కవిత్వాన్ని శబ్దంతో పాటు నిశ్శబ్దమూ ఎంత అందంగా, పరిమళభరితంగా తీర్చుదిద్దుతుందో చెబుతాడు.

'నీ మౌనం తీగలుతీగలుగా సాగి/ఏ పాట మీదికో పాకిపోయింది/ పాట కరిగికరిగి నిశ్శబ్దంలోకి జారిపోయింది' అంటూ డాక్టర్ ఎన్ గోపి మౌనం పరిణామక్రమాన్ని కవిత్వీకరిస్తాడు.

'న్యాయాన్యాయాలు రణరంగమైనప్పుడు/సత్యాసత్యాలు కత్తులు దూసుకున్నప్పుడు/ద్రవీభవించిన మౌనం/ గాండీవం సంధిస్తుంది' అంటూ అడిగోపుల వెంకటరత్నం కొన్ని సందర్భాల్లో మౌనం నిర్వర్తించవలసిన కర్తవ్యాన్ని సూచిస్తాడు.

'అబద్ధం చెప్పకూడదనుకున్నప్పుడు
నిజాన్ని చెప్పలేనప్పుడు/మౌనం ఒక పరిష్కారం
మనిషిని మానసికంగా చంపాలనుకున్నప్పుడు
మానసికంగా మనిషి చావాలనుకున్నప్పుడు/మౌనం ఒక ఆయుధం
అనుబంధాలు నిలవాలనుకున్నప్పుడు
సంబంధాలు వొద్దనుకున్నప్పుడు/మౌనం ఒక బలం
మౌనం మదిని మురిపిస్తుంది/మౌనం కళ్లను తడిచేస్తుంది
మౌనం హృదిని తడిపేస్తుంది
మౌనానికి మాటై నిలిస్తే రాజీ

మౌనానికి మౌనం కలిస్తే సంఘర్షణ
మౌనసమయం తెలిసున్నవాడే విజేత
మౌనస్థానం తెలియనివాడే పరాజిత
మౌనంలో మూగబాధలుంటాయి
మౌనంలోనే సరాగాలూ దాగుంటాయి
మౌనం వాడే దమ్ము/మౌనం వాడే ఒడుపూ..నీదైతే
సమర్థుడికి మౌనం కన్నా వరమేముంటుంది?..........
సమర్థుడికది ఏకాంతం/నిర్భాగ్యుడికదో ఒంటరితనం
సాహసికదో అవకాశం/పిరికివానికదో పలాయనవాదం
ఆనందాలకూ, ఆవేదనలకూ
వినోదాలకూ, విషాదాలకూ/సంకేతాలకూ, సందేహాలకూ
పరివశించడానికీ, నిరసించడానికీ
ఆమోదించడానికీ, నిరాకరించడానికీ ....
నవ్వుల విరబూతకూ, గుండెలు చెలమలవ్వడానికీ
మౌనాన్ని మించిన భాష వుందా? మౌనవించని మనసుందా?'
('మౌనం' ఖండిక నుంచి)

అంటూ జీవితంలో ఎన్నెన్నో పార్శ్వాలుగా దోబూచులాడుతూ అనునిత్యం మనిషిని ఉక్కిరిబిక్కిరి చేస్తుండే మౌనం ప్రస్థానాన్ని కవిత్వీకరిస్తాడు వేమూరి మల్లిక్. మనిషి విభిన్న మానసిక దశల్లో మౌనం మనిషికి ఎన్నివిధాలుగా ఉపకరిస్తుందో, మరెన్ని విధాలుగా కంటగింపు కలిగిస్తుందో ఏకరువు పెట్టాడిక్కడ కవి. సమాధానాలు లేని ఎన్నో ప్రశ్నలకు మౌనమే పరిష్కారమైపోతూ వుంటుంది. మౌనం ఓసారి బాధల అగ్నిసెగల్ని విరజిమ్మితే మరోసారి పులకింతల జల్లుల్ని కురిపిస్తుంది. మనిషి గెలుపోటములూ మౌనమే నిర్ణయిస్తుంది.

పరిస్థితులు సృష్టించే జీవనసంఘర్షణలోంచి మౌనం ధారగా కురుస్తూనే వుంటుంది. మౌనాన్ని ఒడుపుగా ఒడిసిపట్టుకునేవాడు తడియారని కన్నీటి సుడిగుండాలనూ దాటేయగలడు. మనిషికి ఎన్నో సందర్భాల్లో దిశానిర్దేశంచేసే మౌనం అతనిపాలిట వరమే అవుతుంది. అతనికి ఏకాంతపు మధురిమల్ని అందిస్తుంది. మౌనాన్ని ఆకళింపు చేసుకోనివాడికి అది ఒంటరితనపు దిగులైపోతుంది. మనిషి జీవితంలోని ఎన్నెన్నో భావోద్వేగాలకు మౌనం అద్భుతమైన భాష అయిపోతుంది. భావోద్వేగాలు మనసు వీణపై ఎన్నోసార్లు మౌనస్వరాలను పలికిస్తూనే వుంటాయి.

'సన్నగిల్లిన మది స్థాణువై
మౌనసంగీతాన్ని వినిపిస్తూనే వుంది
గతమైపోయిన గాయాలు
మళ్లీ గుచ్చుకుంటూ
జాలిమాటలు చేదుస్వరాలై
గగనం గంభీరమై/గమ్యానికి బాటలు చూపిస్తున్నది
నా గాయాల వెక్కిళ్లు/నేడుజ్ఞాపకాల కన్నీళ్లు రాలుస్తూ
శిథిల బంధాలను/ఏకరువు పెడుతున్నాయి
తుది దుప్పటి కప్పుకున్నాక
నాదన్నది ఏమీలేదన్నది కూడా తెలియని నిశ్చేతనాస్థితిలో
ఆశలబతుకు/అనుబంధాలకై ఆరాటపడుతూనే వుంటోంది
కొడిగట్టే ప్రాణి కూడా/కోరికల చిట్టా విప్పుతూ
అంతిమ గడియలు కూడా
ఊపిరికై ఉరకలు వేస్తూనే వుంటాయి
ప్రతి జీవిత చరిత్రలో
కాలగర్భంలో కలసిపోయే క్షణాలన్నిటిలో
దుఃఖాన్ని సవరించుకున్న/సందర్భాలు నిండే వుంటాయి.......
కదం తొక్కిన కన్నీళ్లు/మనసుతో సావాసం చేస్తూ
నిన్నటి కలలకు కొత్త ఆశల దీపాలు వెలిగిస్తాయి
మౌనం ముందు మోకరిల్లిన మనసు
ఆత్మను అవనతం చేసుకుంటుంది
పశ్చాత్తాపాలు పెదవెనుకన/నిట్టూర్పుల వర్షాన్ని కురిపిస్తాయి
ఆవిరైన ఆనందాలు/అవసరాల నవ్వులు తొడుక్కుంటాయి
దాచుకున్న గాథలు/వ్యథల కథలు అల్లుతూ
చీకటి కాగితంపై
మౌనాక్షరాలు చెక్కుతూ
నిశ్శబ్ద నిశీథిలో భావాల బావుటాలెగరేస్తాయి
('చీకటి ఆశ' ఖండిక నుంచి)

అంటూ మౌనం మనిషిలో జీవనతాత్వికతను వొంపిన వైనాన్ని కవిత్వీకరిస్తాడు వార్ధాలస. గతం తాలూకు గాయాలు అదేపనిగా వేధిస్తున్నా, జ్ఞాపకాల కన్నీళ్లు ధారగా కురుస్తున్నా, శిథిలమైన బంధాలను గుర్తుచేస్తున్నా మౌనం గగనంలా మనసును గంభీరం చేస్తుంది. చివరి క్షణాల్లోనూ జీవితం ఆశల అనుబంధాలకై ఆరాటపడేలా, ఊపిరికై ఉరకలు వేసేలా చేస్తుంది. ఎన్నో సందర్భాల్లో దుఃఖాల్ని సవరిస్తూ జీవితాల్ని స్థిమితపరుస్తూ వుంటుంది. కన్నీళ్లు ఉప్పొంగిపోతున్నా సంకల్పమై మనిషి చెట్టులో కొత్త కలలచిగురుల్ని తొడుగుతుంది. జీవనగమ్యం వైపునకు పయనింపజేస్తుంది. నిస్సహాయస్థితిలో తన ముందు సాష్టాంగపడిన మనసును బుజ్జగిస్తూ సేదదీరుస్తుంటుంది. పశ్చాత్తాపాల్ని నిట్టూర్పుల వర్షంగా కురిపిస్తుంది. ఆనందాలు ఆవిరైపోతున్నా జీవిస్తూ మునుముందుకు సాగడానికి జీవితాలకు అవసరాల నవ్వుల్ని తొడుగుతుంది. మౌనం మనసు తీగలపై ఎన్నో జీవననాదాల్ని పలికిస్తుంటుంది. అంతులేని జీవనతాత్వికతను ఒలికిస్తుంటుంది. మౌనం పరిమళిస్తే మనసు పచ్చదనపు ఉత్సాహంతో ఉరకలు వేస్తుంది. 'నీదైన యీ మౌనం/నన్ను స్పృశించడమే కాదు/చలిమంటై దహిస్తుంది కూడా' అంటూ డాక్టర్ కోగంటి విజయబాబు ఒక మనిషి మౌనం వివిధ సందర్భాల్లో ఇంకో మనిషిపై ఎంతటి ప్రభావాన్ని చూపుతుందో కవితాబద్ధం చేస్తాడు. 'మౌనం మాట దిమ్మరి కాదు/మనసు కాపలా' అంటూ చందలూరి నారాయణరావు మనిషి మనసును జీవనవైపరీత్యాల నుంచి కాపాడే రక్షకుడిగా మౌనాన్ని అభివర్ణిస్తాడు. నిజమే... మౌనం కాకూడదు ఎప్పుడూ జీవనరణం... అది ఎప్పుడూ అవుతూవుండాలి మనుషుల్ని కలిపే సౌభ్రాతృత్వపు గానం.

**- డాక్టర్ కొత్వాలు అమరేంద్ర, 9177732414**

---

## మనసులను వెంటాడే పాత్రల కథామాలిక

గ్రంథ సమీక్ష

మధ్యతరగతి, సామాన్యుల జీవితాలే తమ రచనల్లో పాత్రలుగా రూపుకట్టించి తద్వారా తామనుకున్న సామాజిక ప్రయోజనాన్ని సాధించాలని ఆశిస్తూ రచనలు చేసే రచయితల్లో ముందువరుసలో ఉంటారు ప్రముఖ రచయిత డా. శాంతినారాయణ. అందుకే ఆయా రచనలు పాఠకుల మనసుల్ని ఎక్కువ కాలం వెంటాడతాయి. రచయితగా తనదైన ప్రత్యేకతతో పాఠకుల మనసుల్లో ప్రత్యేక స్థానం పొందిన ఆయన కలం నుంచి వెలువడిన కథల సంపుటే 'గీతలు చెడిపి...'. ఇందులో రాజ్యం, గత్తెంతరం ల్యాక, నకిలీమందులు, ద్రౌపది మొదలుకొని కాషాయవైద్యం వరకు మొత్తం పది కథలున్నాయి. ప్రతి కథ తనదైన వైవిధ్యతతో, పాఠకులను తనలోకి తీసుకుపోతుంది.

ఈ సంపుటి శీర్షిక అయిన 'గీతలు చెడిపి..' కథ వృత్తి జీవితానికి, వ్యక్తుల మనస్తత్వాలకు మధ్య జరిగే కథ. తమ తండ్రి వృత్తిని తాము స్వీకరించాలనుకున్న ఇద్దరు కూతుళ్ళకు చుట్టూ ఉన్న మనుషుల వల్ల ఎటువంటి ఇబ్బందులు పడ్డారో, మానసిక క్షోభననుభవించారో తెలుపు తుంది. ఈ కథ చివరలో 'మరసట్రోజు ఆదివారం! పద్దన్నే శకుంతలా మంగమ్మా మగపిల్లోల్ల డ్రస్సులేసుకోని నిర్భయంగా సెలూన్లో తమ రుత్తిపనికి దిగినారు. శకుంతల దువ్వానీ కత్తెరా పట్టుకోని క్రాపు కటించు జేత్తావుంది. మంగమ్మ కుడిసెయ్యిసిటికెనేలికీ ఉంగరమేలికీ మద్దెలో సెలూన్ మడత కత్తిని యిరికొచ్చుకోని, సూపుడేలూ బొట్నేల్లతో పట్టుకోని గడ్డంతీత్తా, మీసాలు సున్నగ గీకేత్తా ఉంది. బయట బెంచీల మింద ఐదారుమంది కుచ్చోని తమ వొంతు కోసరంఎదురు సూత్తాండారు. సెలూను కొత్తకాంతులతో కలకలలాడ తాంది...' అంటూ కథకు అప్పటికి సుఖాంత ముగింపునిస్తారు. అయితే శకుంతల, మంగమ్మలు సెలూన్‌లోకి రావడానికి ముందు జరిగిన కథే ఈ 'గీతలుచెడిపి...' కథకు ప్రాణం. ఏ వృత్తయినా అది చేసే వారికి వారు కొలిచే దైవంతో సమానం. తేలికభావనతో వారిని అవమానించడం కొంతమందికి పరిపాటి. అటువంటి వారి మధ్య తమకు ఎదురైన సమస్యలను స్వయంకృషితో తామే పరిష్కరించు కోవాలని జీవితాలకు, జీవనానికి అడ్డుగీతల్లా ఉన్న ఆ సమస్యను ఊరిపెద్దగా భావించే రెడ్డమ్మ, ఇతర పెద్దల సహకారంతో పరిష్కరించుకున్న శకుంతల, మంగమ్మల మనోధైర్యమే ఈ కథ. 'నకిలీ మందులు' కథ మనిషిలో మనిషి అసలురూపాన్ని పరిచయం చేస్తుంది. మనిషిలో ఇద్దరుంటారని, బయటకు కనిపించేవారుకాకుండా లోపల ఇంకొకరుంటారు. నకిలీమందులు ఆరోగ్యానికి ఎంత ప్రమాదకరమో, నకిలీ మనస్తత్వాలున్న మనుషులు అంతే ప్రమాదం సమాజానికి. వారివల్ల ఎన్నో మనసులు గాయపడతాయి. సమాజానికి నిజమైన ప్రమాదం వారివల్లే. అందుకే అటువంటి వారికి దూరంగా ఉండటం శ్రేయస్కరం అంటారు రచయిత ఈ కథలో.

మరో కథ 'అసలురూపాలు'. తన జీవితాన్ని, కుటుంబాన్ని మరచి అందరిలా కాకుండా వృత్తిధర్మానికి అతీతంగా కష్టకాలంలోనూ నిరంతర వైద్యసేవలతో ఊరి ప్రజల్ని కాపాడిన ఆ డాక్టర్ కరోనాతో మరణిస్తే అప్పటివరకు దేవుడని కొలిచినవారు కనీసం ఓ కన్నీటిచుక్కనైనా రాల్చకపోగా, శవాన్ని తన ఊరిగుండా తీసుకువెళ్ళకూడదని భావించిన మనుషులను చూసి ఆ డాక్టర్ కొడుకు 'ఛీఛీ, వీళ్ళు మనుషులేనా? ఎందుకింత అమా నుషంగా ప్రవర్తిస్తున్నారు? వీళ్ళలోని మానవత్వం యేమయిపోయింది? ఈ దుర్మార్గానికి కారకులెవరు?' అని బాధపడతాడు. వికలమైన మనసుతో నా అన్నవాళ్లెవరూ సహాయంగా రాని అమాననీయ స్థితిలో, ఎవరోతెలియని ఇద్దరు ఆసుపత్రి మహానుభావుల చేయూతతో తల్లీ భార్యాబిడ్డల ఆర్తనాదాల మధ్య డాక్టర్ సుబ్బయ్య శవాన్ని అంబులెన్సులో నుంచి కిందకు దించినాడు చంద్రప్రకాష్. అంటూ ముగింపునిస్తారు. కాలం ఎంతగామారినా, మనిషి తనలోని మానవత్వాన్ని వదులుకోకూడదు. కృతఘ్నులు కాకూడదు. అదే జరిగితే మనిషిమీదే కాదు నమ్మకంమీదే నమ్మకం పోతుంది. అదే చెబుతుంది ఈ కథ.

ఇలా ప్రతికథ చదువుతుంటే మనకు తెలిసిందే అనిపిస్తుంది. ఇదే తెలిపిన స్వార్థమనస్తత్వాలుగా మారకుండా మనిషిగా మనసుతో ఆలోచించమంటాయి ఈ కథలు. మనసులను వెంటాడే కథలు 'గీతలు చెడిపి...'

**-కార్తికేయ**

గీతలు చెడిపి... (కథలు) -డా. శాంతి నారాయణ
పేజీలు: 200, వెల: రూ.250/-
ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్
నవతెలంగాణ పబ్లిషింగ్‌హౌస్ అన్ని బ్రాంచీలు
నవచేతన పబ్లిషింగ్‌హౌస్ అన్ని బ్రాంచీలు
విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

---

## సంతృప్తి శిఖరాలపై...

బహుశా
నా కోసం పరితపించే
మనుషుల కోసం వేచి చూశాను.

అయినప్పటికీ ఇప్పటికీ
ఆర్థిక భాష అవసరమైనప్పటికీ
కళ్ళలో మెరిసే వాత్సల్యపు
చూపుల కోసం ఎన్నోయేళ్లు
ఎదురు చూశాను.

ఒంటరి ఆకాశాన్ని
కళ్లలో నింపుకోవడంతోనే
ఆరంభమైన బాల్యం
కవిత్వంతోనే సేదదీరింది.

మనిషి బతకడానికి
కరెన్సీ భాష అవసరమైతే
మనసు బతకడానికి
నాలుగు మాటల
పరిమళపు భాష అవసరం.

ఇన్నేళ్ల ప్రయాణం తర్వాత
వెనుతిరిగి జీవిత పుస్తకాన్ని
అవలోకనం చేస్తే
కొన్ని కన్నీళ్లు కొన్ని ఆనంద భాష్పాలు
జల జలా రాలుతుంటాయి.
ఈ కన్నీటిని తాకొద్దు
ఇవి కూడా అనుభవాల పరిమళాలే.

ఈ ఆనంద భాష్పాలని
చెదిరిపోనివ్వకు.
జ్ఞాపకాల వరదలుగా
కాల ప్రవాహంలో పారనివ్వనీ.

ఎన్ని సాధించిన
ఎన్ని మెట్లు ఎక్కినా
సంతృప్తిని మించిన శిఖరం
మరొకటి లేదు.

నేనిప్పుడు ధ్యాన ప్రపంచంలో
ప్రకృతితో మమేకమౌతున్నాను.

రాలిన శిశిరాల వెంట
ఆకుల్లో ఆఖరిచూపులుగా
అనుభవాలుగా అనుభూతులుగా రాలుతూ
మళ్లీ వసంతంలా
సంతృప్తి శిఖరాలమీద
ఉదయిస్తాను.

**గవిడి శ్రీనివాస్, 08886174458**

---

# శశిథరూర్ దృష్టితో నెహ్రూ

మంచి పుస్తకం

బంతిని ఎంత గట్టిగా గోడకేసి కొడ్తే అంతే వేగంగా వెనక్కు తిరిగి వస్తుంది. పండిత్ నెహ్రూ వ్యక్తిత్వం సరిగ్గా అలాంటిదే. మోదీ ప్రధానమంత్రి అయిన దగ్గరనించి నెహ్రూను భారతీయుల స్మృతి పథంలో నుంచి తొలగించాలన్న దురాశతో అదే పనిగా నెహ్రూ వ్యక్తిత్వ హననానికి ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. పెద్ద గీత ముందు మరో పెద్ద గీత గీయలేనప్పుడు ఉన్న గీతను చెరిపేయాలనుకునే వ్యక్తిత్వం మోదీది. మోదీలాంటి వ్యక్తి రాజకీయ యవనైక మీద విలయ తాండవం చేస్తాడని శశిథరూర్ కనీసం ఓ దశాబ్దం ముందే గుర్తించినట్టున్నారు. అందుకే 2003లోనే "నెహ్రూ: ది ఇన్వెన్షన్ అఫ్ ఇండియా" అన్న గ్రంథం రాశారు. నెహ్రూ స్వయంగా సృష్టించిన సాహిత్యం ఎంత విలువైందో ఆయన మీద ఇతరులు రాసిన సాహిత్యం అంతే అపారమైంది.

నెహ్రూ రచనా వ్యాసాంగం గురించి మాట్లాడే వారు ఆయన ఆత్మకథ, డిస్కవరీ ఆఫ్ ఇండియా, గ్లింప్సెస్ ఆఫ్ వర్ల్డ్ హిస్టరీ గ్రంథాలను మాత్రమే ప్రస్తావిస్తారు. కానీ ఆయన ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు రాసిన లేఖలు మరింత విలువైనవి. నవ భారత నిర్మాణం కోసం పాటుబడ్తున్న సమయంలో, ప్రజాస్వామ్య ప్రక్రియలో మనదేశం ఒనమాలు దిద్దుకుంటున్న తరుణంలో, దేశ విభజన నేపథ్యంలో మత రక్కసి విసురుతున్న సవాళ్లను ఎదుర్కొంటున్న స్థితిలో నెహ్రూ ముఖ్యమంత్రులకు లేఖలు రాశారు. ఈ లేఖలు నెహ్రూ ఆత్మకథలాగే భారత ప్రజాస్వామ్య వ్యవస్థ నిలదొక్కుకుంటున్న తీరుకు ఉదాహరణలు.

నెహ్రూ రాసిందే అపారం అనుకుంటే ఆయన మీద వచ్చిన సాహిత్యం, ఆయన జీవిత చరిత్రలు కూడా ఎక్కువగానే వచ్చాయి. విదేశీయులు రాసినవి కూడా అపారంగానే ఉంటాయి. అయినా శశిథరూర్ నెహ్రూ మీద మరో పుస్తకం రాశారు. నెహ్రూ మీద మోదీ, అమిత్ షా అజ్ఞానపూరితమైన దాడి చేస్తున్న సందర్భంలో అంతకన్నా పదేళ్ల ముందే "నెహ్రూ: ది ఇన్వెన్షన్ అఫ్ ఇండియా" రాసిన క్రాంతదర్శి.

ఈ గ్రంథంలో శశిథరూర్ ప్రకాశవంతమైన నెహ్రూ జీవితంలోని పార్శ్వాలను మరింత దేదీప్యమానంగా చూపించారు. అయితే నెహ్రూ ఎక్కువ కాలం ప్రధాన మంత్రిగా ఉండడాన్ని శశిథరూర్ ఆక్షేపించడానికి వెనుకాడ లేదు. నెహ్రూ గురించి తాను విన్నవీ కన్నవీ కలిపి పోగేసి థరూర్ ఈ పుస్తకం రాశారు. నెహ్రూ గురించి తమకు బోలెడు తెలుసుననుకునే వారికి, తెలుసు కోవాలనుకునే వారికీ ఈ గ్రంథం ఉపయుక్తంగానే ఉంటుంది. శశిథరూర్ నెహ్రూ జీవితంలోని వివిధ ఘట్టాలను అత్యంత సూక్ష్మంగా




పరిశీలించినట్టు ఈ గ్రంథం చదివితే అర్థం అవుతుంది. శశిథరూర్ నెహ్రూ జీవితంలోని వ్యక్తిగత, రాజకీయ, సైద్ధాంతిక వివరాలను కూడా ఈ గ్రంథంలో పొందుపరిచారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ఇండియా వేసిన అడుగులను ఇలాంటి గ్రంథం చదివి గమనించవచ్చు. ఆ నాటి సంక్లిష్టతలను, సవాళ్లను అంచనా వేయొచ్చు. నెహ్రూ మరణించిన తరవాత 50 ఏళ్లకు అధికారంలోకి వచ్చిన సంకుచిత స్వభావం గల వారు నెహ్రూ వ్యక్తిత్వ హననంలో ఆంతర్యం ఏమిటో, ఆ కాలం నాటి భారత చరిత్రను, రాజకీయా లను అర్థం చేసుకోవడానికి థరూర్ గ్రంథం ఉపకరిస్తుంది.

నెహ్రూ జీవితాన్ని వలసవాద పాలనా కాలం, స్వాతంత్ర్యం సంపాదించిన తరవాత తొలినాళ్ల పరిణామాల మధ్య అద్భుతమైన సమ్యోగం సాధించడం శశిథరూర్ నైపుణ్యానికి, సామర్థ్యానికి ప్రతీక. నెహ్రూ వ్యక్తిగతంగా నమ్మిన విషయాలు, రాజకీయ కార్యాచరణను ఈ గ్రంథంలో థరూర్ ఒడిసి పట్టారు.

ఈ గ్రంథాన్ని శశిథరూర్ సాంప్రదాయికంగా జీవిత చరిత్రలను ఆవిష్కరించే పద్ధతిలోనే రాశారు. కానీ వివిధ ఘట్టాల మధ్య అనుసంధానం సాధించడంలో థరూర్ నైపుణ్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. నెహ్రూ పరిపాలనా రీతిలో ఆదర్శవాదం, ఆచరణవాదం కలగలిసి ఉన్నాయని శశిథరూర్ ఈ గ్రంథంలో నిరూపించారు. సెక్యులరిజం, ప్రజాస్వామ్యం, విజ్ఞానశాస్త్రాభివృద్ధి నెహ్రూ విధానాలకు పునాదిరాళ్లుగా ఉపయోగపడ్డాయి. దేశ విభజన అనంతర పరిణామాలను, మతోద్రిక్తతలను, సంస్థానాల విలీనం మొదలైన విషయాల్లో నెహ్రూ ఎదుర్కొన్న విధానాన్ని శశిథరూర్ సుదీర్ఘంగానే వివరించారు.

ఈ గ్రంథ రచనలో శశిథరూర్‌కు అనేక లక్ష్యాలు ఉన్నట్టున్నాయి. దేశచరిత్రలో అత్యంత కీలకమైన వ్యక్తిని పరిచయం చేయడం, నెహ్రూ గురించి తెలిసిన వారికి కొత్త కోణంలో నెహ్రూను చూపించడం, దేశ నిర్మాణంలో నెహ్రూ ఎదుర్కొన్న సవాళ్లు; వాటిని పరిష్కరించిన తీరు, ఆయన హయాంలో తీసుకున్న నిర్ణయాలు, రూపొందించిన విధానాలు కూడా శశిథరూర్ చర్చించారు.

శశిథరూర్ పుట్టింది లండన్‌లో. ఆయన మూడు దశాబ్దాలకు పైగా దౌత్యవేత్తగా విదేశాల్లోనే ఉండిపోయారు. ఇప్పటి దాకా ఆయన పాతిక పుస్తకాల కన్నా ఎక్కువే రాశారు. ఇందులో కాల్పనిక గ్రంథాలూ ఉన్నాయి. దానికి భిన్నమైనవీ ఉన్నాయి. 2009 లో మొదటిసారి ఆయన కేరళలోని తిరువనంతపురం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అప్పటి నుంచి మొన్నటి సార్వత్రిక ఎన్నికల వరకు ఓటమి ఎరుగరు. శశి థరూర్ వ్యక్తిత్వం వైవిధ్యభరితమైంది కనక నెహ్రూ జీవితాన్ని ఆకర్షణీయంగా ఆవిష్కరించగలిగినట్టున్నారు.

**ఆర్వీ రామారావ్**

## రూ.5కే విద్యుత్ కనెక్షన్: సీఎం

**భోపాల్:** రైతులకు కేవలం రూ.ఐదుకే శాశ్వత విద్యుత్ కనెక్షన్ మంజూరు చేస్తామని మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ ప్రకటించారు. భోపాల్‌లో నిర్వహించిన ఓ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ... మధ్యప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఈ పథకాన్ని త్వరలోనే ప్రారంభిస్తుందన్నారు. శాశ్వత విద్యుత్ కనెక్షన్ లేని రైతాంగానికి ఈ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. రైతులకు మంచి చేయాలని, వారి జీవితాలు మెరుగుపడాలని తాము కోరుకుంటున్నామన్నారు. నీటిపారుదల కోసం సోలార్ పైపుల ద్వారా రైతులకు విద్యుత్ సంబంధిత ఇబ్బందుల్ని తమ ప్రభుత్వం తొలగిస్తుందన్నారు. రాబోయే మూడేళ్లలో 30లక్షల సోలార్ ఇరిగేషన్ పంపులను రైతులకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు సీఎం చెప్పారు. రైతుల నుంచి ప్రభుత్వం సోలార్ విద్యుత్‌ను కొనుగోలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో సరైన మౌలికవసతులు, విద్యుత్తు, రోడ్లు లేవన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితులు మెరుగుపడ్డాయని చెప్పారు.

## అన్నాడీఎంకేతో 'విజయ్' పొత్తు ప్రసక్తే లేదు: పీకే

**చైన్నై:** తమిళనాడులో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా పార్టీ పొత్తులు, కీలక నేతల పోటీ విషయంలో ఆసక్తి నెలకొంది. సినీ నటుడు విజయ్ కొత్త పార్టీ స్థాపించి ప్రజల్లోకి వెళ్తున్న నేపథ్యంలో ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ నేత ప్రశాంత్ కిషోర్ (పీకే) కీలక ప్రకటన చేశారు. 2026 ఎన్నికల్లో విజయ్ తమిళగ వెట్రి కళగం... అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని పీకే స్పష్టం చేశారు. విజయ్ రాజకీయ వ్యూహాలకు పదును పెడుతూ ఆయన్ను సీఎం చేయడమే లక్ష్యంగా ప్రశాంత్ కిషోర్ రంగంలోకి దిగారు. తాజాగా ఓ తమిళ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. అన్నాడీఎంకేతో విజయ్ పొత్తు ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆయన ఒంటరిగానే ఎన్నికలను ఎదుర్కొంటారని, ఆ దిశగానే వ్యూహ రచనలు జరుగుతున్నట్టు పేర్కొన్నారు. ఒంటరిగానే తన బలాన్ని చాటి, అధికారం చేజిక్కించుకునే దిశగా ముందుకెళు తున్నట్టు పేర్కొన్నారు.

## ముందు... బీజేపీ తన ఇంటిని చక్కదిద్దుకోవాలి: డీకే

**బెంగళూరు:** 'ముందు బీజేపీ తన ఇంటిని చక్కదిద్దుకోనివ్వండి. ఆ పార్టీలోని పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నేతలతో టచ్‌లో ఉన్నారు. ఈ విషయాన్ని తమ పార్టీ మంత్రులే స్వయంగా వెల్లడించారు. దీనిపై ఎలాంటి చర్చలు అవసరం లేదు' అని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్కొన్నారు. ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సద్గురు జగ్గీ వాసుదేవ్, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలవడంపై వస్తున్న విమర్శలపై ఆయన స్పందిస్తూ ఇది పూర్తిగా ఆధ్యాత్మికమైందని, రాజకీయం కాదని స్పష్టం చేశారు. 'సద్గురు రాష్ట్రానికి చెందినవారు, ఆయన కావేరీ జలాల కోసం పోరాడుతున్నారు. ఆయనే స్వయంగా వచ్చి ఆహ్వానించడంతోనే నేను ఆ కార్యక్రమానికి వెళ్లాను' అని ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. కాగా, మహాశివరాత్రి సందర్భంగా కోయంబత్తూరులో ఈశా ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అమిత్ షా, డీకే శివకుమార్ హాజరయ్యారు. బీజేపీకి డీకేఎస్ దగ్గరవుతున్నారని వస్తున్న వార్తలు కాంగ్రెస్ వర్గాల్లో ఆందోళనకు కారణమైంది. ఈ పరిణామాలపై బీజేపీ నాయకుడు, ప్రతిపక్ష నేత ఆర్.అశోకా స్పందిస్తూ... మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండేతో డీకే శివకుమార్‌ను పోల్చారు. డీకే పార్టీ మారతారని వస్తున్న వార్తలను కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తోసిపుచ్చారు.

## గ్యాంగ్‌స్టర్లు... నేరస్తులను తుడిచిపెడతాం: సీఎం మాన్

**హోషియాపూర్ :** గ్యాంగ్‌స్టర్లు, స్మగ్లర్లు, నేరస్తులు, ఇతర సామాజిక వ్యతిరేక శక్తులకు రాష్ట్రంలో స్థానం లేదని, త్వరలో తుడిచిపెట్టుకుపోతారని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఆదివారం నొక్కి చెప్పారు. 2,490 మంది పోలీసుల పాసింగ్ అవుట్ పరేడ్ సందర్భంగా ఇక్కడ జరిగిన ఒక సభలో ప్రసంగిస్తూ, ఈ పవిత్ర భూమి సాధువులు, అమరవీరులు, దిగ్గజ క్రీడాకారులు, సైనిక జనరల్‌లను ఉత్పత్తి చేసిందని మాన్ అన్నారు. అయితే స్మగ్లర్లు, గ్యాంగ్‌స్టర్లు, ఇతర నేరస్తులు దురదృష్టవశాత్తు గత ప్రభుత్వాల పోషణతో ఈ రాష్ట్రాన్ని తమ నివాసంగా మార్చుకున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. దేశ వ్యతిరేక శక్తులను నిర్మూలించడానికి రాష్ట్ర ప్రభుత్వం 'యుద్ధం' ప్రారంభించిందని, వారు త్వరలో జైలులో ఉంటారని మాన్ అన్నారు. పంజాబ్ ప్రభుత్వం రాష్ట్రంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నిర్ణయాత్మక యుద్ధాన్ని ప్రారంభించడంతో రాష్ట్రం ఒక చారిత్రాత్మక దశలో ఉందని అన్నారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం జీరో టాలరెన్స్ విధానాన్ని అవలంభించిందని, ప్రజల విశేష మద్దతు, సహకారంతో పంజాబ్‌ను పూర్తిగా మాదకద్రవ్య రహితంగా మారుస్తుందని ఆయన చెప్పారు. మాదకద్రవ్యాల సరఫరాను అరికట్టడంతో పాటు వాటిని సరఫరా చేసే అక్రమార్కులను జైలులో పెట్టి, వారి ఆస్తులను జప్తు చేయడం లేదా నాశనం చేయడం జరుగుతుందన్నారు. సరిహద్దు రాష్ట్రంలో కష్టపడి సంపాదించిన శాంతికి భంగం కలిగించడానికి దుష్ట శక్తులు దుష్ట కుట్రలను పన్నుతున్నాయని, పంజాబ్ పోలీసులు అలాంటి ప్రయత్నాలను ఎల్లప్పుడూ అడ్డుకున్నారని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లను మరింత అధిగమించడానికి దర్యాప్తు, శాస్త్ర సాంకేతిక రంగాలలో అవసరాలకు అనుగుణంగా పోలీసు బలగాలను నవీకరించడం తప్పనిసరి అని మాన్ అన్నారు. కొత్త పోలీసులను అభినందిస్తూ, వారు పంజాబ్ పోలీసు కుటుంబంలో అంతర్భాగంగా మారినందున ఇది వారికి ఒక చిరస్మరణీయ సందర్భమని సీఎం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 10,000 మంది కొత్త పోలీసు సిబ్బందిని నియమించాలని కూడా నిర్ణయించిందని, దీనికి అవసరమైన అనుమతిని త్వరలో కేబినెట్ ఇస్తుందని మాన్ చెప్పారు.

# తుది వరకు నేనే అధినేత్రిని

- రాజకీయ వారసులు ఉండరు
- మాట మార్చిన మాయావతి
- మేనల్లుడు ఆకాశ్‌పై వేటు

**లక్నో:** తాను ఉన్నంత కాలం బీఎస్‌పీకి అధినేత్రిగా ఉంటానని, రాజకీయ వారసులు ఎవరూ ఉంబో దరని మాయావతి ప్రకటించారు. గతంలో తన మేనల్లుడిని వారసుడిగా ప్రకటించుకున్న ఆమె ఇప్పుడు మాట మార్చారు. ఆకాశ్ ఆనంద్‌ను పార్టీలోని అన్ని పదవుల నుంచి తొలగించారు. రాజకీయ వారసుడి విషయంలో మాయవతి ఒక మాటకు కట్టుబడటం లేదు. తరచూ నిర్ణయాన్ని మార్చుకుంటున్నారు. నిన్నటి వరకు ఆకాశ్ ఆనంద్‌ను రాజకీయ వారసుడు అన్నారు. ఇప్పుడు కాదంటున్నారు. ఆకాశ్‌ను పార్టీలోని అన్ని పదవుల నుంచి తొలగించారు. అయితే ఇలా జరగడం ఇది మొదటిసారి కాదు. బీఎస్‌పీ జాతీయ సమన్వయకర్తగా ఆకాశ్ ఆనంద్‌ను తప్పించారు. గతేడాది మేలో లోక్‌సభ ఎన్నికలప్పుడు కూడా ఆకాశ్‌పై వేటు వేశారు. ఇప్పుడు మరోమారు ఆయనను బాధ్యతల్లో నుంచి తొలగించారు. ఆకాశ్ స్థానంలో తన సోదరుడు ఆనంద్ కుమార్‌ను నియమించారు. అలాగే ఎంపీ రామ్‌జీ గౌతమ్‌ను కూడా జాతీయ సమన్వయకర్తగా నియమించారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఆదివారం జరిగిన అఖిల భారత పార్టీ సమావేశంలో మాయావతి ఈ మేరకు ప్రకటించారు. ఆకాశ్ రాజకీయ జీవితాన్ని నాశనం చేసింది ఆయన మామయ్య అశోక్ సిద్ధార్థ్ అని నిందించారు. బీఎస్‌పీని రెండుగా చీల్చి బలహీన పర్చేందుకు అశోక్ సిద్ధార్థ్ యత్నించినట్లు మాయావతి ఆరోపించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకుగాను అశోక్‌పై వేటు వేయడాన్ని గుర్తుచేశారు. తనకు సోదరుడు, సోదరి, వారి పిల్లలు కంటే పార్టీ, ఉద్యమాలే ప్రధానమని మాయావతి చెప్పారు. పార్టీ నాయకత్వాన్ని స్థిరీకరించడానికి ఆనంద్ కుమార్ ఇకపై జాతీయ సమన్వయకర్తగా పనిచేస్తారని, ఆయన సామర్థ్యంపై నమ్మకమున్నదన్నారు. ఆయన తనను ఎప్పుడు నిరాశపరచలేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగాన్ని వదలుకొని పార్టీ కోసం అంకితమయ్యారని తెలిపారు. అదే సమయంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు గుప్పించారు. ద్రవ్యోల్బణం, పేదరికం, నిరుద్యోగం, వెనుకబాటుతనం వంటివి పాలకులకు పట్టడంలేదన్నారు. కేంద్ర-రాష్ట్ర బడ్జెట్లు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని దుయ్యబట్టారు. లక్షలాది మంది పేదలు, కార్మికులు, దళితులు, వెనుకబడిన వర్గాల వారి జీవితాలను బాగు చేసే ఉద్దేశంలో ప్రభుత్వ పథకాలు విఫలమయ్యాయని మాయావతి వ్యాఖ్యానించారు. సంపన్న దేశంగా చెప్పుకునే భారత్ నిజానికి పేదల దేశమన్నారు. అంబేద్కర్ సిద్ధాంతాలకు బీఎస్‌పీ కట్టుబడి ఉందని అన్నారు. సమాజ్‌వాదీ పార్టీపైనా మాయావతి విమర్శలు గుప్పించారు. బీఎస్‌పీ పోటీ చేయని మిల్కిపూర్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన ఎస్‌పీ... తమ ఓటమికి ఎవరిని నిందిస్తుందని ప్రశ్నించారు. ఎస్‌పీ, బీజేపీ ఒకే నాణానికి రెండు పక్కలని విమర్శించారు. అంబేద్కర్‌వాదీ విధానం ద్వారా బీఎస్‌పీ మాత్రమే బీజేపీని, ఇతర కుల పార్టీలను ఓడించగలదని వక్కాణించారు. ఈనెల 15న పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతిని పురస్కరించుకొని చేపట్టే కార్యక్రమాలపై మాయావతి దిశా నిర్దేశం చేశారు.

## 'ప్రజలు అడుక్కునేందుకు అలవాటుపడ్డారు'

### బీజేపీ మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు



**భోపాల్:** ప్రజలు యాచించే అలవాటు పెంచుకున్నారని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీకి చెందిన రాష్ట్ర మంత్రి ప్రహ్లాద్ పటేల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రజా సమస్యల వినతులను 'భిక్షాటన'గా ఆయన అభివర్ణించారు. రాజ్‌గఢ్ జిల్లాలో వీరాంగన రాణి అవంతిబాయి లోధి విగ్రహ ఆవిష్కరణకు శనివారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రహ్లాద్ ప్రసంగిస్తూ 'ప్రభుత్వం నుంచి భిక్షాటన చేసే అలవాటును ప్రజలు పెంచుకున్నారు. నాయకులు వచ్చినప్పుడు పిటిషన్లతో నిండిన బుట్టను అందజేస్తారు. వారికి వేదికపై దండలు వేస్తారు. వారి చేతుల్లో లేఖలు ఉంచుతారు. ఇది మంచి అలవాటు కాదు. అడగడానికి బదులుగా, ఇచ్చే మనస్తత్వాన్ని పెంపొందించుకోండి. ఇది సంతోషకరమైన జీవితానికి దారితీస్తుంది' అని అన్నారు. ప్రజలు ఉచితాలపై అధికంగా ఆధారపడటం సమాజాన్ని బలోపేతం చేయడానికి బదులుగా బలహీనపరుస్తుందని మంత్రి పేర్కొన్నారు. 'ఉచిత వస్తువుల పట్ల ఆకర్షణ ధైర్యవంతులైన మహిళల గౌరవానికి చిహ్నం కాదు. మనం వారి విలువలకు అనుగుణంగా జీవించినప్పుడు అమరవీరుడిని నిజంగా గౌరవిస్తారు' అని వ్యాఖ్యానించారు. ఎప్పుడైనా భిక్షాటన చేసిన అమరవీరుడి పేరు చెప్పగలరా అని ప్రహ్లాద్ పటేల్ అడిగారు. 'నర్మద పరిక్రమ యాత్రికుడిగా నేను భిక్ష అడుగుతా. కానీ నా కోసం ఎప్పుడూ అడగను అని అన్నారు. కాగా, ప్రహ్లాద్ పటేల్ చేసిన ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ మధ్యప్రదేశ్ అధ్యక్షుడు జీతు పట్వారీ స్పందిస్తూ... ప్రహ్లాద్ వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజలను అవమానించేలా ఉన్నాయని విమర్శించారు. 'బీజేపీ అహంకారం ఎంత స్థాయికి చేరిందంటే వారు ప్రజలను బిచ్చగాళ్లు అని పిలుస్తున్నారు. ఎన్నికలకు ముందు తప్పుడు వాగ్దానాలు చేసి, వాటిని నెరవేర్చడానికి నిరాకరిస్తారు. ప్రజలు వాటిని గుర్తుచేసినప్పుడు సిగ్గు లేకుండా బిచ్చగాళ్లు అని పిలుస్తారు. త్వరలో ఈ బీజేపీ నాయకులు ఓట్లు అడుక్కోవడం కోసం వస్తారు' అని మండిపడ్డారు.

## ముగిసిన సహాయక చర్యలు

### ఎనిమిదికి పెరిగిన మృతులు

### చివరి మృతదేహం లభ్యం

**డెహ్రాడూన్:** ఉత్తరాఖండ్ చమోలీ జిల్లాలోని మనా గ్రామంలో సహాయక చర్యలు ఆదివారం ముగిశాయి. ఆర్మీ, ఐటీబీపీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్‌తో పాటు ఇతర సహాయ సిబ్బంది దాదాపు 60 గంటల పాటు శ్రమించి చివరి మృతదేహాన్ని వెలికి తీశారు. ఆచూకి లేని నలుగురి జాడ కనిపెట్టారు. దీంతో మృతుల సంఖ్య ఎనిమిదికి పెరిగింది. ఈ మేరకు జిల్లా మెజిస్ట్రేట్ సందీప్ తివారీ తెలిపారు. మొత్తం 54 మంది కార్మికులు చిక్కుకుపోగా 46 మంది ప్రాణాలతో బయటపడ్డారన్నారు. ఎనిమిది మంది మరణించారని ఆయన తెలిపారు. శని, ఆదివారాల్లో నాలుగు చొప్పున మృతదేహాలు లభ్యమయ్యాయని చెప్పారు. స్నిఫర్ డాగ్స్, థర్మల్ ఇమేజింగ్ కెమెరాలు, హెలికాప్టర్లతో గాలింపులు ముమ్మరంగా సాగినట్లు వెల్లడించారు. సోమవారం వాతావరణం అనుకూలంగా ఉండకపోవచ్చన్న అంచనాల నడుమ సహాయక చర్యలను ముమ్మరం చేసి చివరి నలుగురి జాడ కనిపెట్టినట్లు తెలిపారు. మృతులను డెహ్రాడూన్‌లోని క్లీమెంట్ పట్టణానికి చెందిన అరవింద్ కుమార్ సింగ్ (43), ఉత్తరాఖండ్, ఉద్దంసింగ్ నగర్ జిల్లాలోని రుద్రపూర్‌కు చెందిన అనిల్ కుమార్ (21), యూపీలోని ఫత్తేపూర్‌కు చెందిన అశోక్ (28), హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనాకు చెందిన హర్మేశ్‌గా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ మృతదేహాలను హెలికాప్టర్‌లో జోతిర్మఠ్‌కు చేర్చి... అక్కడి కమ్యూనిస్టు హెల్త్ సెంటర్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. లెఫ్టినెంట్ జనరల్ ఆనింద్యా సేన్ గుప్తా, లెఫ్టినెంట్ జనరల్ డీజీ మిశ్రా ఘటనాస్థలిలో ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సీఎం పుష్కర్ సింగ్ ధామి ఉదయం ఘటనాస్థలానికి వెళ్లి సహాయక చర్యలను సమీక్షించారు. ఆధునిక సాంకేతికత ఆధారంగా సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సోమవారం వాతావరణం ప్రతికూలంగా మారే అవకాశం ఉందని, ఆదివారమే సహాయక చర్యలు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. ఇక సహాయక చర్యల్లో మొత్తం ఆరు హెలికాప్టర్లు (మూడు ఇండియన్ ఆర్మీ ఏవియేషన్ కార్ప్స్, రెండు ఐఏఎఫ్ సహా ఆర్మీ చాపర్) పాల్గొన్నట్లు రక్షణ పీఆర్‌ఓ వెల్లడించారు.

## జల్గావ్‌లో నా కుమార్తెను వేధించారు

### కేంద్ర మంత్రి రక్షా ఖడ్సే

**జల్గావ్ :** మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లాలోని ముక్తాయ్‌నగర్ ప్రాంతంలో జరిగిన ఒక జాతర సందర్భంగా కొంతమంది యువకులు తన కుమార్తెను వేధించారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కేంద్ర యువజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి రక్షా ఖడ్సే ఆదివారం తెలిపారు. 'ప్రతి సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా మా ప్రాంతంలో సంత్ ముక్తాయ్ యాత్ర జరుగుతుంది. రెండు రోజుల క్రితం నా కుమార్తె యాత్రకు వెళ్లింది. కొంతమంది యువకులు ఆమెను వేధించారు. వారిపై ఫిర్యాదు చేయడానికి నేను పోలీస్ స్టేషన్‌కు వెళ్లాను' అని రక్షా ఖడ్సే ఆదివారం ఉదయం ముక్తాయ్‌నగర్‌లో విలేకరులకు చెప్పారు. రక్షా మామ, మాజీ మంత్రి ఏక్‌నాథ్ ఖడ్సే మాట్లాడుతూ ఈ యువకులపై పోలీసులకు గతంలో అనేక ఫిర్యాదులు అందాయి. ఈ అబ్బాయిలు కరుడుగట్టిన నేరస్తులు. మహారాష్ట్రలో మహిళలపై నేరాలు పెరిగాయి. నేరస్తులు పోలీసులకు భయపడరు. బాలికలు ఫిర్యాదులు చేయడానికి ముందుకు రారు. తమ కుమార్తెల పేర్లను బహిర్గతం చేయకూడదని తల్లిదండ్రులు నమ్ముతారు. మాకు వేరే మార్గం లేకపోవడంతో మేము ఫిర్యాదు చేశాం' అని తెలిపారు. 'నేను ఈ విషయంలో డీఎస్పీ, ఐజీతో మాట్లాడాం. మేము పోలీస్ స్టేషన్‌కు వెళ్లినప్పుడు మమ్మల్ని రెండు గంటలు కూర్చోబెట్టారు. అమ్మాయిలకు సంబంధించిన విషయం గురించి పునరాలోచించుకోవాలని పోలీసులు మాకు చెప్పారు. ఈ సందర్భంగా యువకులు పోలీసులపై విరుచుకుపడ్డారు. వారు ఏ స్థాయికి వెళ్లగలరో ఊహించుకోండి. ఈ వ్యక్తులకు రాజకీయ రక్షణ ఉంది' అని ఆయన అన్నారు.

## హిమానీ హంతకులను కఠినంగా శిక్షించాలి: కాంగ్రెస్



**చంఢీగఢ్:** కాంగ్రెస్ మహిళా కార్యకర్త హిమానీ నార్వాల్ (22) హత్యపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, ఇంతటి దారుణానికి ఒడిగట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసింది. కాంగ్రెస్‌కు చెందిన హర్యానా ఎమ్మెల్యే భరత్ భూషణ్ బత్రా మాట్లాడుతూ... ఈ ఘోరానికి పాల్పడ్డ వారికి కఠినమైన శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. వివరాలివి. హర్యానాలోని రోహతక్ జిల్లాలో హిమానీ నార్వాల్ దారుణ హత్యకు గురయ్యారు. ఆమెను హత్య చేసిన అనంతరం సూట్ కేసులో మూటగట్టి ఓ నిర్మానుష ప్రాంతంలో దుండగులు పడేశారు. సప్లా బస్టాండ్ వద్ద సూట్ కేసులో హిమానీ నార్వాల్ మృతదేహం ఉండటంతో స్థానికంగా కలకలం రేగింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, ఫోరెన్సిక్ ల్యాబ్ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సూట్‌కేస్‌లోని యువతి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలిని హిమానీ నర్వాల్‌గా గుర్తించారు. ఆమెను హత్య చేసి మృతదేహాన్ని సూట్‌కేస్‌లో కుక్కి బస్టాండ్ సమీపంలో పడేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మరోవైపు హతురాలు హిమానీ నర్వాల్ కాంగ్రెస్ కార్యకర్త అని ఆ పార్టీ ఎమ్మెల్యే భరత్ భూషణ్ బాత్రా తెలిపారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో ఆమె చురుకుగా పాల్గొన్నట్లు చెప్పారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల సమయంలో భూపిందర్ హుడా, దీపిందర్ హుడా ప్రచారంలో కూడా ఆమె పాల్గొన్నట్లు వెల్లడించారు. కాగా, తన కుమార్తె హిమానీ హత్యకు కాంగ్రెస్ పార్టీలోని కొంతమందికి ప్రమేయం ఉండవచ్చని ఆమె తల్లి సవితా నర్వాల్ అనుమానం వ్యక్తం చేసింది. తన కుమార్తె రాజకీయంగా ఎదుగుతుండటం చూసి కొందరు సహించలేక ఆమెను హత్య చేసి ఉంటారని ఆమె ఆరోపించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోన్ పేట్ లోని కతారా గ్రామానికి చెందిన హిమానీ నార్వాల్... కాంగ్రెస్ చేసిన ప్రతీ ర్యాలీలోనూ ఉత్సాహంగా పాల్గొనేది. దాంతో పార్టీ చేపట్టే సోషల్ ఈవెంట్స్ లో కూడా పాల్గొని ఆమె తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

**బీజేపీ పాలనలో హత్యలు, అత్యాచారాలే అధికం: భూపేందర్‌సింగ్ హుడా**

తాము మంచి కార్యకర్తను కోల్పోయామని హర్యానా మాజీ సీఎం భూపేందర్ సింగ్ హుడా పేర్కొన్నారు.

రాష్ట్రంలో పరిస్థితులు ఇంతలా దిగజారిపోయాయి అనడానికి నార్వాల్ హత్య ఉదాహరణ అని అన్నారు. దీనిపై హై లెవెల్ దర్యాప్తు చేస్తే కానీ అసలు నిందితులు ఎవరో బయటకు రారని పేర్కొన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని అన్నారు. భవిష్యత్ లో ఇటువంటి ఘటనలు జరగకుండా ఉండేలా శిక్ష అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం పరిపాలన ఎంత దారుణంగా ఉందో ఈ హత్యోదంతాన్ని చూస్తే అర్థమవుతుందన్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్సీఆర్బీ) రికార్డులు చూస్తే రాష్ట్రం నేర చరిత్ర ఏ విధంగా తెలుస్తుందన్నారు. ప్రతి నిత్యం ఏదొక చోట మూడు నుంచి నాలుగు హత్యలు, అత్యాచారాలు, కిడ్నాప్ లు, దొంగతనలు జరుగుతూనే ఉన్నాయన్నారు .

## ప్రభుత్వ చొరవతో మహిళలపై తగ్గిన నేరాలు

### ఐక్యరాజ్యసమితి ప్రశంసలు: పినరయి విజయన్



**తిరువనంతపురం:** ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ చొరవ వల్ల రాష్ట్రంలో మహిళలపై నేరాలు తగ్గిపోయాయని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెప్పారు. కేరళ వంటి ప్రగతిశీల సమాజంలో ఇలాంటి నేరాలు చోటు చేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని అన్నారు. కేరళ మహిళా కమిషన్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... మహిళలపై నేరాలు జరగకుండా కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలకు సాధికారత కల్పించిన చరిత్ర ఉన్నా చాలామంది మహిళలు బయటకు రావడానికి ధైర్యం చేయడం లేదన్నారు. గత మూడు దశాబ్దాల్లో సమాజంలో మహిళా సాధికారతకు సంబంధించి గణనీయమైన మార్పులు తీసుకురావడంలో మహిళా కమిషన్ పాటు పడిందన్నారు. భవిష్యత్తులో కూడా ఈ కార్యకలాపాలు ఇలాగే కొనసాగాలన్నారు. మహిళల అభివృద్ధికి, లింగ సమానత్వం కోసం బడ్జెట్‌లో కేటాయింపులు జరిపిన మొదటి రాష్ట్రం కేరళ అని, ఇందుకోసం ఐక్యరాజ్య సమితి నుంచి ప్రశంసలు కూడా అందాయని చెప్పారు. మహిళా సాధికారతా కార్యక్రమాలకు 25శాతం ప్రాజెక్టు కేటాయింపులు ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యమని విజయన్ చెప్పారు.

## మోహన్ భగవత్ కుంభమేళాకు ఎందుకు వెళ్లలేదు?

### సంజయ్ రౌత్

**ముంబై:** ఆర్ఎస్ఎస్ అధినేత డాక్టర్ మోహన్ భగవత్ కుంభమేళాకు ఎందుకు వెళ్లలేదని రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ ప్రశ్నించారు. బీజేపీకి చెందిన నాయకులు అందరూ కుంభమేళాకు వెళ్లినట్లు ఆధారాలు ఉన్నాయా అని నిలదీశారు. హిందూ ధర్మ పరిరక్షణ గురించి ప్రజలకు బోధనలు చేసే మోహన్ భగవత్... త్రివేణి సంగమంలో ఎందుకు పుణ్యస్నానం చేయలేదని ప్రశ్నించారు. 'ప్రధాని నరేంద్ర మోదీ పవిత్ర స్నానం చేస్తున్న ఫొటోలను చూశాను. కానీ, ఆయన పీఎం కాకముందు కుంభమేళాకు వెళ్లినట్లు మాత్రం ఆధారాలు లేవు. ప్రస్తుతం నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో కూడా ఆర్ఎస్ఎస్ ముఖ్యులైన మోహన్ భాగవత్, కేశవ్ బలిరామ్ హెడ్గేవార్, గురు గోల్వాల్కర్, బాలాసాహెబ్ దేవరాస్ వంటివారు పవిత్ర స్నానం ఆచరించినట్లు ఎటువంటి ఫొటోలు బయటకు రాలేదు' అని సంజయ్ రౌత్ అన్నారు. తమ పార్టీ నేతలు నకిలీ హిందుత్వ పబ్లిసిటీలను నమ్మరని పేర్కొన్నారు. ఇటీవల మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిండే మాట్లాడుతూ...'కొందరు నేతలు వారు హిందువులని చెప్పుకుంటుంటారు. కానీ, పవిత్ర ఆధ్యాత్మిక కుంభమేళాను దాటవేశారు' అని అన్నారు. కేంద్రమంత్రి రాందాస్ అతవలే ... కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఉద్ధవ్ ఠాక్రే మహాకుంభమేళాను సందర్శించకుండా హిందూ సమాజాన్ని అవమానపరిచారన్నారు. అందుకుగాను హిందూ ఓటర్లు వారిని బహిష్కరించాలని... ఎన్నికల్లో ఆ పార్టీలకు ఓట్లు వేయొద్దని అన్నారు. తరచూ సమావేశాల్లో హిందుత్వం గురించి మాట్లాడే ఠాక్రే ఈ విధంగా ప్రవర్తించడం సరైన చర్య కాదని మండిపడ్డారు. తాను హిందువునని...ఆ ధర్మాలు పాటిస్తానని చెప్పుకునే శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే కుంభమేళాకు మాత్రం వెళ్లలేదని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే చేసిన వ్యాఖ్యలను సంజయ్ రౌత్ తిప్పి కొట్టారు.

## గంగ నీరు స్నానాలకు పనికిరాదు

### బీహార్ ఆర్థిక సర్వేలో వెల్లడి

**పాట్నా :** బీహార్‌లోని గంగా నది నీరు రాష్ట్రంలోని చాలా చోట్ల స్నానానికి పనికిరాదని, ఎందుకంటే 'బ్యాక్టీరియా జనాభా' అధిక ఉనికి కలిగి ఉందని బీహార్ ఆర్థిక సర్వే 2024-25 పేర్కొంది. బీహార్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు (బీఎస్‌పీసీబీ) రాష్ట్రంలోని 34 ప్రదేశాలలో పక్షం రోజులకు ఒకసారి గంగా నది నీటి నాణ్యతను పర్యవేక్షిస్తుందని అధికారులు తెలిపారు. ఇటీవల రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే ప్రకారం... గంగా నీటి నాణ్యత బాక్టీరియా జనాభా అధిక విలువ (మొత్తం కోలిఫాం, మల కోలిఫాం) ఉనికిని సూచిస్తుంది. ఇది ప్రధానంగా గంగా, దాని ఉపనదుల ఒడ్డున ఉన్న నగరాల నుంచి మురుగు నీరు/గృహ వ్యర్థ జలాలను విడుదల కారణంగా ఉంది' అని వివరించింది. బీఎస్‌పీసీబీకి చెందిన తాజా నీటి నాణ్యత పరీక్ష ఫలితాలను సర్వే ఉదహరించింది. 'బీహార్‌లోని గంగా నది, దాని ఉప నదులలో ఇతర పారామితులు... పీహెచ్ (ఆమ్లత్వం లేదా క్షారత్వం), కరిగిన ఆక్సిజన్, బయో-కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీవోడీ) నిర్దేశించిన పరిమితిలో గమనించడం జరిగింది. ఈ నీరు జల జీవాలకు, వన్యప్రాణుల వ్యాప్తికి, మత్స్య సంపద, నీటిపారుదలకు సరిపోతుంది' అని పేర్కొంది. నది ఒడ్డున ఉన్న ముఖ్యమైన పట్టణాలలో బక్సర్, చాప్రా (సరణ్), దిగ్వారా, సోనేపూర్, మనేర్, దానాపూర్, పాట్నా, ఫతుహా, భక్తియార్‌పూర్, బార్, మొకామా, బెగుసరాయ్, ఖగారియా, లఖిసరాయ్, మణిహరి, ముంగేర్, జమల్‌పూర్, సుల్తాన్‌గంజ్, భాగల్‌పూర్, కహల్‌గావ్ ఉన్నాయి. ఈ నివేదికపై బీఎస్‌పీసీబీ చైర్మన్ డీకే శుక్లా స్పందిస్తూ, గంగా నదిలో బాక్టీరియా జనాభా అధిక విలువ ఉండటం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. చాలా చోట్ల, గంగానదిలో మొత్తం కోలిఫాం మరియు మల కోలిఫాం ఉనికి చాలా ఎక్కువగా ఉంది, ఇది స్నానానికి పనికిరాదని సూచిస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రంలోని మురుగునీటి శుద్ధి కర్మాగారాలు (ఎస్‌టీపీ) సరిగ్గా పనిచేసేలా బీఎస్‌పీసీబీ చర్యలు తీసుకుంటోందని ఉన్నతాధికారి తెలిపారు.

## అసోంలో విపక్షాలకు కాంగ్రెస్‌తో చిక్కులు

**గువహటి:** వచ్చే ఏడాది జరగబోయే అసోం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భూపేన్ కుమార్ బొర్హా ఆదివారం ఫేస్‌బుక్ పోస్టు ద్వారా సంకేతాలిచ్చారు. దీంతో రాష్ట్రంలో విపక్షాల ఐక్యత ప్రశ్నార్థకమన్న చర్చ మొదలైంది.

కాంగ్రెస్ వల్ల బీజేపీయేతర పార్టీలు ఏకతాటిపైకి రావడానికి ఆటంకాలు కలగవచ్చన్న వాదన వినిపిస్తోంది. వాస్తవానికి శనివారం జరిగిన ప్రతిపక్షాల సమావేశం నుంచి కాంగ్రెస్ ఎంపీ ప్రద్యుత్ బొర్దోలోయ్ మధ్యలోనే వెళ్లిపోవడం సందేహాలకు తావిచ్చింది. కాంగ్రెస్, వామపక్షాలు, రైజర్ దళ్, అసోం జాతీయ పరిషత్ ప్రతినిధులు గువహటి శివార్లలోని సోనాపూర్ రిసార్ట్‌లో భేటీ అయ్యారు. అనంతరం కొందరు నేతలు మాట్లాడుతూ ఐక్యంగా ముందుకెళ్లాలన్న నిర్ణయం జరిగినట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో వాదనలు సహజమేనని, కాంగ్రెస్ ఎంపీ సొంత కారణాలతో మధ్యలోనే వెళ్లిపోయారని, దీనిని భూతద్దంలో పెట్టి చూడాల్సిన అవసరం లేదని అన్నారు. రైజోర్ దళ్ అధ్యక్షుడు అఖిల్ గొగోయ్ మాట్లాడుతూ ఏకాభిప్రాయంతోనే సమావేశం ముగిసిందని చెప్పారు. ఎవరూ కోపంతో వెళ్లలేదని, వాదనలు జరిగాయి కానీ చివరకు ఏకాభిప్రాయం కుదిరిందని ఆయనన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికప్పుడు 16 ప్రతిపక్ష పార్టీలు ఐక్య సంఘటనగా ఏర్పడిన విషయం తెలిసిందే.

# విశాలాంధ్ర హైదరాబాద్

## ఘనంగా శ్రీపాదరావు జయంతి వేడుకలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : మాజీ స్పీకర్ ద్రుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్న సందర్భంగా ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళలు అర్పించారు. కలెక్టరేట్ ఎ.ఓ సునీల్, జిల్లా పౌర సంబంధాల అధికారి పి.సి.వెంకటేశం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి దుద్దిళ్ల శ్రీపాదరావు

### అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కదిరవన్ పలని

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజా సమస్యలపై దుద్దిల్ల శ్రీపాదరావు నిరంతరం పోరాడినారని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కదిరవన్ పలని అన్నారు. ఆదివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు 88వ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కదిరవన్ పలని పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ శాసనసభ్యులుగా, శాసనసభ స్పీకర్గా ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. ముఖ్యంగా 1964 నుంచి 1999 వరకు ప్రజల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ డివిజన్ పరిధిలోని పి.వి.ఎన్ కాలనీలోని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ఆఫీస్ కార్యాలయంలో హనుమాన్ నగర్‌లో పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీ హాల్, రోడ్డు పనులను పూర్తి చేయాలని, జి.జే.ఆర్ నగర్‌లో పెండింగ్ రోడ్డు డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ప్రేం కుమార్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు తన వంతు కృషి చేసస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను త్వరిగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబు కిషోర్, సయ్యద్ అక్తర్, కాలని వాసులు నర్సింగ్‌రావు, మాధవన్, అంజయ్య, ముత్యాలు, ఉమా, కుమార్, సత్యప్రకాష్, రామకృష్ణ, పాల్, అనసూయ, శ్యామల, మునమ్మ, లక్ష్మి, విజయ, భారతి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర -శేరిలింగంపల్లి: చందానగర్ డివిజన్ పరిధిలో గల దీప్తిశ్రీ నగర్ పార్కులోగల హెల్త్ కేర్ సెంటర్ నందు మెడికవర్ హాస్పిటల్స్, చందానగర్ వారి సౌజన్యంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఎత్తు, బరువు, కంటి, దంత, రక్తపోటు, షుగర్, పల్స్, ఈ.సీ.జీ. బీఎండీ (ఆర్థో) కు సంబంధించిన మొదలగు పరీక్షలు నిర్వహించారు. వైద్యులు డాక్టర్ ఆదిత్య (జనరల్ ఫిజిషియన్), డాక్టర్ సలీం (కౌ డెంటల్), డాక్టర్ నిసార్, డాక్టర్ విజన్ ఐ కేర్ తదితరులు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మారిన జీవనశైలిలో పర్యావరణంలో వస్తున్న అనేక మార్పులవల్ల ప్రజలు అనేక వ్యాధులకు గురవుతున్నారు అని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం కావున, కొన్ని జాగ్రత్తలు తీసుకున్న యెడల మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరు నిత్యం వ్యాయామం, యోగ, ధ్యానం, నడక, కనీసం 40 నిమిషాలు చేయాలి. సాధ్యమైనంత వరకు తాజా ఆకుకూరలు, సీజనల్ ఫ్రూట్స్, పాలు, పాల ఉత్పత్తులు, చేపలు, గ్రుడ్లు, తృణధాన్యాలు, డ్రై ఫ్రూట్స్ వంటి పౌష్టికాహారం తీసుకొని, ఆరోగ్యం కాపాడుకోవాలని తెలిపారు. సాధ్యమైనంత మేరకు ఆల్కహాల్, పొగాకు, పొగాకు ఉత్పత్తులు, ఇతర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని తెలిపారు. అనారోగ్యంగా ఉంటే, అశ్రద్ధ చేయకుండా, వెంటనే వైద్యులను సంప్రదించి, వారి సూచనలు, సలహాలు పాటించి, ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని సూచించారు. మనం తీసుకొనే ఆహారం సమయ పాలన పాటించాలని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కాలనీ వెల్ ఫేర్ నాయకులు సీతారామయ్య, సురేష్, సుమన్ రెడ్డి, మంగపతి, విజయ్ కుమార్ తదితరులు మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కౌండిన్యశ్రీ నందూరి వెంకటేశ్వర రాజు, హాస్పిటల్ ప్రతినిధి సరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరంలో వృద్ధులు మరియు పిల్లలకు 90 మందికి వైద్యసేవలు అందించారు.

# దేవాలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి భూమిపూజ

### వనపర్తిలో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

విశాలాంధ్ర - హైదరాబాద్ : శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కృపతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని భగవంతుని ప్రార్థించినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి యనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయానికి విచ్చేసిన సందర్భంగా ముఖ్యమంత్రితో పాటు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, నాగర్ కర్నూలు ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి దేవాలయానికి రాగా మంగళ వాయిద్యాలతో వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అంతకుముందు రూ.1 కోటి నిధులతో దేవాలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం దేవాలయంలో ముఖ్యమంత్రికి ఆలయ అర్చకులు గోత్రనామాలతో అర్చనలు నిర్వహించి స్వామివారి శేష వస్త్రంతో పాటు స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించి వేద ఆశీర్వచనం చేశారు.

ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. రూ. కోటితో అభివృద్ధి పనులు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటామని ఇంకా అవసరం ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒబేదుల్లా కొత్వాల్, సాయి చరణ్‌రెడ్డి, శివసేనారెడ్డి, డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డిమాండ్‌ను ఎదుర్కోవడానికి సిద్ధం కావాలి!

### అధికారులకు ఎండీ అశోక్ రెడ్డి సూచన

విశాలాంధ్ర - హైదరాబాద్ : తాగునీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సేవలు అందించాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. మాదాపూర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ వేసవిలో వచ్చే నీటి డిమాండ్‌ను ఎదుర్కోవడానికి అధికారులంతా సిద్ధంగా ఉండాలని సూచించారు. ట్యాంకర్ బుక్ చేసిన వెంటనే డెలివరీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం సూక్ష్మ స్థాయి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అవసరమైతే అదనపు ట్యాంకర్లు, సిబ్బందిని సమకూర్చుకోవాలని చెప్పారు. మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఏమైనా అవసరాలుంటే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వాటిని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ట్యాంకర్ డ్రైవర్లతో ఎండీ మాట్లాడారు. మాదాపూర్‌లో ఉన్న ట్యాంకర్లలో బుకింగ్స్‌కు లేక కొన్ని ఖాళీగా ఉంటున్నట్లు వారు ఎండీకి తెలిపారు. ట్యాంకర్ బుకింగ్, డెలివరీ లాగ్ బుక్‌ను పరిశీలించారు. ట్యాంకర్ బుకింగ్ స్టేటస్, రోజుకి ఎన్ని ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి, ఎన్ని డెలివరీ చేస్తున్నారు. తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాదాపూర్ ఫిల్లింగ్ స్టేషన్‌లో 06 ఫిల్లింగ్ పాయింట్స్, 80 ట్యాంకర్లు ఉండగా.. రోజుకి 600 ట్రిప్పులు డెలివరీ చేస్తున్నారు. 80 శాతం బుకింగ్స్‌ను 6-12 గంటల్లో డెలివరీ చేస్తుండగా.. మిగిలిన 20 శాతం 24 గంటల్లో డెలివరీ చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ 600 ట్రిప్పులు డెలివరీ చేస్తుండగా.. రాబోయే రోజుల్లో 1200 బుకింగ్స్ వచ్చినా డెలివరి చేసే సామర్థ్యం ఉందని జీఎం ఎండీకి తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం, డీజీఎం, మేనేజర్ తదితరులు పాల్గొన్నారు. జలమండలి ఈడీ మాయాంక్ మిట్టల్ ఆదివారం పలు ఫిల్లింగ్ స్టేషన్లను తనిఖీ చేశారు. షాపూర్‌నగర్, మౌలాలి, ఎల్లారెడ్డి గూడ ఫిల్లింగ్ స్టేషన్లకు వెళ్లారు. ట్యాంకర్ బుకింగ్ స్టేటస్, రోజుకి ఎన్ని ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి? ఎన్ని డెలివరీ చేస్తున్నారు? తదితర వివరాలు తనిఖీ చేశారు. ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ ఇన్ ఛార్జిలతో మాట్లాడి వివరాలు కనుక్కున్నారు.

**నీటి సరఫరాలో అంతరాయం:**

మసీద్ బండ సెక్షన్ లో టీజిఎస్.పిడిసిఎల్ శాఖ నిర్వహణ పనులు చేపడుతోంది. దీంతో ఆ సెక్షన్ పరిధిలో ఉన్న ఫిల్లింగ్ స్టేషన్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చెయ్యడం ఆగింది. ఒకే ఫిల్లింగ్ స్టేషన్‌తో (గ్రావిటీ ద్వారా నడిచే) నీటి సరఫరా చేస్తున్నారు.

## నేటి నుండి స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీల్డ్ అసెస్‌మెంట్ బృందం పర్యటన

విశాలాంధ్ర - హైదరాబాద్ : నేటి నుండి హైదరాబాద్ నగరంలో స్వచ్ఛ సర్వేక్షన్ బృందం పర్యటించనున్నట్లు కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. ఈ బృందం 2025 మార్చి 3వ వారం వరకు అసెస్మెంట్ కొనసాగుతుందన్నారు. పిఐయు బృందం తయారు చేసిన సర్కిల్ వారీగా ఏర్పాటు చేసి హ్యాండ్‌బుక్‌లలో అన్ని అసెస్‌మెంట్ స్థానాల వార్డుల వారీగా నివాస ప్రాంతాలు, వాణిజ్య ప్రాంతాలు, బల్క్ చెత్త జనరేటర్ల జాబితా, పబ్లిక్ టాయిలెట్ల స్థానాలు, మూత్రశాలలు, ఉద్యానవనాలు, తోటలు, నీటి వనరులు, పర్యాటక ప్రదేశాలు, పాఠశాలలు, విద్యా సంస్థలు, విశ్వ విద్యాలయాలు, స్ట్రోమ్ వాటర్ డ్రెయిన్లు, నల్లాలు, ఆర్.ఆర్.ఆర్. కేంద్రాలు సి అండ్ డి వ్యర్థాలు, ద్వితీయ సేకరణ పాయింట్లు ఉన్నాయి. లాగ్ పుస్తకాలు సిద్ధం చేయబడిందని నిర్ధారించుకోవాలని అందుకు ఏఎంహెచ్ఓలు డిఈఈలను ఆదేశించారు.

ఎస్ఏటి వాహనాల కోసం గత 3 నెలల యూజర్ ఛార్జీల రిజిస్టర్, పబ్లిక్ టాయిలెట్ - శుభ్రపరిచే షెడ్యూల్ నిర్వహణ, యూజర్ ఛార్జీల లాగ్ బుక్, ఫీడ్‌బ్యాక్ రిజిస్టర్, బిజిజి- తడి వ్యర్థాలను ఆన్-సైట్ కంపోస్టింగ్, పొడి వ్యర్థాలను మూడవ పక్షం ద్వారా నిర్వహించడానికి లాగ్‌బుక్, అందరూ ఏఎంహెచ్ఓలు డిఈఈలు పరిశుభ్రతను దృష్టి సారించాలని ఆదేశించాను. అలాగే నగర పౌరుల అభిప్రాయాన్ని ఒక సామూహిక డ్రైవ్‌గా తీసుకునేలా చూసుకోవలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

# ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం (హైదరాబాద్ జిందాబాద్) ఆధ్వర్యంలో బీపీ-షుగర్ పేషెంట్లకు ఉచితంగా నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులు 100 నెలలలో, 100 క్యాంపులు పూర్తైన సందర్భంగా బీపీ-షుగర్ పేషెంట్లు జీవనశైలిలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సుందరయ్య విజ్ఞాన కేంద్రం హాల్లో ఆదివారం సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరైన గాంధీ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ సిహెచ్.ఎన్ రాజకుమారి మాట్లాడుతూ గాంధీ ఆసుపత్రిలో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలను వినియోగించు కోవాలని, ప్రజారోగ్య సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు. హైదరాబాద్ జిందాబాద్ లాంటి స్వచ్ఛంద సంస్థలు 8 సంవత్సరాలుగా 100 ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించటం అభినందనీయమని అన్నారు. బీపీ షుగర్ ఉచిత మెడికల్ క్యాంపులను తెలుగు రాష్ట్రాలలో 45 కేంద్రాలలో నడుపుతున్న ప్రముఖ డాక్టర్ గోపాలం శివనారాయణ మరో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బీపీ, షుగర్ రోగాలు చాలా చిన్నవని, వాటిని కంట్రోల్‌లో ఉంచుకుంటే ఏ ఇబ్బంది ఉండదని, కానీ నిర్లక్ష్యం చేసి పెంచుకుంటే ప్రాణాలకే ప్రమాదమన్నారు. తాను ప్రతి శని, ఆదివారాలలో ఏదో ఒక క్యాంపులో పాల్గొని వైద్య సేవలు అందిస్తున్నానని, భవిష్యత్తులో మరింత విస్తరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రతి మనిషికి కార్బోహైడ్రేట్లు, మాంసకృతులు, కొవ్వు పదార్థాలు అవసరమని వీటిని తగిన మోతాదులో తీసుకుంటే ఆరోగ్యకర మని, కానీ మన ఆహారంలో కార్బోహైడ్రేట్లను మితిమీరి తీసుకొనటం వలన అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని వివరించారు. ఆహార అలవాట్లలో కొద్దిపాటి జాగ్రత్తలు, వ్యాయామాలతో గుండె జబ్బులు, పక్షవాతం మొదలైన జబ్బులు రాకుండా తీసుకోవచ్చని ఆ విధంగా జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని సూచించారు. ప్రముఖ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ డాక్టర్ గోపాలం శివన్నారాయణ 45 కేంద్రాలలో బీపీ షుగర్ మెడికల్ క్యాంపులు నిర్వహించటం అభినంద నీయమని, హైదరాబాద్ జిందాబాద్ లాంటి సంస్థలు ప్రజలలో ఆరోగ్యం పట్ల అవగాహన పెంచేందుకు కృషి చేయా లన్నారు. చాలా మందికి ఆరోగ్యం పట్ల తీసుకోవ లసిన ఆహారం పట్ల సరైన అవగాహన లేక వ్యాధులకు బారిన పడుతు న్నారని జీవనశైలిలో సరైన ఆహార అలవాట్లు, వ్యాయామం ద్వారా బీపీ షుగర్ లాంటి వ్యాధులు రాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. హైదరాబాద్ జిందాబాద్ ఉపాధ్యక్షులు ఎం.శ్రీని వాసరావు మాట్లాడుతూ తమ హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ఏర్పరిచి ఇలాంటి బీపీ షుగర్ మెడికల్ క్యాంపులు, అనేక మెగా మెడికల్ క్యాంపులు, పర్యావరణ సమస్యపై కార్యక్రమాలు సెమినార్లు నిర్వహించామని హైదరాబాద్ జిందాబాద్ కార్యక్రమాలను వివరించారు. సెమినార్లో ముఖ్య అతిథులను ఉచిత సేవలు అందిస్తున్న డాక్టర్లను, వాలంటీర్లను సన్మానించడం జరిగింది.

## ప్రైవేట్ కాలేజీల ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి

విశాలాంధ్ర -శేరిలింగంపల్లి: ప్రైవేట్ కాలేజీల ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఇజ్జత్ నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్ శేరిలింగంపల్లి మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు టి.నితీష్ కార్యదర్శి జె.ధర్మతేజ మాట్లాడుతూ మండలంలోని నారాయణ, శ్రీ చైతన్య, మూడులెస, అలిన్, బన్సల్, ఆకాష్, రీజన్స్, శ్రీ వశిష్ట, వంటి కార్పొరేట్ కాలేజీలు రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి నిబంధనలను ఉల్లంఘిస్తూ, పదో తరగతి పరీక్షలు పూర్తికాకముందే ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్నాయన్నారు. కార్పొరేట్ కాలేజీలు తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి, విద్యార్థులను బలవంతంగా అడ్మిషన్ల కోసం ప్రేరేపిస్తున్నాయని, ప్రభుత్వం అనుమతి ఇవ్వకముందే అడ్మిషన్లు చేపట్టడమే కాకుండా, అధిక ఫీజులు వసూలు చేసి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నాయరన్నారు. నిబంధనలను పాటించకుండా వ్యవహరిస్తున్న కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా రంగంలో పారదర్శకతను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవా లని, విద్యార్థులు, తల్లిదండ్రులు అధికారిక ప్రక్రియ ప్రకారమే అడ్మిషన్లు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నితీష్‌తోపాటు తదితర నాయకులు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాల స్లాబ్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణంలో భాగంగా ఆదివారం ఉదయం మొదటి స్లాబ్ నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కళాశాల విద్యార్థుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరి సహాయ సహకారాల ద్వారా దాదాపు 22 వేల ఎస్ఎఫ్‌టితో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం చేపట్టడం జరిగిందని. ఈ నిర్మాణానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి తన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే మాకు అన్ని విధాల సహకరిస్తున్న జర్నలిస్టు మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్న పార్టీ కార్యకర్తలకు అభిమానులకు అలాగే విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే కళాశాల నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సర్వేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, చెంది తిరుపతిరెడ్డి, చెన్నయ్య, చల్ల శ్రీకాంత్ రెడ్డి, రఘు, విశ్వం, ఖదీర్, ముబారక్, శ్రీనివాస్ యాదవ్, దిలీప్, సీతారాం, అశోక్, మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో వజ్రేష్ యాదవ్

విశాలాంధ్ర - మేడిపల్లి : మేడ్చల్ నియోజకవర్గంలోని పోచారం మున్సిపాలిటీ కాచివాని సింగారం ఆల్ఫ క్రికెట్ గ్రౌండ్‌లో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మహిళా అధ్యక్షురాలు శ్రీలత భద్ర నాయక్ ఆహ్వానం మేరకు ఆదివారం ఉదయం క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్, నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు అధ్యక్షులు తుంగతుర్తి రవి, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ శివ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ వార్షికోత్సవ సంబరాలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: అతి తక్కువ ఫీజులతో, అన్ని తరగతుల కుటుంబాల పిల్లలకు ఉన్నత విద్యను అందిస్తూ, దినదినాభివృద్ధి చెందుతూ, అందరి మన్ననలు పొందుతూ, చుట్టూ ప్రక్కల మంచి స్కూల్స్‌గా పేరు గాంచిన సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ నేడు 14వ వార్షికోత్సవ సంబురాలు జరుపుకుంది. సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ 14వ వార్షికోత్సవ వేడుకలకు మాదాపూర్ లోని శిల్పకళా ఆడిటోరియం వేదికగా మారింది. ఈ వేడుకలకు మంత్రి పొన్నం ప్రభాకర్, పిఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ, సెంట్రల్ సంగీత్ నాటక్ అకాడమీ అవార్డీ చైర్ పర్సన్, ప్రొఫెసర్ అలేఖ్య పంజాల, కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్, శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, స్థానిక నాయకులు, ప్రముఖులు విచ్చేసారు. ఈ సందర్భంగా సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ చైర్మన్ మంగళరాపు లక్ష్మణ్ విచ్చేసిన ప్రముఖులకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి, శాలువాతో సన్మాంచి, మెమోంటోతో సత్కరించారు. అనంతరం సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక, నృత్య, కళా ప్రదర్శనలు విచ్చేసిన అహుతులను, ప్రముఖులను, నాయకులను, తల్లిదండ్రులను ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విచ్చేసిన ప్రముఖులు సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ విద్యార్థిని, విద్యార్థులు ఈ 14 సంవత్సరాలలో సాధించిన విజయ ప్రస్థానాలను కొనియాడారు. విద్యార్థులను ఎటువంటి ఒత్తిడికి గురి చెయ్యకుండా, వారికి అర్థం అయ్యేట్టుగా విద్య భోధన చెయ్యటంలో సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ నూతన ఒరవడిని సృష్టించిందని అన్నారు. నేటి రోజులలో అతి తక్కువ ఫీజులతో, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిచటం అంటే కత్తి మీద సామేనని అన్నారు. కానీ సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ చైర్మన్ మంగళరాపు లక్ష్మణ్ విద్యా విధానంలోను, స్కూల్ ఫీజుల విషయంలోను, చరిత్ర సృష్టించిరాని అన్నారు. సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ 14వ వార్షికోత్సవ వేడుకల్లో సీనియర్ నాయకులు పేరుక రమేష్ పటేల్, ఎర్రగుండ్ల శ్రీనివాస్ యాదవ్, రాజు యాదవ్, శ్రీనివాస్ చౌదరి, మంగళరాపు తిరుపతి, బుడుగు తిరుపతి రెడ్డి, చింతల రాజు యాదవ్, పలువురు ప్రముఖులు, దాదాపుగా 15 వందల మంది విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉప రాష్ట్రపతి దంపతులకు ఘన స్వాగతం

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు ఆదివారం ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుండి భారత ఉప రాష్ట్రపతి దంపతులు జయదీప్ ధనర్, సుదేష్ ధనర్‌లు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయానికి చేరుకున్న ఉప రాష్ట్రపతి దంపతులకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పార్లమెంటు సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర డిజిపి జితేందర్, ప్రొటోకాల్ జాయింట్ సెక్రటరీ ఎస్.వెంకట్రావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు విజయ్ సాయి రెడ్డి, ఇతర నాయకులు తదితరులు స్వాగతం పలికారు. ప్రత్యేక హెలికాప్టర్లో ఉపరాష్ట్రపతి దంపతులు కంది ఐఐటీకి బయలుదేరి వెళ్లారు. సాయంత్రం ఉపరాష్ట్రపతి దంపతులు శంషాబాద్ విమానాశ్రయం చేరుకొని ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లారు.

## ఉపాధ్యాయురాలు శేషం రమాదేవి సేవలు అభినందనీయం

**విశాలాంధ్ర - మేడిపల్లి:** టీచర్ ఉద్యోగం భావోద్వేగంతో కూడిన బాధ్యతాయుతమైన హోదా అని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పీర్జాదిగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల యస్‌జీటీ శేషం రమాదేవి ఉద్యోగ విరమణ ఆదివారం ఉదయం అభినందన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పదవికి విరామం పొందిన తర్వాత కుటుంబంతో సంతోషంగా తీర్థ, పర్యాటక యాత్రలు చేయడంతో పాటు సేవకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ట సేవలు అందించి, తన సర్వీస్‌లో ఎందరో పేదింటి విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయురాలు శేషం రమాదేవి సేవలు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.టి.యు.టి.ఎస్, పి.ఆర్.టి.యు.టి.ఎస్, టి.ఎస్.యు.టి.ఎఫ్, టి.యు.టి. ఎఫ్. ఉద్యోగ సంఘాల నాయకులు, మేడిపల్లి, ఘట్కేసర్ మండల పరిధిలోని ఉపాధ్యాయులు, మేడిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## కూచిపూడి నృత్య పోటీల్లో ప్రతిభ కనబర్చిన చిన్నారులకు అవార్డుల ప్రదానం

**విశాలాంధ్ర - కూకట్‌పల్లి:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కూచిపూడి నృత్య కళా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ఆదివారం అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. నగరంలోని బిర్లా భాస్కర ఆడిటోరియంలో కళాకర్ తెలుగు టీవీ, శివనంది అవార్డ్స్ 2025 ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ నృత్య పోటీలలో హైదర్‌నగర్ లోని రుహాని కూచిపూడి నృత్య అకాడమీ నిర్వాహకురాలు నేరెళ్ల కల్పన ఆధ్వర్యంలో నిర్వహించిన బిందు మాధవి, భావనలతో పాటు పలువురు చిన్నారులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కూచిపూడి నృత్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు దైవజ్ఞ శర్మ అవార్డులు ప్రదానం చేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సంస్కృతిక కళలను భావితరాలకు అందించడానికి తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలుగు వారిపై ఉందన్నారు. చిన్న వయస్సులోనే అద్భుతమైన ప్రతిభ కనబరిచిన రుహానా కూచిపూడి నృత్య అకాడమీ బృందాన్ని ఆయన ఆశీర్వదించారు.

## ప్రియురాలి తల్లిపై ప్రేమోన్మాది దాడి

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** తమ ప్రేమకు అడొస్తుందని ఓ ప్రేమోన్మాది తన ప్రియురాలి తల్లి పై దాడి చేసిన ఘటన కలకలం రేపింది. వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వన్నారం అనుబంధ గ్రామమైన సుద్దాలపల్లిలో తమ ప్రేమకు అడ్డొస్తుందనే కారణంగా ప్రియురాలి తల్లి చామంతిపై దాడి చేసి గొంతు నులిమి చంపడానికి రాజ్ కుమార్ అనే యువకుడు ప్రయత్నం చేసాడు. సుద్దాలపల్లి గ్రామానికి చెందిన దూట రాజ్‌కమార్, జాడి సుస్మిత అనే యువతితో కొంతకాలంగా ప్రేమలో ఉన్నారు. ఇది గమనించి కూతురైన సుస్మితను తల్లి చామంతి మందలించింది. పక్షవాతంతో మంచం పట్టిన తండ్రి పరిస్థితి వివరించి కూతురు మనసు చామంతి మార్చింది. దీంతో తమ ప్రేమకు అడ్డు వస్తుందనే నెపంతో ఎలాగైనా తనను చంపాలనే కసితో బహిరంగంగానే చామంతిని తీవ్రంగా కొట్టి గొంతు నులిమి రాజ్‌కుమార్ చంపే ప్రయత్నం చేసాడు. అక్కడే ఉన్న స్థానికులు సమయానికి స్పందించి రాజకుమార్‌ను అడ్డుకోవడంతో ప్రాణాపాయం నుంచి చామంతి బయటపడింది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాజ్ కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# శ్రీకర ఆసుపత్రిని ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**విశాలాంధ్ర-బషీర్ బాగ్:** అత్యాధునిక సౌకర్యాలతో లక్డికాపూల్‌లో ఏర్పాటు చేసిన శ్రీకర నూతన ఆసుపత్రిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, స్థానిక ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎంపీ ఈటెల రాజేందర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఇతర దేశాల నుంచి వైద్యం కోసం వచ్చే వారికి వీసా నింబంధనలు సులభతరం చేసేందుకు మెడికల్ టూరిజం వీసా తీసుకవచ్చినట్లు వెల్లడించారు. ఆయుష్మాన్ భారత్ పేరు మీద దేశంలో ఇప్పటివరకు 50 కోట్ల మందికి కార్డులు ఇచ్చినట్లు వెల్లడించారు. 5 లక్షల విలువైన వైద్యం ప్రభుత్వం భరించే విధంగా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల విషయంలో లోపాలు ఉన్నాయని వాటిని సరిదిద్దుకొని ముందుకు సాగుతామన్నారు. మారుతున్న జీవన విధానం వల్ల ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య చికిత్సలు చేయించుకుని ఆరోగ్య జీవితం గడపాలని కోరారు. కేవలం ధనర్జన కాకుండా మానవతా దృక్పథంతో తక్కువ ఖర్చుతో వైద్య చికిత్సలు అందించాలని ప్రేవేటు, కార్పోరేట్ ఆసుపత్రులకు కిషన్‌రెడ్డి సూచించారు. అనంతరం శ్రీకర ఆసుపత్రి ఎండి అఖిల్ దాడి మాట్లాడుతూ ఆసుపత్రిలో ఐసియు, క్యాథ్ ల్యాబ్ అన్ని మల్టీ స్పెషాలిటీ సదుపాయాలు ఉన్నాయన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులో ఉండే విధంగా తమ ఆసుపత్రి ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

# నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే పోరాడుతాం

**విశాలాంధ్ర - కాప్రా :** నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతామని, యువత రాజకీయాలకు ఆకర్షితులు కావాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ ఉపాధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఈసీఐఎల్‌లోని లయన్స్ క్లబ్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ నేటి యువత రాజకీయాలకు రావాలని అన్నారు. ప్రస్తుతం దేశంలో కులాలు, మతాలు, ప్రాంతాల పేరుతో విభజన రాజకీయాలకు తెరలేపుతున్నారు. ఈ తరుణంలో యువత కులాలు మతాలకు అతీతంగా ఐక్యమత్యంగా ఉండాలన్నారు. చెడు రాజకీయాలను, ధన రాజకీయాలను భూస్థాపితం చేస్తూ సమసమాజ స్థాపన కోసం కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామంటూ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిందన్నారు. ఏడాదిలో 55,143 ఉద్యోగాలను మాత్రమే రేవంత్ ప్రభుత్వం భర్తీ చేసిందని, రాష్ట్రంలో 1,91,126 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పీఆర్సీ కమిటీ నివేదిక ఇచ్చిందన్నారు. తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో 1.32 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని గత ప్రభుత్వం ప్రకటించింది. కానీ 40 వేల ఉద్యోగాల భర్తీకి మాత్రమే నోటిఫికేషన్లు విడుదలయ్యాయన్నారు. అటు కేంద్రంలో బీజేపీ... రాష్ట్రంలో గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. హామీలను అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులున్నా నియామకాలను మాత్రం చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. పాలకులు అనుసరిస్తున్న తీరుపై నిరుద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రచారార్భాటాలకు ఇస్తున్న ప్రాధాన్యత ఉద్యోగాల భర్తీపై లేదన్న విమర్శలు వస్తున్నాయన్నారు. పేరుకు మాత్రమే జాబ్ క్యాలెండరు ప్రకటించిందని వారు విమర్శించారు. యూత్ డిక్లరేషన్లో జాబ్ క్యాలెండర్తోపాటు నిరుద్యోగ భృతి రూ. నాలుగు వేలు ఇస్తామని ప్రకటించిందని, విద్య, ఉపాధి కల్పనకు యూత్ కమిషన్ను ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారన్నారు. యూత్ కమిషను వెంటనే ఏర్పాటు చేయాలని, ఆ కమీషన్‌కు 1000 కోట్ల గ్రాంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రాయితీలతో నెలకొల్పిన పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. దాన్ని అమలు చేయాలన్నారు. కోర్టు వివాదాలు, న్యాయ వివాదాలు లేకుండా ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. విభజన హామీల అమలు కోసం కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి. ఉద్యోగాలు పొందలేని యువతకు ఆర్థిక సహకారం చేసేందుకు రూ.వెయ్యి కోట్లతో యూత్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. యువ ప్రజాప్రతినిధి, పెద్ద అంబర్పేట్ మున్సిపల్ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ మాట్లాడుతూ యువత రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని, తద్వారా ఆయా ప్రాంత అభివృద్ధి జరుగుతుంది అన్నారు. కుళ్లు రాజకీయాలను తుదముట్టించాలని వారు పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ కుసుకుంట్ల శంకర్, లింగం రవి, వెంకటేశ్వర్లు, నానబాల రామకృష్ణ, టి.సత్య ప్రసాద్, శ్రీమాన్, బిజ్జ శ్రీనివాసులు, యుగంధర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆర్.బాలకృష్ణ, ఎల్లంకి మహేష్, శ్రీనాథ్ రెడ్డి, మొగిలి లక్ష్మణ్, సురేందర్, షేక్ మహమూద్, రాజ్ కుమార్, శివకుమార్, చంద్రశేఖర్, చిరంజీవి, మానస్ కుమార్, మార్కపూరి సూర్య పాల్గొన్నారు.

## కూల్చివేత వ్యర్థాల పునర్వినియోగ కేంద్రాన్ని సందర్శించిన పీసీబీ కార్యదర్శి రవి

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి జి.రవి, రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో ఉన్న మెస్సర్స్ నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల పునర్వినియోగ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్శన సందర్భంగా నిర్వాహకులు సభ్య కార్యదర్శికి ప్రాజెక్ట్ గురించి ప్రజెంటేషన్ ఇచ్చి వివరించారు. సరస్సుల ఆక్రమణలను ఆపడానికి, విలువైన సహజ వనరులను కాపాడటానికి, నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను తిరిగి వినియోగం చేయడం, దాని ప్రాముఖ్యతను వివరించారు. నగరంలో గాలి నాణ్యతను మెరుగుపరచడంలో ఇది సహాయపడుతుందని, బాధ్యతాయుతమైన ప్రతి ఒక్కరూ నిర్మాణ, కూల్చివేత వ్యర్థ నియమాలను అమలు చేయాలని ఆయన పునరుద్ఘాటించారు. ఈ సందర్శన సందర్భంగా, హైదరాబాద్ జోనల్ కార్యాలయం ఎస్.ఈ.ఈ, జేసీఈఈ హనుమంత్ రెడ్డి, నరేందర్, రంగారెడ్డి ప్రాంతీయ కార్యాలయం ఈఈ వెంకట్ నర్సు తదితరులు పాల్గొన్నారు.

# హిమాలయ ముస్కాన్ కార్యక్రమానికి పీవీ సింధు మద్దతు

**విశాలాంధ్ర - శేరిలింగంపల్లి:** చిరునవ్వు అనేది కేవలం వ్యక్తీకరణ కంటే ఎక్కువ - ఇది ఆత్మవిశ్వాసం వైపు పిల్లల మొదటి అడుగు. అయినప్పటికీ, భారతదేశంలో వేలాది మంది పిల్లలు పెదవి చీలిక పరిస్థితులతో జన్మి స్తున్నారు. ఇలాంటి పరిస్థితులు వారు తినడానికి, మాట్లాడటానికి, స్వేచ్ఛగా నవ్వడానికి ఆటంకం కలిగిస్తాయి. 2016 నుండి, హిమాలయ వెల్నెస్ కంపెనీ కార్యక్రమం అయిన ముస్కాన్ దేశవ్యాప్తంగా సమగ్ర క్లెఫ్ట్ (పెదవి చీలిక) సంరక్షణను అందించడం ద్వారా మరియు చీలిక పెదవి ఉచిత శస్త్రచికిత్సలకు మద్దతు ఇవ్వడం ద్వారా జీవితాలను మారుస్తోంది. ఇప్పుడు, ముస్కాన్ ప్రముఖ బ్యాడ్మింటన్ ఛాంపియన్ పివి సింధుతో కలిసి పని చేస్తోంది. హిమాలయ మరియు స్మైల్ ట్రైన్ ఇండియాతో కలిసి ఈ సమస్యపై అవగాహనను విస్తృతం చేయ డానికి, ఎక్కువ మంది పిల్లలు జీవితాన్ని మార్చే చికిత్స పొందేలా వీలు కల్పించడానికి ముస్కాన్ ధైర్యంగా మరో అడుగు ముందుకు వేసింది. సామాజిక ఆశయాల పట్ల నిబద్ధతకు పేరుగాంచిన సింధు, పిల్లల సాధికారత, వారి మొత్తం శ్రేయస్సును నిర్ధారించడం కోసం తీవ్రంగా కృషి చేస్తున్న వ్యక్తి. ముస్కాన్‌తో ఆమె అనుబంధం ఈ కార్యక్రమం పరిధిని మరింత బలోపేతం చేస్తుంది. ఈ గొప్ప కార్యక్రమానికి ప్రజలు తోడ్పడటానికి ప్రేరణనిస్తుంది. ఈ సదాశయం కోసం సింధు ముస్కాన్‌తో చేతులు కలపడం ద్వారా, పెదవి చీలిక చికిత్స అవసరం గురించి మాత్రమే కాకుండా, సరైన పోషకాహారం, మాట్లాడగలగడం, సమగ్ర అభివృద్ధిని పొందడంలో ఇబ్బందులు వంటి పరిస్థితులతో బాధపడుతున్న పిల్లలు ఎదుర్కొంటున్న విస్తృత ఆరోగ్య సవాళ్ల గురించి కూడా అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా, ప్రతి చిన్నారి కూడా ఆరోగ్యకరమైన విధంగా, మరింత నమ్మకంగా జీవితాన్ని గడపడానికి అవసరమైన సమగ్ర సంరక్షణ పొందేలా చూడాలని ఆమె ఆశిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఒలింపిక్ పతక విజేత పివి సింధు మాట్లాడుతూ, పిల్లల భవిష్యత్తును రూపొందించడంలో ఆత్మవిశ్వాసం ఎలా కీలక పాత్ర పోషిస్తుందో నొక్కి చెప్పారు. ఈ లక్ష్యానికి తన మద్దతును వ్యక్తం చేశారు. "ఆత్మవిశ్వాసం పిల్లల భవిష్యత్తును రూపొందిస్తుంద న్నారు. ఇది వారి కలలను నిజం చేసుకోడానికి ప్రయత్నించడానికి, సంకోచం లేకుండా ప్రపంచాన్ని ఎదుర్కోవడానికి ధైర్యాన్ని ఇస్తుందన్నారు. చిన్నారులంతా కూడా ఈ విధమైన శక్తి పొందేందుకు అర్హులే అన్నారు. పిల్లలకు అవసరమైన చికిత్సను అందించడం ద్వారా నిజమైన మార్పును తీసుకొస్తున్న హిమాలయ ముస్కాన్ కార్యక్రమానికి మద్దతు ఇవ్వడం నాకు నిజంగా గౌరవంగా ఉంది. అవగాహన పెంచడం ద్వారా, మనం మరింత మంది పిల్లలను వారు వృద్ధి చెంద డానికి వీలుగా ఆత్మవిశ్వాసంతో శక్తివంతం చేయవచ్చన్నారు. ఈ విషయాన్ని వ్యాప్తి చేయడంలో, మార్పు తీసుకు రావడంలో మాతో చేరాలని నేను ప్రతి ఒక్కరినీ కోరుతున్నాను" అని అన్నారు.

## రాయితీ సద్వినియోగం చేసుకోవాలి : కమిషనర్

**విశాలాంధ్ర - మేడిపల్లి :** అనాథరైజ్డ్ లేఅవుట్ల యందలి ప్లాట్లు అనాథరైజ్డ్ లేఔట్లను క్రమబద్ధీకరించే ఉద్దేశంతో 2020లో స్వీకరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను 31 మార్చి 2025 లోగా క్రమబద్ధీకరించి ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ లభిస్తుందని ప్రభుత్వం (జీవో నెం.28 తేదీ. 20 ఫిబ్రవరి 2025) జారీ చేసిందని మున్సిపల్ కమిషనర్ టి.ఎస్.వి.ఎన్. త్రిలేశ్వరావు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడమైనదని ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సేవలు అందించబడతాయని సెలవు దినాల్లో కూడా ఓపెన్ చేసి ఉంటుందన్నారు. దరఖాస్తుదారులకు ఏమైనా సందేహాలు ఉంటే ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్‌లో తెలియజేసి తమ సందేహాలను నివృత్తి చేసుకొనగలరని తెలుపుతూ ఆన్‌లైన్ సదుపాయం లేనివారు / ఆన్‌లైన్ పేమెంట్‌పై అవగాహన లేనివారు ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్‌లో ఆన్లైన్ ద్వారా చెల్లించవచ్చునని తెలియజేస్తూ ప్రభుత్వం ప్రకటించిన ఎల్ఆర్ఎస్‌లో 25 శాతం రాయితీ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఏ పండుగలైనా ప్రజలంతా సోదరభావంతో మెలగాలి

### కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్‌రెడ్డి

**విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ :** పండగ లేవైనా ప్రజలంతా సోదర భావంతో మెలగా లని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం రాజీవ్ గృహకల్ప కాలనీ ముస్లిం సోదరులు రంజాన్ నెల ప్రారంభమైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ని అయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం కొలను శ్రీనివాస్‌రెడ్డి ముస్లిం సోదరులకు రంజాన్ శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌస్, పంగా శ్రీనివాసరావు, కుమార్ యాదవ్, ఎం శ్రీనివాస్, సుధాకర్, దామోదర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాల

## కమిటీలను వేర్వేరుగా ఏర్పాటు చేయాలి

**విశాలాంధ్ర-బషీర్‌బాగ్:** డా. బిఆర్.అంబేద్కర్ జయంతిని, బాబు జగ్జీవన్‌రామ్ జయంతితో కలిపి ఉత్సవాల కమిటీని ఏర్పాటును దళిత బహుజన పార్టీ, జాతీయ కమిటీ వ్యతిరేకిస్తోందని, ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు, సుప్రీంకోర్ట్ న్యాయవాది, వడ్లమూరి కృష్ణస్వరూప్ ప్రభుత్వానికి తెలిపారు. ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత మానవ హక్కుల ఉద్యమ పితామహులు, భారతరత్న డా. బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే ఉత్సవాలు బాబు జగ్జీవన్‌రామ్‌తో కలిపి నిర్వహించే ప్రయత్నం విరామించుకోవాలని అయన చేశారు. అంబేద్కర్ స్థాయిని కుదించే కుట్ర పూరిత ప్రయత్నాలు మానుకోవాలన్నారు. దేశం కోసం జీవితాన్నీ త్యాగం చేసిన మహనీయుల జయంతిని, గాంధీ కాంగ్రెస్, మనువాద దోపిడీ పాలక వర్గానికి ప్రతినిధిగా ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని, అంబేద్కర్ జయంతితో కలిపి ప్రభుత్వం ఉత్సవాలు నిర్వహించడమంటే, అంబేద్కర్‌ను అవమానించడమేనని ఆయన అన్నారు. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ఆయన జయంతి ఏప్రిల్ 14న, ప్రపంచ విజ్ఞాన దినోత్సవంగా పాటిస్తూ, 193 సభ్య దేశాలు పిలుపు నిస్తుంటే, తెలంగాణలో మాత్రం ఆయన స్థాయిని తక్కువగా చూపే ప్రభుత్వ ప్రయత్నాలు మానుకోవాలన్నారు. ఈసారి అంబేద్కర్ జయంతిని రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన, కేంద్రంలో ప్రధాని అధ్యక్ష తన నిర్వ హించాలని, ఉత్సవ కమిటీలల్లో కుల సంఘాల ప్రమేయాన్ని నిలువరించాలని, ఉత్సవాల నిర్వహణకు, రాష్ట్రంలో 500 కోట్లు, కేంద్ర స్థాయిలో 5000 కోట్లు కేటాయించి, ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు.

## ఆరోగ్య రన్‌లో రన్నర్స్‌కు మెడల్స్ అందజేత

**విశాలాంధ్ర - మేడిపల్లి :** ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణానికి రాచకొండ రన్నర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్యరన్ - 2025 ఈవెంట్ తోడ్పడుతుందని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అన్నారు. ఇలాంటి కార్యక్రమాల వలన ప్రజలకు ఆరోగ్యంపై అవగహన కలుగుతుందన్నారు. ఏవీ కన్స్ట్రక్షన్, ది ఆనంద ఇన్ఫినిటి జాయ్, విజయరత్న స్కూల్, సహస్రం డవలపర్స్ వారి సౌజన్యంతో నారపల్లిలోని భాగ్యనగర నందనవనం రిజర్వు ఫారెస్ట్‌లో ఆదివారం ఉదయం రాచకొండ రన్నర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్యరన్ -2025 ఈవెంట్స్‌ను మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించి 2కె, 5కె, 10కె రన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన రన్నర్స్‌కు మెడల్స్‌ను బహూకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచకొండ రన్నర్స్ సంస్థ ప్రతినిధులు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమాలలో మహిళలు, వృద్ధులు, చిన్నారులు, యువత పాల్గొనడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, రాచకొండ రన్ నిర్వాహకులు ప్రభాకర్, బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, జవేద్ ఖాన్, నర్సింహా, శ్యామల నర్సింహా, కిరణ్ నాయక్, రమేష్, శంకర్‌రావు, మామిడి శ్రీధర్, ఆరోగ్య రన్ స్పాన్సర్స్‌తో పాటు సుమారు 800 మంది పాల్గొన్నారు.

## సృజనాత్మకతతో కూడిన పుష్పాలంకరణ

**విశాలాంధ్ర - శేరిలింగంపల్లి:** కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఉన్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెూటల్ మేనేజ్మెంట్, హైదరాబాద్ (ఐహెచ్ఎం-హైదరాబాద్) సృజనాత్మకతతో కూడిన పుష్పాలంకరణకు వేదిక అయింది. ఈ ఇనిస్టిట్యూట్ అంతర్ కళాశాలల పుష్పాలంకరణ పోటీ నిర్వహించింది. ఈ పోటీ సృజనాత్మకతను ప్రదర్శిస్తూ ఆతిథ్య రంగంలో పుష్పాలంకరణ అవసరాన్ని తెలియజేసింది. ఈ పోటీలో మొదటిసారి ప్రొఫెషనల్ విభాగాన్ని ప్రవేశపెట్టారు. ప్రముఖ హెూటళ్ల నుంచి వచ్చిన ప్రొఫెషనల్ ఫ్లోరిస్టు, నైపుణ్యం కలిగిన కళాకారులు అద్భుతమైన పుష్ప అలంకరణను ప్రదర్శించారు. వాళ్ల కళా తృష్ణ ఆతిథ్య రంగాన్ని అభ్యసించే వారికి మార్గదర్శకంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో హైదరాబాదులోని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కలినరీ అకాడమీ ఆఫ్ ఇండియా, రీజెన్సీ కాలేజ్ ఆఫ్ కలినరీ ఆర్ట్స్, హెూటల్ మేనేజ్మెంట్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెూటల్ మేనేజ్మెంట్, కలినరీ ఆర్ట్స్ వంటి ప్రముఖ విద్యా సంస్థలతో పాటు చెన్నైకి చెందిన అమీర్తా ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెూటల్ మేనేజ్మెంట్ విద్యార్థులు కూడా హాజరయ్యారు. ఫ్రీ స్టైల్, ఫ్లవర్ డెకరేషన్, ఇకెబానా, బొకే మేకింగ్ వంటి విభాగాల్లో పోటీదారులు తమ కళాత్మక ప్రతిభను ప్రదర్శించారు. ప్రతి దానిని సృజనాత్మకత, రంగుల సమతుల్యతను పరిగణనలోకి తీసుకొని మూల్యాంకనం చేశారు. వైవిధ్యభరితమైన ప్రదర్శనలు, ఉత్సాహపూరిత పోటీతో ఈ కార్యక్రమం ఘన విజయం సాధించింది. ప్రతిభ, నైపుణ్యాలు పెంచుకునేందుకు ఐహెచ్ఎం-హైదరాబాద్ చేసిన కృషిని ఇది మరింత ప్రతిష్ఠాత్మకంగా నిలిపింది.

## మహిళా సాధికారతే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్

**విశాలాంధ్ర - ఆమనగల్లు :** వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించు కుంటే మెరుగైన అవకాశాలు పొందొచ్చని టాస్క్ సి.ఓ.ఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సూచించారు. ఆదివారం అమనగల్లు పట్టణ కేంద్రంలోని ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా జాబ్ మేళా కార్యక్రమం విజయవంతమైంది.ఈకార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపనీ ప్రతినిధుల బృందం జాబ్ మేళలో పాల్గొన్న అమనగల్లు పట్టణ ప్రాంత మహిళల నుండి అప్లికేషన్స్ స్వీకరించారు. త్వరలోనే నియోజకవర్గ వ్యాప్తంగా ఐక్యత ఫౌండేషన్ సహకారంతో మహిళా జాబ్ మేళలు నిర్వహించి రిక్రూయిట్మెంట్ చేపట్ట నున్నారు. ఈ సంధర్భంగా టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇంత మంచి అవకాశన్ని అమనగల్లు పరిసర ప్రాంత మహిళలకు, నిరుద్యోగ యువతులకు అందుబాటులోకి తెచ్చిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ వారికి ధన్యవదాలు తెలిపారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి వారికి అన్ని ఆర్థిక భరోసాను అందించి వారు అన్ని రంగాలలో ముందుండి మహిళా సాధికారత సాధించడానికి ఎప్పుడు కూడా తన వంతు కృషి చేస్తానని ఈ జాబ్ మేళకు విచ్చేసి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న మహిళామణులు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. జాబ్ మేళాలో పాల్గొన్న మహిళామణులు మాట్లాడుతూ మహిళల కోసం ఇంత గొప్ప కార్యక్రమం చేపట్టి, మహిళల ఎదుగుదలకు గొప్ప సహకారం అందిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డికి ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గ మహిళలు, ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీ ప్రతినిధులు ఉషా, శ్రీకాంత్, సింహాచలం బృందంతో పాటు టాస్క్ సిబ్బంది లావణ్య, నాయకులు సింగంపల్లి మాజీ సర్పంచ్ నర్సింహ, మాజీ ఉప సర్పంచ్ మల్లేష్ నాయక్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన మార్కెటింగ్ విధానం ప్రమాదకరం

**ఏఐకేఎస్ త్రిపుర రాష్ట్ర మహాసభలో రావుల వెంకయ్య**

అగర్తల: మన దేశ రైతాంగ పోరాటాలు ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా ఉంటున్నాయని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య చెప్పారు. కేంద్రంలోని మోదీ సర్కార్ తీసుకువచ్చిన మూడు వ్యవసాయ నల్లచట్టాలకు వ్యతిరేకంగా 540 రైతు సంఘాలు రాజకీయాలకు అతీతంగా ఒక్క తాటిపైకి వచ్చి పోరాడాయన్నారు. స్వాతంత్ర్యానికి ముందుగానీ, తర్వాత కానీ ఇలాంటి రైతాంగ ఉద్యమం జరగలేదనీ, ఇది ఒక చరిత్రాత్మక పోరాటంగా వెంకయ్య పేర్కొన్నారు. ఇతర దేశాల రైతులకు ఈ పోరాటం ఒక మార్గదర్శకమన్నారు. మన దేశ రైతుల పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని యూరప్ దేశాలు, ఇతర ఆసియా దేశాలలో రైతులు ఉద్యమబాటపడుతున్నారని చెప్పారు. అఖిల భారత కిసాన్ సభ త్రిపుర రాష్ట్ర మహాసభ శనివారంనాడు అగర్తలలో రాజేంద్ర రియాంగ్ అధ్యక్షతన జరిగింది. రైతు సంఘం పతాకాన్ని తొలుత రావుల వెంకయ్య ఎగురవేశారు. మహాసభలలో ముఖ్య అతిథులుగా రావుల వెంకయ్య, ఏఐకేఎస్ జాతీయ కార్యదర్శి డా॥ సిరికుమార్ ముఖర్జీ, సీపీఐ త్రిపుర రాష్ట్ర సహాయ కార్యదర్శి మిషరోని వైద్యోన్ హాజరయ్యారు. రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌బీహారీ ఘోష్ పాల్గొన్నారు.

రావుల వెంకయ్య ప్రసంగాన్ని కొనసాగిస్తూ, 33 సంవత్సరాల తరువాత రాష్ట్రంలో రైతు సంఘాన్ని నేడు పునరుద్ధరించడం శుభసూచికమన్నారు. భవిష్యత్తులో 9 జిల్లాకు విస్తరిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. రైతాంగం నేడు అనేక సమస్యలతో కొట్టుమిట్టడుతోందన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని స్పష్టం చేశారు. నరేంద్ర మోదీ తెచ్చిన నల్ల చట్టాలకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అన్నదాతలు సంవత్సరానికి పైగా పోరాడి విజయం సాధించారని గుర్తు చేశారు. అ పోరాటంలో 750 మందికి పైగా అమరులు అయ్యారనీ, ఇప్పటికి రైతు నేతల పై 4వేలకు పైగా కేసులు కొనసాగుతున్నాయని చెప్పారు. రైతు సంఘాలకు రాతపూర్వక హామీ ఇచ్చి మూడేళ్లు గడిచినా అమలుకు నోచుకోలేదన్నారు. ఇటీవల నరేంద్ర మోడీ తెచ్చిన నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానం అత్యంత ప్రమాదకరమన్నారు. దేశంలో వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను రద్దుచేసి, కార్పొరేట్ శక్తులకి దారాదత్తం చేయ చూస్తున్నదన్నారు ఈ చట్టం మన దేశ ఫెడరల్ విధానానికి వ్యతిరేకం అన్నారు. వ్యవసాయం మార్కెటింగ్ కమిటీలు రాష్ట్రాల జాబితాలో ఉన్నాయన్నారు వీటిని తీసివేసి కేంద్రం తన గుప్పిట్లో పెట్టుకోవడానికి చూస్తున్నదన్నారు. ఈ చట్టాన్ని కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం తొలిసారిగా తిరస్కరించిందనీ, ఆ తర్వాత పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి వ్యతిరేకంగా నిలబడిందని చెప్పారు మిగిలిన రాష్ట్రాలు కూడా అబాటలో పయనించాలన్నారు. ఈ విధానం రద్దు కోసం రైతాంగం పెద్ద ఎత్తున ఉద్యమించి మోదీ ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలన్నారు. ఈ విధానం రద్దుకు మార్చి 5 నుంచి 10వ తేదీ వరకు అన్ని జిల్లా కేంద్రాలలో ఐదు రోజులు రిలే నిరాహార దీక్షలు, ధర్నాలు నిర్వహించాలని రావుల వెంకయ్య పిలుపునిచ్చారు.

ఏఐకేఎస్ జాతీయ కార్యదర్శి డా. సిరి కుమార్ ముఖర్జీ మాట్లాడుతూ రైతు సంఘ నిర్మాణాన్ని బలోపేతం చేయాలి అన్నారు. అన్ని పంటల వారి సంఘాలు ఏర్పాటు చేయడానికి కృషి చేయాలన్నారు. ఏఐకేఎస్ జాతీయ మహాసభలు తమిళనాడులోని నాగపట్నం లో ఏప్రిల్ 15, 16,17 తేదీలలో జరగబోతున్నాయని చెప్పారు. మహాసభ 13 మందితో నూతన కమిటీ, నలుగురు ఆఫీస్ బేరర్లను ఎన్నుకుంది. అధ్యక్షులుగా చంద్ర గోపాల్, ప్రధాన కార్యదర్శిగా రాజ్ బిహారీ ఘోష్, ఉపాధ్యక్షులుగా మనో మజుధార్, సహాయ కార్యదర్శిగా ప్రమోదోప్ రాజకుమార్ ఎన్నికయ్యారు

# జోష్‌లో నిర్మాణ రంగం

**పట్టణాభివృద్ధి, రెవెన్యూ సంస్కరణలను స్వాగతించిన నారెడ్కో**

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: పట్టణాభివృద్ధి, రెవెన్యూ ప్రక్రియలను సులభతరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణలను నారెడ్కో ఆంధ్ర ప్రదేశ్ శాఖ స్వాగతించింది. వ్యాపార సామర్థ్యాన్ని పెంపొందించడానికి, వేగవంతమైన అనుమతులు, నియంత్రణ పద్ధతులలో పారదర్శకతను సాధించడానికి ఈ విధానపరమైన మార్పులు దోహదపడతాయని విశ్వాసం వ్యక్తం చేసింది. విజయవాడలోని మాలక్ష్మి ఛాంబర్స్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ సంస్కరణల ప్రభావం గురించి నారెడ్కో ప్రతినిధులు వివరించారు. నారెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దే చక్రధర్ మాట్లాడుతూ రహదారి కనీస వెడల్పును 40 అడుగుల నుంచి 30 అడుగులకు తగ్గించడం వల్ల అనధికారిక లేఅవుట్ల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. కచ్చితమైన మెరుగైన ప్రణాళికకు దోహదపడు తుందన్నారు. ప్రత్యేక పార్కింగ్‌ను అనుమతిస్తూ ఆమోదం తెలపడం భవన నిర్మాణదారులకు ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. అనుమతులను వేగవంతం చేసి, అధికార యంత్రాంగంలో జాప్యాన్ని తగ్గించేందుకు డీపీఎంఎస్ సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరించడం మంచి అంశమని చక్రధర్ అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా, రోడ్డు వెడల్పుకు సంబంధించిన భూమి కోల్పోయిన ప్రదేశంలోనే టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) ఉపయోగించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం స్థిరాస్తి రంగ భవిష్యత్‌కు ఉపయుక్తమన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో నివాస స్థలాలు, లేఔట్ ప్లాట్లలో పెట్టుబడి పెట్టడానికి ప్రస్తుతం అత్యుత్తమ సమయమన్న చక్రధర్... రాష్ట్ర ప్రభుత్వ దూరదృష్టి కలిగిన అభివృద్ధి విధానాలు, కార్యక్రమాలతో రియల్ ఎస్టేట్ రంగం గణనీయమైన వృద్ధిని సాధించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రం అపూర్వమైన అభివృద్ధిని చూస్తోందని, ఇది పెట్టుబడిదారులు, గృహ కొనుగోలుదారుల కోసం ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారుతోందని వివరించారు. ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్ మాట్లా డుతూ రియల్ ఎస్టేట్ డెవలపర్లకు ప్రయోజనకరమైన విధాన సవరణలను వివరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీతారామయ్య, రాష్ట్ర కోశాధికారి రమేష్ బాబు, సెంట్రల్ జోన్ అధ్యక్షుడు సందీప్ మండవ తదితరులు మాట్లాడారు. రాష్ట్రానికి ఏకైక రాజధాని అమరావతిగా కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో నిర్మాణ రంగం ఊపందుకుందని పేర్కొన్నారు. గడచిన ఐదేళ్లలో నిర్మాణ రంగం దెబ్బతిన్నదని చెప్పారు. కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో రాష్ట్రంలోని మూడు ప్రాంతాలూ అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## 7న రాష్ట్ర మంత్రిమండలి సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి సమావేశాన్ని ఈనెల 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో నూతన బడ్జెట్, సంక్షేమ పథకాల అమలు పై చర్చిస్తారు. మంత్రులకు సీఎం కొత్త టాస్క్‌లు ఇస్తారని సమాచారం. ఇప్పటికే రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముందు మంత్రి మండలి సమావేశాన్ని నిర్వహించి..రూ.3.20 లక్షల కోట్ల బడ్జెట్‌ను ఆమోదింపజేశారు. అనంతరం దానిని శాసన మండలిలో ప్రవేశపెట్టారు. ఈ ప్రక్రియమ ముగిశాక మళ్లీ రెండో మంత్రి మండలి సమావేశం నిర్వహించడం ప్రాధాన్యత నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా శాఖా పరంగా చాలా మంది మంత్రులు పట్టు సాధించలేదన్న విమర్శలున్నాయి. గత మంత్రి మండలి సమావేశాల అనంతరం కొంత మంది మంత్రులకు సీఎం స్వయంగా దిశానిర్దేశం చేసినప్పటికీ మార్పులేదు. ఆ తర్వాత మంత్రుల పనితీరుపై శాఖల వారీగా ర్యాంకులు ప్రకటించారు.

## నితీశ్ మీద పైచేయే బీజేపీ కోరుకునేది

**పునర్వ్యవస్థీకరణపై నోరు మెదపదు - బీహార్ ర్యాలీలో దీపాంకర్ భట్టాచార్య**

పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మీద పైచేయి సాధించాలని బీజేపీ కోరుకుంటోందని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. పునర్వ్యవస్థీకరణపై మౌనం వహిస్తుందని విమర్శించారు. ఎన్డీయేను వీడాలని జేడీ(యూ) అధ్యక్షుడు నిర్ణయించు కుంటే ఎలా అన్న ప్రశ్నను దాటవేస్తుందని దుయ్యబట్టారు. బీహార్ రాజధాని పాట్నాలోని చారిత్రక గాంధీ మైదానంలో సీపీఐ (ఎంఎల్) అధ్వర్యంలో ఆదివారం 'బద్లో బీహార్ మహాజుటన్' పేరిట భారీ ర్యాలీ జరిగింది. బీహార్ రాష్ట్ర ఆశా వర్కర్ల సంఘం, జీవికా కాడర్ యూనియన్, అంగన్‌వాడీ కార్మికుల సంఘం, విద్యాలయ వంట పనివారి సంఘం, తాడి మజ్దూర్ సంఘ్, సఫాయి కర్మచారీ సంఘం, అంబేద్కర్ జస్టిస్ ఫోరం, పస్మందా ముస్లిం మహాజ్, సామాజిక న్యాయ్ ఉద్యమం, వంచిత్ బహుజన్ మోర్చా, జస్టిస్ డెమొక్రటిక్ ఫోరం తదితర సంఘాల నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం దీపాంకర్ భట్టాచార్య మీడియాతో మాట్లాడుతూ బీహార్ మార్పునకు... బీజేపీ ఓటమికి సంకల్పించామన్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీజేపీ తనను పట్టించుకోదన్న భావన నితీశ్‌లో ఉందని, ఆయన మళ్లీ ఎన్డీయేకు మద్దతును ఉపసంహరించుకోవచ్చన్న ప్రచారం నడుమ విలేకరుల ప్రశ్నకు దీపాంకర్ స్పందిస్తూ 'ఇప్పటి నితీశ్... పాత నితీశ్ వేరు. బీజేపీతోనే సమస్యలు' అని అన్నారు. బీజేపీకి, దాని మిత్రపక్షాలకు పై చేయి ఉన్నదని మహారాష్ట్ర, దిల్లీ ఎన్నికల ఫలితాల ఆధారంగా ప్రశ్నించగా... అవి వేరు... జార్ఖండ్‌లో ప్రతిపక్షాల ఐక్య సంఘటన గెలిచింది. ఈసారి బీహార్‌లో ఘన విజయాన్ని సాధిస్తాం' అని దీమాగా చెప్పారు. మార్పు కోసం ఓటేస్తామని రాష్ట్రంలోని 50శాతం మంది చెప్పారని, ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నట్లు 25శాతం ఒప్పుకున్నారని ప్రీ-పోల్ సర్వేల్లో వెల్లడైందన్నారు. 1857 తిరుగుబాటు నాటి నుంచి అన్యాయంపై పోరాడిన చరిత్ర బీహార్ రాష్ట్రానిదని దీపాంకర్ తెలిపారు. రాబోయే ఎన్నికల్లోనూ అదే జరగబోతోందన్నారు. వక్ఫ్ బిల్లుపై ప్రశ్నకు స్పందిస్తూ పేదల భూములను హరించే యత్నమని దీపాంకర్ దుయ్యబట్టారు. చాలా చోట్ల గిరిజనుల విషయంలో బీజేపీ ఇదే చేసిందన్నారు. గాజా స్ట్రిప్ స్వాధీనం చేసుకోవాలన్న తన కోరికను బహిర్గతం చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి ఈ పార్టీ స్ఫూర్తి పొందుతోందని దీపాంకర్ ఎద్దేవా చేశారు. ప్రజల సమస్యలపైనే బీహార్‌లో ఎన్నికలు జరుగుతాయని, బీజేపీ కుట్రలన్నీ రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు వంటి అంశాలతో బీజేపీ వలలో చిక్కుకోవద్దని బీహార్ ప్రజలకు దీపాంకర్ పిలుపునిచ్చారు.

## తమిళ ప్రజల సంగీత శ్వాస ఇళయరాజా

**ఇంటికి వెళ్లి స్వయంగా కలిసిన సీఎం స్టాలిన్**

చెన్నై: ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఇళయరాజా నివాసానికి తమిళనాడు సీఎం స్టాలిన్ వెళ్లారు. లండన్‌లో ఈ నెల 8వ తేదీన భారీస్థాయిలో ఆర్కెస్ట్రా ప్రదర్శన నిర్వహించనున్న సమయంలో ఆయన్ను స్వయంగా కలిసి అభినందించారు. ఇళయ రాజాను శాలువాతో సన్మానించి కాసేపు ముచ్చటించారు. సంబంధిత వీడియోను సీఎం స్టాలిన్ తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేశారు. ఇళయరాజా... ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజల సంగీత శ్వాస అని సీఎం కొనియాడారు. ఆసియాలోనే ఇంతకుముందు ఎవరూ చేపట్టని రీతిలో సింఫనీ కార్యక్రమం ఏర్పాటుకు ధైర్యంగా ముందుకొచ్చా రన్నారు. ఈ సందర్భంగా తన చేతితో రాసిన మ్యూజిక్ నోట్స్‌ని ఇళయరాజా సీఎంకు చూపించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ స్వయంగా తన ఇంటికి వచ్చి పలకరించడంపై ఇళయరాజా సంతోషం వ్యక్తం చేశారు. అంతటి బిజీ షెడ్యూల్‌లోనూ కొంత సమయం వెచ్చించి తనను కలవడం... సంగీతం పట్ల ఆయనకు ఉన్న మక్కువ, అభిమానం తనను ఆనందపరిచాయన్నారు. సీఎం పోస్టును రీట్వీట్ చేస్తూ ఆయనకు ఇళయరాజా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు, జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)లో భాగంగా త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు-కేంద్ర ప్రభుత్వాల మధ్య వివాదం... హిందీ భాషను బలవంతంగా రుద్దుతున్నారని ఆరోపిస్తూ అమెరికాలో తమిళులు చేపట్టిన నిరసనలకు సంబంధించిన వీడియో క్లిప్స్‌ను సీఎం తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. తమిళం వర్ధిల్లాలి అని పేర్కొన్నారు. తమిళనాడును నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు, తమిళభాష పరిరక్షణ కోసం తన కృషిని కొనసాగిస్తానని సీఎం పేర్కొన్నారు.

## లక్నో 'ఎకానా'కు రూ.28 కోట్ల పన్ను నోటీసు

లక్నో: అటల్ బిహారీ వాజ్‌పేయి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం (ఎకానా స్టేడియంగా ప్రసిద్ధి)కు రూ.28.42 కోట్ల ఆస్తి పన్నుకు నోటీసును లక్నో మున్సిపల్ కార్పొరేషన్ పంపింది. ఈనెలలో మహిళా ప్రీమియర్ లీగ్... ఏప్రిల్‌లో ఐపీఎల్ జరగనుండటంతో పన్ను నోటీసులుపై ఆందోళన వ్యక్తమైంది. అన్యాయంగా నోటీసు ఇచ్చారని, ఉపశమనం కోసం సీఎం యోగిని ఆశ్రయిస్తామని స్టేడియం నిర్వాహకులు వెల్లడించారు. కాగా, అదనపు మున్సిపల్ కమిషనర్ పంకజ్ శ్రీవాత్సవ ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్ జోన్ 4 ఈ నోటీసును శనివారం జారీ చేసింది. 2020 డిసెంబరు 1 నుంచి రూ.5.45 కోట్ల పన్ను బకాయి ఉండగా, రూ.22.97 కోట్ల పాత బకాయి ఉంది. న్యాయ నిబంధనల మేరకు నోటీసులు జారీ అయింది. ప్రభుత్వ ఎయిడెడ్ గుర్తింపు ఉన్న క్రీడా మైదానాలకు, నాన్-ఎయిడెడ్ విద్యాసంస్థలకు మాత్రమే ఆస్తి పన్ను మినహాయిస్తారని శ్రీవాత్సవ స్పష్టతిచ్చారు. ఎకానా స్టేడియం ఈ కోవకు చెందినది కాదు కాబట్టే పన్ను చెల్లించాలని చెప్పారు, ప్రస్తుతానికి నీరు, పారిశుద్ధ్యం చార్జీలు వేయలేదన్నారు. ఆస్తి పన్ను అంచనాలకు గతంలో స్టేడియం నిర్వాహకులు అభ్యంతరం తెలిపారని, వారి అభ్యంతరాలు నిరాధారమని శ్రీవాత్సవ అన్నారు. ఇదిలావుంటే, నిబంధనలకు వ్యతిరేకంగా తమకు ఇచ్చిన నోటీసుపై సీఎంను ఆశ్రయించి న్యాయం చేయాలని కోరతామని స్టేడియం డైరెక్టర్ ఉదయ్ సిన్హా అన్నారు.

## భాష పరిరక్షణకు సాంస్కృతిక విధానం అవశ్యం: జూలూరు గౌరీశంకర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: భాష పరిరక్షణకు రెండు తెలుగు రాష్ట్రాలూ ఒక సాంస్కృతిక విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్ అన్నారు. అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని స్వీకరించనున్న సందర్భంగా మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి అధ్వర్యంలో గుంటూరు రెడ్డిపాలెం ఇన్నర్ రింగ్ రోడ్డు తనుబుద్ధి బసివిరెడ్డి నగర్‌లో గల శ్రీ రామ ధామం ఆవరణలో ఆదివారం ఆయనకు అభినందన సభ జరిగింది. ముప్వా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఎమ్వీ రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ సమాజాన్ని గాడిలో పెట్టగల శక్తి సామర్థ్యాలు భాష, సాహిత్య, సాంస్కృతిక రంగాలకే ఉన్నాయన్న విషయాన్ని విస్మరించరాదని అన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించే వాడే కవి, రచయిత అని, ఆ పనిని పెనుగొండ లక్ష్మీనారాయణ ధైర్యంగా చేస్తున్నారని కొనియాడారు. అస్తిత్వ ఉద్యమాల సంస్కృతులన్నీ సామాజిక ఐక్యతకే దారి చూపుతాయని చెప్పారు. సాహిత్య, సాంస్కృతిక రంగాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ప్రముఖ రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పెనుగొండను నిజమైన కార్యకర్తగా అభివర్ణించారు. ఎంతోమంది రచయితలను గుంటూరుకు ఆహ్వానించి, అవార్డులు అందజేసి వారి ఎదుగుదలకు బాటలు వేశారన్నారు. పరిశోధనాత్మక దృష్టితో అనేక పుస్తకాలపై విలువైన సమీక్షా వ్యాసాలు రాశారని చెప్పారు. అయిదు దశాబ్దాల కృషికి గుర్తింపుగా పెనుగొండకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందని అభిప్రాయపడ్డారు. ప్రముఖ సాహితీవేత్త ప్రొఫెసర్ సీహెచ్ సుశీలమ్మ మాట్లాడుతూ సామాజిక అభ్యున్నతే అంతిమ ధ్యేయంగా పెనుగొండ సాహితీ సృజన జరిగిందన్నారు. దుఃఖం మాత్రమే కాదు, ధిక్కారం కూడా అవసరమని ఆయన సూత్రీకరించటం అభినందనీయమన్నారు. పెనుగొండ స్నేహశీలి అని, మానవ సంబంధాలకు విలువనిచ్చే వ్యక్తి అని అన్నారు. ఎంతో మంది కవులను వెలుగులోకి తీసుకువచ్చారన్నారు. అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ తమిళనాడు ప్రభుత్వం భాష, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు గొప్ప ప్రోత్సాహన్నందిస్తోందని చెప్పారు. తెలుగు రాష్ట్రాలు కూడా ఆ దిశగా కృషి చేయాలన్నారు. అనంతరం పెనుగొండ లక్ష్మీనారాయణను మోదుగుల వేణుగోపాలరెడ్డి, వాసుదేవరెడ్డి సాహిత్యాభిమానుల సమక్షంలో ఘనంగా సత్కరించారు. సత్కారం అందుకున్న పెనుగొండ స్పందిస్తూ మార్క్సిజం ప్రేరణతో సుదీర్ఘకాలంగా అభ్యుదయ రచయితల సంఘం బాధ్యతలను ఇష్టంగా నిర్వహిస్తున్నానని చెప్పారు. తాను అందుకోబోతున్న అవార్డు 'అరసం' కే దక్కుతుందని అన్నారు.

**సాంకేతికత సద్వినియోగంతో**

# పని గంటలు తగ్గించవచ్చు

**కేరళ మంత్రి రాజీవ్**

న్యూఢిల్లీ: సాంకేతికతను సరైన పద్ధతిలో ఉపయోగించడం ద్వారా పని గంటలను తగ్గించవచ్చని కేరళ పరిశ్రమల మంత్రి పి.రాజీవ్ అన్నారు. రాష్ట్రంలో ఉత్పాదకత ఎక్కువగా ఉందని నొక్కి చెప్పారు. దాదాపు తొమ్మిది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న వామపక్ష ప్రజాస్వామ్య కూటమి (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం కేరళను పెట్టుబడి గమ్యస్థానంగా చూపించడానికి అన్ని ప్రయత్నాలు చేసింది. సిబ్బంది పని గంటలపై చర్చ కొనసాగుతున్న సమయంలో మంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ సీనియర్ వామపక్ష నాయకుడు ఇటీవల కొచ్చిలో పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) తో సహా సాంకేతిక ఆవిష్కరణలను ఎక్కువగా స్వీకరిస్తున్నందున భవిష్యత్‌లో ఏమి జరుగుతుందో ఎవరూ ఊహించలేరని మంత్రి రాజీవ్ అంగీకరించారు. అయితే పని గంటలు పెంచడం కాదు... పని గంటలను తగ్గించడం ధోరణి అని నొక్కి చెప్పారు. 'తక్కువ పని చేస్తే మీకు ఎక్కువ లభిస్తుంది. అదే సాంకేతిక వినియోగం. కేరళలో ఉన్న చట్టాలను మేము తాకడం లేదు' అని అన్నారు. ఇటీవల కొచ్చిలో ముగిసిన ఇన్వెస్టర్ కేరళ గ్లోబల్ సమ్మిట్ (ఐకేజీఎస్) లో రాష్ట్రం వివిధ కంపెనీల నుంచి దాదాపు రూ.1.53 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు ఆసక్తి వ్యక్తీకరణలను ఆకర్షించింది. ప్రభుత్వం నుంచి మొత్తం సందేశం ఏమిటంటే విధానాలు సరళీకృతం చేయడం జరిగింది. ఎటువంటి రెడ్ టేప్ ఉండదు. 'కేరళ సామర్థ్యం ఏమిటంటే ఎనిమిది గంటలలో మీరు ఉత్తమ ఉత్పాదకతను పొందాలి. అదే కేరళ ప్రయోజనం. ఒక సంవత్సరంలోపు 100 మందిని మాత్రమే నియమిస్తామని ఐబీఎం నాకు చెప్పింది. కానీ వారు 1,500 కంటే ఎక్కువ మందిని నియమించుకోవచ్చు. కారణం ఏమిటంటే, ఈ వ్యక్తులు ఒకే సంవత్సరంలో రెండు విజయవంతమైన సాధనాలను అభివృద్ధి చేశారు. ఒకటి ఫేస్‌బుక్ కోసం, మరొకటి డెల్టా ఎయిర్‌లైన్స్ కోసం' అని రాజీవ్ అన్నారు. సహజ సౌందర్యానికి ప్రసిద్ధి చెందిన కేరళ ప్రయోజనాలను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, రాష్ట్రం మంచి గాలి, నీటి నాణ్యతను కలిగి ఉందని మంత్రి అన్నారు. 'సాంకేతికతను సరైన పద్ధతిలో వినియోగించుకోవడం ద్వారా మనం మానవ గంటలను తగ్గించ వచ్చు. కేరళ బలం... అది 6, 7, లేదా 8 (పని) గంటలు అయినా ఉత్పాదకత ప్రపంచంలోని ఇతర ప్రాంతాల కంటే ఎక్కువగా ఉంటుంది' అని తెలిపారు. పారిశ్రామిక వేత్తలలో ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్.నారాయణ మూర్తి వారానికి 70 గంటల పని విధానం కోసం ప్రతిపాదించగా, లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్అండ్‌టీ) చైర్మన్ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ వారానికి 90 గంటల పని విధానం కోసం పిలుపునిచ్చారు. ఇదిలాఉండగా, కేరళ గురించి రాజీవ్ మాట్లాడుతూ రాష్ట్రం పరిశ్రమలకు అనుకూలం కాదని, సమ్మెలు, ట్రేడ్ యూనియన్, రెడ్ టేపిజం అధికమనే లోతయిన భావన పాతుకుపోయి ఉందని తెలిపారు. అయితే వాస్తవాలు ఈ ప్రచారానికి దూరంగా ఉన్నాయని, దేశంలో వైద్య పరికరాల పరిశ్రమ టర్నోవర్‌లో కేరళ 24 శాతం వాటాను కలిగి ఉందని ఆయన వివరించారు. రాష్ట్ర పారిశ్రామిక విధానం నినాదం చాలా నిర్దిష్టంగా ఉందని... అది 'ప్రకృతి, ప్రజలు, పరిశ్రమ' అని పేర్కొన్నారు. వామపక్ష భావజాలాలు, ఆర్థిక సరళీకరణ సూత్రాలపై అడిగిన ప్రశ్నకు రాజీవ్ సమాధానమిస్తూ, 'అందరూ ఒక వ్యవస్థలో పని చేస్తున్నారు. చిన్న పరిశ్రమలు, జ్ఞాన పరిశ్రమలు, సాంకేతిక పరిశ్రమలపై దృష్టి సారించే సమ్మిళిత పారిశ్రామికీకరణ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని తెలిపారు. 'మేము ఒక వ్యవస్థలో పని చేస్తున్నాం. వ్యవస్థకు ప్రత్యామ్నాయం కాకుండా వ్యవస్థలోనే ప్రత్యామ్నాయాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాం' అని తెలిపారు. వివిధ అంశాలపై కేంద్ర ప్రభుత్వంతో కొంత అసంతృప్తి ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి మద్దతు పొందడానికి తన వంతు ప్రయత్నం చేస్తోందని తెలిపారు. రుణ పరిమితులు సహా వివిధ అంశాలపై ఎల్‌డీఎఫ్‌కు కేంద్రంలోని ఎన్డీఏ నేతృత్వంలోని కేంద్రం మధ్య విభేదాలు ఉన్నాయి.

## 'టెస్లా'కు నిరసన సెగ

**డోజ్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలు**

వాషింగ్టన్: ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్‌కు చెందిన టెస్లా సంస్థకు నిరసన సెగ తగిలింది. అమెరికాలోని టెస్లా కార్యాలయాల ఎదుట ఆదివారం భారీస్థాయిలో నిరసనలు జరిగాయి. ఇంగ్లండ్, స్పెయిన్. పోర్చుగల్‌తో పాటు అమెరికాలో నిరసనలు హోరెత్తాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధ్వంసకర నిర్ణయాలపై అమెరికాతో పాటు యూరప్‌లోనూ వ్యతిరేక పెరుగుతోంది. శనివారం 50కుపైగా ప్రదర్శనలు జరిగాయని టెస్లా వెబ్‌సైట్ వెల్లడించింది. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించేందుకు అధ్యక్షుడు ట్రంప్ నియమించిన 'డోజ్'పై వ్యతిరేకత వస్తోంది. టెక్సాస్, అరిజోనా, సెయింట్ లూయిస్, న్యూయార్క్, ఒహియోబీ షార్లెట్, పాలో ఆల్టో, కాలిఫోర్నియాలో ప్రదర్శనలు జరిగాయి. కొన్ని చోట్ల టెస్లా వాహనాలను ఆందోళనకారులు ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. మస్క్ చర్యలు అమెరికా బడ్జెట్‌ను నియంత్రించలేకపోతున్నాయని, తన సంపదను పెంచుకోవడానికి మార్గాలను అన్వేషిస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి. మస్క్ ముఖ్యంగా స్పేస్ ఎక్స్, సోషల్ మీడియా ఎక్స్‌లను విస్తరించేందుకు యత్నిస్తున్నారని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

# వారంతా ఐక్యంగా ఉన్నారు...

**శశిథరూర్ పార్టీ మార్పు ఊహాగానాల వేళ రాహుల్ పోస్ట్ వైరల్**

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ... ఇటీవల దిల్లీలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశం సందర్భంగా కేరళలోని పార్టీ నాయకులంతా కలిసి నిల్చొన్న ఫొటోను ... 'వారంతా ఐక్యంగా ఉన్నారు, తమ ముందున్న లక్ష్యాల వెలుగులో వారంతా ఒక్కటిగా కనిపిస్తున్నారు' అంటూ టీమ్ కేరళ అనే హ్యాష్‌ట్యాగ్‌తో సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఆ నాయకులలో పార్టీ సీనియర్ నేత శశిథరూర్ సైతం ఉండడంతో ఆయన పార్టీ మార్పు ఊహాగానాలకు రాహుల్ ఫుల్‌స్టాప్ పెట్టినట్లు అయింది. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటనలో ఉన్న సమయంలో ఆయన వ్యవహరించిన తీరును థరూర్ ప్రశంసించడం, కేరళలో వామపక్ష కూటమి సర్కారు విధానాలను మెచ్చుకుంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు, కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, బ్రిటన్ సెక్రటరీ ఆఫ్ ట్రేడ్ జోనాథన్ రేనాల్డ్స్‌తో కలిసి ఉన్న ఫొటోను ఆయన షేర్ చేయడం, కాంగ్రెస్ పార్టీకి తన అవసరం లేదనుకుంటే...తన ముందు చాలా ప్రత్యామ్నాయాలు ఉన్నాయని పార్టీకి సందేశం పంపడం వంటి చర్యల నేపథ్యంలో థరూర్ కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరనున్నారనే ఊహాగానాలు హల్‌చల్ చేశాయి. వీటన్నింటినీ థరూర్ కొట్టిపడేశారు. అనంతరం రాహుల్ వారం రోజుల క్రితం పలుమార్లు శశిథరూర్‌ను కలిసి చర్చలు జరిపారు. ఈ క్రమంలో రాహుల్ పోస్ట్ ప్రాధాన్యత సంతరించుకుంది. 2026లో జరగనున్న కేరళ అసెంబ్లీ ఎన్నికల వ్యూహంపై పార్టీ అధిష్టానం కేరళ నేతలతో ఈ సమావేశంలో చర్చించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అగ్రనేతతో పాటు శశిథరూర్, అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ, కేరళ యూనిట్ చీఫ్ కె. సుధాకరన్, కేరళ అసెంబ్లీ కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సీఎల్పీ) నాయకుడు వీడీ సతీశన్, పార్టీ కేరళ ఇంఛార్జి దీపా దాస్‌మున్షీ పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.